PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 253 | విజయవాడ, గురువారం 18 ఏప్రిల్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 18 April 2024 | Rs

ఐఐటి బాంబేలో చదివినా..

నో ప్లేస్‌మెంట్

- 36 శాతం మంది గ్రాడ్యుయేట్ల దుస్థితి
- ఆర్థిక మాంద్యమే కారణం: అర్థికవేత్తలు

7

పేస్‌కు గుజరాత్ దాసోహం



- ఆరు వికెట్ల తేడాతో నెగ్గిన ఢిల్లీ
- సీజన్-17 ఐపిఎల్‌లో అత్యల్ప స్కోర్ నమోదు

8

గాజాలో ఊచకోతకు అదానీ డ్రోన్లు

- ఇజ్రాయిల్ కంపెనీతో అదానీ జాయింట్ వెంచర్
- అయిదేళ్లుగా హెర్మ్స్900 డ్రోన్ల సరఫరా
- వ్యూహాత్మక, రక్షణ పరిశ్రమలోకి ఇజ్రాయిలీ కంపెనీ ప్రవేశం
- రక్షణ రంగంలో ఎఫ్‌డిఐ నిబంధనల సడలింపు ఇందుకోసమేనా?

న్యూఢిల్లీ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తన అనుంగు మిత్రుడైన అదానీ కోసం దేశ ప్రతిష్టను పణంగా పెట్టింది. గాజాలో వేలాది మంది పాలస్తీనీయుల ఊచకోతకు ఉపయోగిస్తున్న డ్రోన్లలో చాలా వరకు అదానీ కంపెనీ సప్లై చేస్తున్నవేనని ది వైర్, అదానీ వాచ్‌తో సహా పలు మీడియా సంస్థలు ఆధారాలతో సహా వెల్లడించాయి. దేశ ప్రతిష్టతో బాటు జాతీయ భద్రతతో ముడిపడి ఉన్న కీలకమైన ఈ వార్తా కథనాలపై కేంద్ర రక్షణ శాఖ కానీ, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ కానీ, విదేశాంగ శాఖ కానీ ఇంతవరకు స్పందించలేదు. ఇజ్రాయిల్‌కు జర్మనీ ఆయుధాలు సరఫరా చేస్తున్నందుకు గాజాలో రక్తపాతంతో ఆ దేశానికి సంబంధముందని, కాబట్టి జర్మనీని యుద్ధ నేరస్థురాలిగా ప్రకటించాలని నికరాగ్వా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు లాగింది. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు అందజేస్తున్న అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలపుతున్నారు. ఇజ్రాయిల్ గత ఆరున్నర మాసాల్లో 34 వేల మంది పాలస్తీనీయులను ఊచకోత కోసింది. వీరిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలే. ఇజ్రాయిల్ దాష్టీకాలపై అంతర్జాతీయంగా ఆగ్రహావేశాలు వ్యక్తమైన తరువాత కూడా అదానీ డ్రోన్ల సరఫరా ఆగలేదు. బొగ్గు మైనింగ్ కాంట్రాక్టులకు సంబంధించి అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఇజ్రాయిలీ ఆయుధ తయారీ సంస్థ ఎల్‌బిట్ సిస్టమ్స్‌తో కలసి 2018లో హైదరాబాద్ సమీపంలో అదానీ ఎయిరో స్పేస్ పార్కులో 15 మిలియన్ డాలర్లతో జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేశాయి. రెండేళ్ల తరువాత అంటే 2020 ఫిబ్రవరి6న అదానీ డిఫెన్స్ ఎయిరో స్పేస్, ఎల్‌బిట్ సిస్టమ్స్‌తో కలసి ప్రైవేట్ మానవ రహిత యుద్ధ విమానాల (యుఎవి) తయారీ యూనిట్‌ను ప్రారంభించింది. ఇక్కడ తయారైన హెర్మ్స్ 900 డ్రోన్లు (వీటిని దృష్టి-10 అని కూడా పిలుస్తారు), యుఎవిలను అదానీ కంపెనీ ఇజ్రాయిల్‌కు సప్లై చేస్తోంది. ఇప్పటివరకు 20కి పైగా యుఎవిలను, డ్రోన్లను అందించింది. ఇజ్రాయిల్‌కు అదాని డ్రోన్లు సప్లయి



అదానీ గ్రూపునకు చెందిన డ్రోన్

గురించి హిందుస్థాన్ టైమ్స్ పత్రిక జనవరిలో ఒక ప్రత్యేక వార్తా కథనాన్ని ప్రచురించింది. అదానీ గ్రూపు దీనిపై స్పందిస్తూ ఇజ్రాయిల్‌కు డ్రోన్లు, యుఎవిలు సప్లయి చేసిన మాట నిజమే. అయితే ఇవి యుద్ధేతర అవసరాల కోసం పంపినవేనని వివరణ ఇచ్చింది.

గత ఫిబ్రవరిలో దివైర్‌తో సహా దేశ విదేశాల్లోని వివిధ మీడియా సంస్థలు వరుసగా కొన్ని కథనాలను ప్రచురించాయి. తాజాగా ది వైర్ రాసిన కథనంలో భారత్ ఐరాస తీర్మానాల విషయంలో వేసిన



ఇజ్రాయిల్‌లోని హైఫా పోర్టును అదానీ గ్రూప్‌నకు అప్పగించే ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ, గౌతమ్ అదానీ, (ఫైల్ ఫొటో)

కుప్పిగంతులకు, అదానీ డ్రోన్లకు ఉన్న లింక్‌ను గురించి బయటపెట్టింది. గాజాలోకాల్పుల విరమణ పాటించాలని కోరుతూ 2023 డిసెంబరులో ఐరాస జనరల్ అసెంబ్లీలో తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన భారత్, ఈ నెల5న ఐరాస మానవహక్కుల సంస్థ (యుఎన్‌హెచ్ఆర్‌సి)లో అదే విధమైన తీర్మానం ఓటింగ్‌కు వచ్చినప్పుడు గైర్హాజరైంది. భారత్ వైఖరిలో ఈ మార్పుకు అమెరికా ఒత్తిడితో బాటు, అదానీ డ్రోన్ల సప్లయి కూడా ఒక ముఖ్య కారణమని ఆ కథనం వెల్లడించింది. ఆ తీర్మానం కాల్పుల విరమణ పాటించాలని కోరడంతో బాటు ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరాపై నిషేధం విధించాలని కూడా మిగతా 2లో

- 2018లో అదాని ఎంటర్‌ప్రైజెస్, ఇజ్రాయిలీ ఆయుధ తయారీ సంస్థ ఎలిబిట్‌తో కలసి
- హైదరాబాద్‌లోని అదానీ ఎయిరో స్పేస్ పార్కులో జాయింట్ వెంచర్ యూనిట్ ఏర్పాటు
- 2020 ఫిబ్రవరి6 అదానీ డిఫెన్స్ ఎయిరో స్పేస్, ఎలిబిట్ కలసి ప్రైవేట్ యుఎవి యూనిట్ కాంప్లెక్స్ నెలకొల్పాయి
- హెర్మ్స్900 డ్రోన్ల నిఘాకు, వైమానిక దాడులకు ఉపయోగించవచ్చు.
- 32వేల అడుగుల ఎత్తులో పయనిస్తూ భూమి మీద, సముద్రం మీద లక్ష్యాలను సులువుగా పసిగట్టే సామర్థ్యం కలిగి ఉన్నాయి.
- 2014లో గాజాపై 50 రోజుల పాటు సాగించిన దాడుల్లో హెర్మ్స్ డ్రోన్లను మొదటిసారి ఉపయోగించింది.



వెంకటాయపాలెంలో దళితుల కాలనీ

ఇదేనా న్యాయం?

శిరోముండనం తీర్పుపై వెంకటాయపాలెంలో అసంతృప్తి

ప్రజాశక్తి - రామచంద్రపురం (అంబేద్కర్ కోనసీమ జిల్లా)

'ఆలస్యమైనా న్యాయం జరుగుతుందని ఆశించాం. దోషులకు కఠినశిక్షలు పడుతాయనుకున్నాం. కానీ జరిగింది వేరు' 28 ఏళ్ల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన శిరోముండనం అమానవీయ సంఘటనకు వేదికైన వెంకటాయపాలెం దళితవాడలో ఒక యువకుని అభిప్రాయమిది. ప్రత్యేకకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం ప్రజాశక్తి ఆ గ్రామంలో పర్యటించింది. తీర్పుపై స్థానికుల మనోగతాన్ని తెలుసుకునే ప్రయత్నం చేసింది. సుదీర్ఘ విచారణ తరువాత వచ్చిన తీర్పు పట్ల పలువురు అసంతృప్తిని వ్యక్తం చేశారు. 28 ఏళ్ల క్రితం ఆ సంఘటన జరిగిన తరువాత తాము ఎదుర్కొన్న దుర్భర పరిస్థితులను, పెత్తందారులు చేసిన దౌర్జన్యాలను మరికొందరు గుర్తుచేసుకున్నారు. 'చాలా కష్టపడి పోరాడాం. తోట త్రిమూర్తులుకు 18 నెలల జైలుశిక్ష వేశారు. అయితే, ఆయన అసలు జైలుకే వెళ్లరని, బెయిలు వచ్చేస్తుందని చెబుతున్నారు. ఇక మాకు జరిగిన న్యాయం ఎక్కడ?' అని మరొకరు ప్రశ్నించారు. దళితవాడలో ఈ అంశంపైనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. బాధితులకు సరైన న్యాయం చేకూర్చలేదని గ్రామంలో దళిత యువకులు అంటు న్నారు. దోషిగా తేలిన తోట త్రిమూర్తులుకు కేవలం 18 నెలలు జైలు శిక్ష విధించడం సరికాదని, కఠిన శిక్ష పడాలన్న అభిప్రాయం వీరిలో వ్యక్తమవుతోంది.

అమలుగాని హామీలు

మరోవైపు సంఘటన జరిగిన సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూడా నేటికీ అమలుకాకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాధితులకు అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగం, పంట భూమి, ఆర్థిక సాయం అందజేస్తామంటూ నమ్మబలికారని, వాటిలో ఒక్క హామీ మిగతా 2లో

ఇప్పటికీ న్యాయం జరగలేదు



28 ఏళ్లుగా న్యాయం కోసం ఎదురుచూశాను. ఇప్పటికీ న్యాయం జరగలేదు. బాధితులను ఆదుకుంటాం, ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం, పంట భూమి అందిస్తాం, ఆర్థిక సాయం చేస్తామంటూ అప్పటి టిడిపి సర్కారు హామీ ఇచ్చింది. కాని అవి నేటికీ అమలు కాలేదు. హామీలిచ్చిన ప్రభుత్వమే ఒకానొక సమయంలో కేసును ఎత్తివేసేందుకు కూడా ప్రయత్నించింది. ప్రధాన ముద్దాయికి 18 నెలలు జైలు శిక్ష వేసి చేతులు దులుపుకోవడంతో అతను తిరిగి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కల్పించారు. మాకు కనీస సాయం కూడా లభించలేదు.

- చల్లపూడి పట్టాభి, బాధితుడు

దాడి కేసులో 'బొండా'ను ఇరికించే యత్నం

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికార పార్టీ కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రిపై రాయి దాడి విషయంలో తప్పుడు ప్రచారాలు, సింపతీ డ్రామాలతో వైసిపి అభాసుపాలైందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు రోజులు గడుస్తున్నా దీనిపై పోలీసు ఉన్నతాధికారులు స్పష్టమైన ప్రకటన చేయలేకపోయారని అన్నారు. వీళ్లే నిందితులు అంటూ వడ్డెర కాలనీకి చెందిన యువకులను, మైనర్లను పోలీసులు తీసుకుపోయారని పేర్కొన్నారు. దీనిపై ఆ కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను, టిడిపి ముఖ్యనేతలను కేసుల్లో ఇరికించాలనే పన్నాగంతో వైసిపి పావులు కదుపుతోందని, దీనికోసం నిందితులకు టిడిపి నేతలతో సంబంధాలున్నట్లు చిత్రీకరించేలా విశ్వప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ఇందులో భాగంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి బొండా ఉమను కేసులో ఇరికించేందుకు వైసిపి కుట్రలు చేస్తోందని



ఆరోపించారు. అధికార పార్టీ ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోనై బొండా ఉమపై తప్పుడు కేసులు పెట్టినా, తప్పు చేసినా తమ ప్రభుత్వం రాగానే చాలా కఠినంగా శిక్షించబడతారని హెచ్చరించారు. ఎన్నికల సంఘం కూడా అధికార దుర్వినియోగంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రికి భద్రతను కల్పించడంలో విఫలమైన అధికారులను విచారణ బాధ్యతల నుంచి తప్పించి, కేంద్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణతో వేరే అధికారులతో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇసికి టిడిపి లేఖ

తమ పార్టీ నేత బొండా ఉమామహేశ్వరరావుపై అక్రమ కేసులు పెట్టకుండా విజయవాడ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌తోపాటు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా, డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డికి టిడిపి లేఖలు రాసింది. ముఖ్యమంత్రిపై రాయి దాడికి సంబంధం లేకపోయినా తప్పుడు కేసు బనాయించి అరెస్టు చేసేందుకు పోలీసులు కుట్ర పన్నుతున్నారని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పేర్కొన్నారు.

రాయి దాడి కేసులో బొండా ఉమను ఇరికించేందుకు జగన్ కుట్ర పన్నారని టిడిపి నేతలు చినరాజప్ప, నిమ్మల రామానాయుడు ఒక ప్రకటనలో విమర్శించారు. ఓటమి భయంతో మరో బిసి బిడ్డను బలి చేసే కుట్రకు జగన్ ప్రయత్నిస్తున్నారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. జగన్ పాలన జంబో సలహాదారులతో సాగిందని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. సిద్ధం సభలు వెలవెలబోతున్నాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ షరీఫ్ అన్నారు.

భారత జనాభా 144 కోట్లు

- 14 ఏళ్ల లోపు బాలలు 24 శాతం మంది
- ప్రసూతి మరణాలు 8 శాతం
- ఆరోగ్య సంరక్షణలోనూ అసమానతలు
- యూఎన్‌ఎఫ్‌పిఎ నివేదిక



న్యూఢిల్లీ : భారత్ ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా తయారైంది. తాజాగా ఆ జనాభా 144 కోట్లకు చేరినట్టు అంచనా. ఇందులో 0-14 ఏళ్ల మధ్య వయస్సున్న వారు 24 శాతంగా ఉన్నారు. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్స్ (యుఎన్‌ఎఫ్‌పిఎ) స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్-2024 నివేదిక "ఇంటర్‌వోవెన్ లైవ్స్, థ్రెడ్స్ ఆఫ్ హోప్: ఎండింగ్ ఇనాక్విలిటీస్ ఇన్ సెక్సువల్ అండ్ రి అండ్ ప్రొడక్టివ్ హెల్త్ అండ్ రైట్స్" వెల్లడించింది. ఇది భారతదేశ జనాభా 77 ఏళ్లలో రెట్టింపవుతుందని అంచనా వేసింది. 144.17 కోట్ల మంది జనాభాతో ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రస్థానంలో ఉండగా, చైనా 142.5 కోట్లతో రెండో స్థానంలో ఉన్నదని నివేదిక పేర్కొన్నది. 2011లో భారత ప్రభుత్వం నిర్వహించిన చివరి జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభా 121 కోట్లుగా నమోదైంది.

ఇక భారత్‌లో 17 శాతం మంది 10-19 ఏళ్లలోపు వారు ఉన్నారని యూఎన్ నివేదిక వివరించింది. 10-24 సంవత్సరాల వయస్సు గల వారు 26 శాతం, 15-64 సంవత్సరాల వయస్సు గలవారు 68 శాతంగా ఉన్నారని అంచనా వేసింది. అలాగే 7 శాతం మంది 65 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు గలవారుగా నివేదిక వివరించింది. ఆయుర్దాయం పురుషులది 71 సంవత్సరాలుగా, స్త్రీలు 74 ఏళ్లుగా అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా లైంగిక, మిగతా 2లో

మావోయిస్టులను వదలం

- రక్షణ ప్రాంతాలు లేకుండా చేస్తాం
- భారీ ఎన్‌కౌంటర్‌కు కొద్దిరోజుల ముందు ఇంటర్వ్యూలో బస్తర్ ఐజి



దండకారణ్యంలో 29 మంది మావోయిస్టులను బలిగొన్న కాంకర్ ఘటన కలకలం రేపింది. భద్రతా దళాల కాల్పుల్లో ఇంతపెద్ద సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘటనకు కొద్దిరోజుల ముందు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మావోయిస్టులను వదలేది లేదని, దండకారణ్యంలో వారికున్న కొద్దిపాటి రక్షణ ప్రాంతాలను (సేఫ్ పాకెట్స్)ను లేకుండా చేస్తామని బస్తర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ పి.సుందర్‌రాజ్ చెప్పారు. పదకొండేళ్ల పాటు మావోయిస్టు ప్రభావ ప్రాంతాల్లోనే వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన చెప్పిన విషయాలు క్లుప్తంగా:

ప్ర: ఎన్నికల ముందు ఎటువంటి భద్రతా చర్యలు తీసుకుంటున్నారు?

జ: బస్తర్‌లో 60 వేల మంది భద్రతా సిబ్బంది ప్రస్తుతం విధుల్లో ఉన్నారు. వీరిలో మా ప్రత్యేక బృందాలతో పాటు, ఎన్నికల కమిషన్ పంపిన అదనపు బలగాల సిబ్బంది కూడా ఉన్నారు.

ప్ర: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఐఇడి పేలుళ్లలో ఇద్దరు భద్రతా సిబ్బంది మరణించారు. ఈ సారి అలాంటి సంఘటనలు జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఐఇడిలు పెద్ద ముప్పుగా మారాయి. నిజానికి అవి మాకు సవాల్ విసురుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మందుపాతరలను నిర్వీర్యం చేసే చర్యలను పెద్దఎత్తున చేపట్టాం. వీటిని కొనసాగిస్తాం. ఇప్పటివరకు 55 మందుపాతరలు దొరికాయి. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు భద్రతా సిబ్బంది చనిపోయింది నిజం. కానీ, గతంతో పోలిస్తే ఇటువంటి సంఘటనల్లో ప్రాణనష్టం కనిష్టస్థాయికి చేరింది.

ప్ర: మావోయిస్టులను అదుపు చేయడానికి ఎటువంటి వ్యూహాలను అమలు చేస్తున్నారు?

జ: మేం బహుముఖ విధానాలతో పనిచేస్తున్నాం. ప్రధానంగా మావోయిస్టుల కార్యక్రమాలను అదుపుచేయడంపై దృష్టి పెడుతున్నాం. అంతర్‌రాష్ట్ర కార్యకలాపాలపై నియంత్రణ సాధిస్తున్నాం. మారుమూల ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాం. రోడ్లు, వంతెనలు, మొబైల్ నెట్ వర్క్‌తో ఈ ప్రాంతాన్ని అనుసంధానం చేస్తున్నాం. దీనివల్ల ఇక్కడి ప్రజల మనస్సుల్లోంచి తాము ఒంటరి వాళ్లమన్న భావనను తుడిచివేస్తున్నాం.

ప్ర: గత ఏడాది (24) కాల్చివేయబడ్డ మావోయిస్టుల కంటే ఈ ఏడాది ఇప్పటికే (50) ఎక్కువమంది మావోయిస్టులు మరణించారు. (కాంకర్ ఘటన జరగలేదు) దీని ప్రభావం ఎన్నికల వేళ ఉండదా?

జ: మావోయిస్టు క్యాడర్ అంతరించి పోతున్నప్పటికీ, మాకు నష్టం కలిగించే వారి శక్తి, సామర్థ్యాలను తక్కువగా అంచనా వేయడం లేదు. మందుపాతరల రూపంలో ముప్పు పొంచే ఉంది, అవసరమైన చర్యలు తీసుకుంటూనే ఉన్నాం.

ప్ర: ఇటీవల జరిగిన సంఘటనలను బూటకపు ఎన్‌కౌంటర్లని కుటుంబ సభ్యులు ఆరోపించారు...?

జ: స్థానిక ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, భద్రతా బలగాలు తప్పుచేశాయన్న భావనను సృష్టించడానికి మావోయిస్టులు ఈ తరహా ప్రచారం చేస్తారు.

ప్ర: బస్తర్‌లో మావోయిస్టుల ప్రభావం ఎలా ఉంది?

జ: బీజాపూర్, సుక్మా.కంకేర్‌లో వారికి కొన్ని స్థావరాలు ఉన్నాయి. అక్కడ మేం కూడా స్థిరంగా ఉన్నాం. అబుజ్‌మద్ వంటి కొన్ని ప్రాంతాల్లో సమస్య ఉంది. బీజాపూర్‌లోని నేషనల్ పార్కు సురక్షిత రవాణా మార్గంగా ఉంది. బీజాపూర్, సుక్మా వద్ద సరిహద్దుల్లోనూ ఈ తరహా ప్రాంతం ఉంది. ఇవి సీనియర్ మావోయిస్టులకు రక్షణ ప్రాంతాలుగా మారాయి. వీటిని వారు సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారు. అక్కడ నుండి రాకపోకలు సాగిస్తున్నారు. ఇలా రక్షణ పొందుతున్న మావోయిస్టులను ఎవరినీ వదలం. రక్షణ ప్రాంతాలు (సేఫ్ ప్యాకెట్లు)ను పూర్తిగా నిర్మూలిస్తాం.

ప్ర: 11 సంవత్సరాలు మీరు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లోనే పనిచేశారు. మీ పరిశీలన ఏమిటి?

జ: నేను 2005-2006లో అవిభక్త బస్తర్‌లో ఎఎస్‌పిగా మొదట విధుల్లో చేరాను. 2004 నుండి 2014 వరకు మావోయిస్టుల కార్యక్రమాలు ఉధృతంగా సాగాయి. భద్రతా సిబ్బందితోపాటు, సామాన్య ప్రజలు కూడా ఈ కాలంలో పెద్ద ఎత్తున మరణించారు. అప్పుడు మా బలం కేవలం 25వేల మంది మాత్రమే. ఇప్పుడు దాదాపుగా లక్షమందిమి ఉన్నాము. సాంకేతిక అంశాల్లో స్పష్టమైన పైచేయి సాధించాం. జవాన్లకు జంగిల్ వార్‌ఫేర్‌లో శిక్షణ ఇచ్చాం. మొదట్లో కొంత సైద్ధాంతిక భావజాలంతో పనిచేసిన మావోయిస్టులు ఆ తరువాత ఎటువంటి భావజాలం లేకుండా పోయారు.

నేటి నుంచి నామినేషన్లు

- 11 నుంచి 3 గంటల వరకు స్వీకరణ
- సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఘట్టం నేటి (గురువారం) నుంచి ప్రారంభమవుతుందని, ఇందుకోసం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఆయా కలెక్టరేట్లలో, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లో నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కో అభ్యర్థి గరిష్టంగా నాలుగు సెట్లను దాఖలు చేయవచ్చని, ఒక అభ్యర్థి ఏవైనా రెండు స్థానాల్లో మాత్రమే పోటీ చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే ఆర్ఒ కార్యాలయం వరకు అనుమతిస్తారని, మిగిలినవారిని వంద మీటర్ల అవతల నిలిపివేస్తారని చెప్పారు. అభ్యర్థితో మొత్తం మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. పోటీ చేసే అభ్యర్థులు పార్లమెంటుకు రూ.25 వేలు, అసెంబ్లీకి రూ.10 వేలు ధరావతు చెల్లించాల్సి ఉంటుందని సిఇఒ తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు ధరావతు మొత్తంలో 50 శాతం చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం రికార్డు చేసేందుకు నామినేషన్లను స్వీకరించే గదిలో, అభ్యర్థులు ప్రవేశించే ద్వారాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు మోడల్ కోడ్ అమల్లో భాగంగా అభ్యర్థుల ఊరేగింపులను నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమాలను సైతం వీడియో రికార్డింగు చేస్తారని సిఇఒ తెలిపారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అభ్యర్థులు నామినేషన్ దాఖలుకు 13 రకాల డాక్యుమెంట్లను తీసుకు రావాలి. పార్లమెంట్‌కు మిగతా 2లో

ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్

ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ జారీ (నామినేషన్ల స్వీకరణ ప్రారంభం)	18.04.24
నామినేషన్లకు చివరి తేదీ	25.04.24
పరిశీలన	26.04.24
ఉపసంహరణ	29.04.24
పోలింగ్	13.05.24
కౌంటింగ్	04.06.24
ఎన్నికల ప్రక్రియ ముగిసేది	06.04.24

బాలకృష్ణ, లోకేష్‌పై చర్యలు తీసుకోండి

- ఎన్నికల సంఘానికి వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల నియమావళికి విరుద్ధంగా సిఎం జగన్‌పై వ్యక్తిగతంగా, వైసిపిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నందమూరి బాలకృష్ణ, యూట్యూబ్ ద్వారా పాటలు ప్రసారం చేస్తున్న నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని వైసిపి డిమాండ్ చేసింది. ఈ మేరకు వైసిపి ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, పార్టీ గ్రీవెన్స్ సెల్ ఛైర్మన్ నారాయణమూర్తి, లీగల్ సెల్ నేత శ్రీనివాసరెడ్డి బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

ఎన్‌కౌంటర్ ప్రాంతంలో రాజ్యమేలుతున్న మౌనం !

- చెట్లపై బుల్లెట్ గుర్తులు
- నోరు విప్పని గ్రామస్తులు

కాంకర్ : ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని మూడు జిల్లాల సరిహద్దుల్లో మంగళవారం తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత ఆ ప్రాంతమంతా మౌనం రాజ్యమేలుతోంది. ఎన్‌కౌంటర్ జరిగి ఇన్ని గంటలు గడిచినా బుధవారానికి కూడా ఆ ప్రాంతంలోని చెట్లపై బుల్లెట్ గుర్తులు కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలోని నేలపై రక్తం మరకల తడి ఆరలేదు. నేలకు రాలిన వెదురు ఆకులు దట్టంగా పచ్చిక మాదిరిగా నేలను కప్పుతున్నాయి. ఆ సమీప గ్రామాల ప్రజలైన స్థానిక గిరిజనులు, ఎక్కువ మంది మహిళలే, బయటకు కనిపిస్తున్నారు. కానీ ఎన్‌కౌంటర్ సమయంలో వారు చూసిందీ, విన్నది చెప్పడానికి సుముఖంగా లేరు. ఆ ప్రాంతంలోని అకమెటా గ్రామ వాసి లింగారామ్ మాట్లాడుతూ.. తన కజిన్ సుక్కు ఈ ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని విలేకర్లకు తెలిపారు. ఆ విషయం బుధవారమే తెలిసిందన్నారు. సుక్కు మృతదేహం కోసం వారి కుటుంబం పోలీసులను కలవాల్సి వుందన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి వెళ్ళే మార్గమంతా ఎగుడు దిగుడు రోడ్లతో, పలుచోట్ల తవ్వేసి వుంది. లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని ప్రజలకు పిలుపిస్తూ వేసిన నక్సలైట్ల పోస్టర్లు చెల్లాచెదురుగా పడి వున్నాయి. మరణించిన నక్సలైట్లకు చెందిన వస్తువులు ఆ ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. మంగళవారం తెల్లవారుజామున తుపాకీ మోతలు వినిపించాయని మాత్రమే మరో గ్రామస్తుడు తెలిపారు. అంతకుమించి వివరాలు వెల్లడించడానికి ఇష్టపడలేదు. దట్టమైన వెదురు చెట్లతో నిండిన ఆ ప్రాంతంలో ఖాళీ సిరంజీలు, సాఫ్ట్ డ్రింక్ బాటిళ్ళు, గాయపడిని వారిని మోసుకెళ్ళేందుకు భద్రతా సిబ్బంది ఉపయోగించే తాత్కాలిక స్ట్రెచర్లు పడి వున్నాయి. ఎన్‌కౌంటర్ నాలుగు గంటల పాటు సాగింది.

నాలుగేళ్లలో టెక్ పరిశ్రమలో 35% మంది మహిళా ఉద్యోగులు

- టీమ్‌లీజ్ డిజిటల్ అంచనా

న్యూఢిల్లీ : టెక్నాలజీ పరిశ్రమలో 2027 నాటికి మహిళా ఉద్యోగుల సంఖ్య 35 శాతానికి చేరొచ్చని టీమ్‌లీజ్ డిజిటల్ అంచనా వేసింది. ప్రస్తుతం 25 శాతం మంది మహిళా ఉద్యోగులున్నారని పేర్కొంది.. 'ఉమెన్ ఎట్ ది హార్ట్ ఆఫ్ ఇండియాస్ డిజిటల్ ఎవల్యూషన్' అనే శీర్షికతో ఆ సంస్థ ఓ రిపోర్ట్‌ను విడుదల చేసింది. ఈ నివేదిక భారతదేశంలోని మహిళా టెక్ వర్క్‌ఫోర్స్‌లోని వివిధ అంశాలను పరిశీలించింది. రాబోయే రోజుల్లో క్వాంటం కంప్యూటింగ్ సైంటిస్ట్, బ్లాక్‌చెయిన్ డెవలపర్, ఎఐ ఎథిక్స్ ఆఫీసర్, ఎఐ పరిశోధకుడు, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్, 5జి టెక్నాలజీ స్పెషలిస్ట్, ఎడ్జ్ కంప్యూటింగ్ స్పెషలిస్ట్ వంటి సాంకేతిక విభాగాల్లో అధిక డిమాండ్ ఉంటుందని పేర్కొంది.

పోటీకి గులాం నబీ అజాద్ దూరం

శ్రీనగర్ : త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో డెమెక్రటిక్ ప్రొగ్రెసివ్ అజాద్ పార్టీ (డిపిఎపి) అధ్యక్షులు గులాం నబీ అజాద్ పోటీ చేయడం లేదు. ఈ విషయాన్ని పార్టీ బుధవారం వెల్లడించింది. కొన్ని కారణాలతో అజాద్ పోటీ చేయడం లేదని తెలిపిన పార్టీ, ఆ కారణాలను మాత్రం వెల్లడించలేదు. ముందుగా అనంత్‌నాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానం నుంచి అజాద్ పోటీ చేస్తారని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ స్థానం నుంచి డిపిఎపి తరుపున న్యాయవాది సలీమ్ పర్రేను అభ్యర్థిగా నిర్ణయించినట్లు పార్టీ నాయకులు అమీన్ భట్ తెలిపారు. ఈ స్థానం నుంచి పిడిపి తరుపున మహబూబ ముఫ్తీ, ఎన్‌సి తరుపున మెయిన్ అల్తాఫ్ పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే.

గ్రాండ్ థెఫ్ట్‌లో 600 మందిపై వేటు

శాన్‌ఫ్రాన్సిస్కో : వీడియో గేమింగ్ కంపెనీ గ్రాండ్ థెఫ్ట్ ఆటో ఫ్రాంఛైజీ మేకర్ 'టేక్ టూ' ఇంటరాక్టివ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులపై వేటు వేసింది. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా కంపెనీ ఉద్యోగుల్లో 5 శాతం లేదా 600 మంది ఉద్యోగులను ఇంటికి పంపించాలని నిర్ణయించింది. కంపెనీ అభివృద్ధి చేస్తున్న పలు ప్రాజెక్టులను నిలిపివేసింది. ఈ చర్యలతో కంపెనీకి ఏటా 165 మిలియన్ డాలర్లను ఆదా కానున్నట్లు తెలిపింది. 2023 మార్చి నాటికి ఇందులో 11.580 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

- సమైక్య విధానాన్ని దెబ్బతీసే శక్తులకు బుద్ధి చెప్పాలి
- సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు


సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణరావు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమైక్య విధానం, న్యాయ విధానాలు దెబ్బతింటున్నాయని, వీటిని కాపాడుకునేందుకు ప్రజలు, ప్రజాతంత్ర వాదులంతా ముందుకు వచ్చి రానున్న ఎన్నికల్లో వాటిని రక్షించుకునేందుకు తగిన నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. 'భారత రాజ్యాంగం-ప్రజాస్వామ్య వ్యవస్థ- ఎన్నికలు' అనే అంశంపై ఒంగోలులోని యుటిఎఫ్ కార్యాలయంలో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు జరిగింది. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. 40 ఏళ్ల కిందట పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతో పటిష్టంగా ఉండేదని, తరువాత కాలంలో ప్రజాస్వామ్య విలువలు తగ్గుముఖం పట్టాయని వివరించారు. రాజకీయాల్లోకి కార్పొరేట్ శక్తులు ప్రవేశించడమే ఇందుకు కారణమని తెలిపారు. రాజకీయాలను శాసించే స్థాయికి వారు ఎదిగారన్నారు. పదేళ్ల బిజెపి పాలనలో అన్ని వ్యవస్థలూ ధ్వంసమయ్యాయని తెలిపారు. మరోవైపు కేంద్రానికి భయపడి ప్రాంతీయ పార్టీలు పూర్తిగా లొంగిపోయాయని, ఇందుకు మన రాష్ట్రమే ఉదాహరణ అని అన్నారు. రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా ఈ పరిస్థితి సుస్పష్టంగా కనిపించిందని తెలిపారు. ఒక్క ఎమ్మెల్యే లేని బిజెపికి ఆంధ్రరాష్ట్రంలో వంద శాతం ఓట్లు అనుకూలంగా రావడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. 2029లో జమిలి ఎన్నికలు తెస్తామని బిజెపి చెబుతోందని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదని అన్నారు. బిజెపి మరలా అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులకు అనుకూలంగా ప్రజలు నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్, ఆల్ పెన్షనర్స్ అసోషియేషన్ నాయకులు శేషయ్య, జెవివి జిల్లా కార్య కార్యదర్శి జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో వేడుకగా ధ్వజారోహణం

- వైభవంగా శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట (వైఎస్ఆర్ జిల్లా)


వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట కోదండరామస్వామి వారి ఆలయంలో బుధవారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జెఇఒ వీరబ్రహ్మం మాట్లాడుతూ.. ధ్వజారోహణంతో వైభవంగా రాములవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రధానంగా ఏప్రిల్ 20న హనుమంత వాహనం, ఏప్రిల్ 22న కల్యాణోత్సవం, ఏప్రిల్ 23న రథోత్సవం, ఏప్రిల్ 25న చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 22న సాయంత్రం 6:30 నుంచి రాత్రి 8:30 గంటల వరకు సీతారాముల కల్యాణం వైభవంగా జరగనున్నట్లు చెప్పారు. కంకణబట్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ... ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేసినట్టు తెలిపారు. అనంతరం వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు. కార్యక్రమంలో టిటిడి సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ జగదీశ్వర్‌రెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, ఇతర అధికారులు, యాత్రికులు పాల్గొన్నారు.


ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపడితులు

కమనీయం...భద్రాద్రి రామయ్య కల్యాణం

- ప్రభుత్వం తరఫున సిఎస్ లాంఛనాలు
- నేడు పట్టాభిషేక మహోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



భద్రాద్రిలో శ్రీరామనవమి వేడుకలు శోభయమానంగా కొనసాగుతున్నాయి. భద్రాచల పుణ్యక్షేత్రంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. పట్టాభిషేక మహోత్సవాన్ని గురువారం నిర్వహిస్తారు. సీతమ్మ మెడలో రామయ్య తాళి కట్టడంతో కల్యాణ క్రతువు పూర్తవుతోంది. మిథులా స్టేడియంలోని మండపంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉదయం రామాలయంలో మూలవరులకు మొదట కల్యాణం జరిగింది. ఆపై ఉత్సవమూర్తులను ఆలయం నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా మిథులా కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ గావించారు. తరువాత భక్తులు గోటితో వలసిన తలంబ్రాలను సీతారాముల శిరస్సుపై పోశారు. తదనంతర కార్యక్రమాలను అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్తి చేశారు.లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సీతారాములకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పట్టువస్త్రాలను సమర్పించారు. సీతారామచంద్రుల కళ్యాణం కోసం మిథిలా కల్యాణ మండపంలో 24 సెక్టార్లు ఏర్పాటు చేశారు.

బందరు పోర్టుకు పూర్వ వైభవం తెస్తాం

- జగన్ డ్రామాలు నమ్మొద్దు
- పెడన, మచిలీపట్నం ప్రజాగళం సభల్లో చంద్రబాబు


మచిలీపట్నంలో జరిగిన ప్రజాగళంలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

బందరు ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కృష్ణా జిల్లా పెడన, మచిలీపట్నంలో బుధవారం టిడిపి ప్రజాగళం సభలు జరిగాయి. ఈ సభలకు చంద్రబాబుతోపాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హాజరై మాట్లాడారు. ఈ సభల్లో చంద్రబాబు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ముఖ్యమమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుతున్న డ్రామాలు నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 2014 ఎన్నికల్లో తండ్రిలేని బిడ్డనని, 2019లో కోడికత్తి, బాబాయ్ హత్య డ్రామాలను చూపి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతూ జగన్ గద్దెనెక్కారన్నారు. ఈ ఎన్నికల్లో రాయి డ్రామా బెడిసి కొట్టడంతో ప్రజల సానుభూతి కోసం మరిన్ని డ్రామాలకు సిద్ధపడుతున్నారని అన్నారు. మద్యం, అక్రమ ఇసుక రవాణా, భూ దందాల్లో చేసిన దోపిడీ డబ్బులను పంచి అధికారంలోకి రావడానికి వైసిపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. జగన్ మాటలకు ప్రజలు మోసపోవద్దన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. టిడిపి, జనసేన, బిజెపి పార్టీల జెండాలు వేరైనా.. అజెండా మాత్రం అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ అని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పింఛను రూ.4 వేలకు పెంచుతామని, చేనేత, కళంకారీ, వ్యవసాయ కార్మికులను ఆదుకుంటామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మించి డెల్టా ప్రాంతంలో మూడు పంటలకు సాగునీరిచ్చి ప్రజల ఆదాయాలు పెంచుతామని, బందరు - రేపల్లే రైల్వే లైను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.


ఉపాధి, భవన నిర్మాణ కార్మికుల నిధులు దారి మళ్లింపు : పవన్ కల్యాణ్

ఉపాధి హామీ పనుల నిధులు రూ.347 కోట్లు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి.. క్లాస్ వార్ గురించి మాట్లాడుతున్నారని పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. ప్రజాగళం సభల్లో ఆయన మాట్లాడుతూ.. కరెంట్ ఛార్జీలను పదిసార్లు పెంచి ప్రజలపై భారాలు మోపారన్నారు. మద్యం ధరలు పెంచారని, ఇసుక, మట్టి దందాలు, భూ ఆక్రమణలతో వైసిపి నాయకులు కోట్లాది రూపాయలు దోచేశారని ఆరోపించారు. తాను భీమవరం నుండి సీటు మారానని విమర్శిస్తున్న సిఎం జగన్... రాష్ట్రంలో 70 మంది వైసిపి అభ్యర్థులను ఎందుకు మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. జనసేన మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, టిడిపి పెడన, మచిలీపట్నం అభ్యర్థులు కాగిత కృష్ణప్రసాద్, కొల్లు రవీంద్ర, బిజెపి జిల్లా అధ్యక్షులు జి.రాజాబాబు తదితరులు సభల్లో పాల్గొన్నారు.

నంద్యాలలో 44.9 డిగ్రీలు

- 192 మండలాల్లో వడగాడ్పులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో సూర్యుడు భగభగమంటున్నాడు. బుధవారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లా పెద్ద దేవళాపురం గ్రామంలో అత్యధికంగా 44.9 డిగ్రీలు నమోదైంది. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ, కడప జిల్లా సింహాద్రిపురంలో 44.3 డిగ్రీలు చొప్పున, అనకాపల్లి జిల్లా రావికవతం, విజయనగరం జిల్లా రామభద్రాపురం, తుమ్మికాపల్లి, ప్రకాశం జిల్లా దొనకొండ, తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 44.1 డిగ్రీల చొప్పున, కర్నూలు జిల్లా వగరూరు గ్రామంలో 43.9 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 43 డిగ్రీలకు పైగా 16 జిల్లాల్లో నమోదైనట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 67 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 125 మండలాల్లో వడగాడ్పులు వీచాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో గురువారం 76 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 214 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం వుందని, శుక్రవారం 47 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 229 వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపారు. గురువారం శ్రీకాకుళం జిల్లాలో 12, విజయనగరంలో 22, పార్వతీపురం మన్యంలో 13, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4, అనకాపల్లిలో 11, కాకినాడలో 3, తూర్పుగోదావరి, ఎన్‌టిఆర్ జిల్లాల్లో రెండు మండలాలు చొప్పున, పల్నాడు జిల్లాలో 7 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

భారత జనాభా 144 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

పునరుత్పత్తి ఆరోగ్యంలో 30 ఏళ్ల పురోగతి ఎక్కువగా అత్యంత అట్టడుగు వర్గాలను విస్మరించిందని నివేదిక కనుగొన్నది. భారత్‌లో 2006-2023 మధ్య బాల్య వివాహాల శాతం 23గా ఉన్నదని పేర్కొన్నది. అలాగే, దేశంలో ప్రసూతి మరణాలు ప్రపంచవ్యాప్తంగా 8 శాతంగా ఉన్నాయని వివరించింది.ఈ మరణాల విషయంలో భారత్ అసమానతలను చూస్తూనే ఉన్నదని నివేదిక పేర్కొన్నది. అత్యధిక ప్రసూతి మరణాలు అరుణాచల్‌ప్రదేశ్‌లోని తిరాప్ జిల్లాల్లోని స్థానిక తెగల్లో నమోదవు తున్నవి. ఇక్కడ 100,000 జనానాలకు 1,671 ప్రసూతి మరణాలు నమోదవుతున్నాయని నివేదిక అంచనా వేసింది.

ఇక అంగవైకల్యం లేని వారితో పోలిస్తే.. ఆ సమస్యను కలిగి ఉన్న మహిళలు 10 రెట్లు ఎక్కువగా లింగ ఆధారిత హింసను అనుభవిస్తున్నారని వివరించింది. ఇక ఆరోగ్య సంరక్షణను పొందటంలో మెరుగుదల అనేది ప్రధానంగా సంపన్న మహిళలకు, ఇప్పటికే ఆరోగ్య సంరక్షణకు మెరుగైన అవకాశాన్ని కలిగి ఉన్న జాతి సమూహాలకు చెందిన వారికి ప్రయోజనం చేకూర్చాయని సమాచారం. "వైకల్యమున్న మహిళలు, బాలికలు, వలసదారులు, శరణార్థులు, జాతి మైనారిటీలు, ఎల్‌జిబిటిఐఎ ప్లస్ ప్రజలు, హెచ్‌ఐవీ బాధితులు, వెనుకబడిన కులాల ప్రజలు అందరూ ఎక్కువ లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్య ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. ఇందులో వారికి ఆరోగ్య సంరక్షణలోనూ అసమానతలు ఎదురవుతున్నాయి" అని నివేదిక పేర్కొన్నది.

వాతావరణ మార్పు, మానవతా సంక్షోభాలు, సామూహిక వలసలు వంటి బలమైన శక్తులతో వారి దుర్బలత్వం మరింత పెరుగుతున్నదనీ, ఇవి తరచుగా సమాజంలోని అంచులలో ఉన్న మహిళలపై అసమాన ప్రభావాన్ని చూపుతాయని నివేదిక హెచ్చరించింది.

భారత్‌లో పని ప్రదేశాలు, విద్యలో కుల ఆధారిత వివక్షను ఎదుర్కొంటున్న మహిళలకు చట్టపరమైన రక్షణ కోసం దళిత కార్యకర్తలు వాదిస్తున్నారని వివరించింది. నివేదిక ప్రకారం.. లక్షలాది మంది మహిళలు, బాలికలు కఠిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజుకు.. ప్రసవించే మహిళలు 800 మంది మరణిస్తున్నారు. నాలుగో వంతు మంది మహిళలు తమ భాగస్వామితో లైంగిక చర్యకు నో చెప్పలేరు. దాదాపు 10 మంది మహిళల్లో ఒకరు గర్భనిరోధకం గురించి తమ స్వంత నిర్ణయాలు తీసుకోలేరు. డేటా ఉన్న 40 శాతం దేశాల్లో మహిళల శారీరక స్వయం ప్రతిపత్తి తగ్గిపోతుండటం గమనార్హం.

ట్రైనీ నర్సుపై అత్యాచారయత్నం

- విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో రోగి సహాయకుడి ఘాతుకం

ప్రజాశక్తి- విజయనగరం కోట

విజయనగరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మంగళవారం రాత్రి ఓ ట్రైనీ నర్సుపై రోగి సహాయకుడు లైంగిక దాడికి యత్నించాడు. ఆస్పత్రి ఆర్‌ఎంఒ రాజు, వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం... గంట్యాడ మండలం పెంటశ్రీరాంపురానికి చెందిన గంధవరపు గోపి (33) అనారోగ్యం పాలైన తన తల్లిని ఆస్పత్రిలో చేర్పించాడు. వారం రోజులుగా ఆస్పత్రిలో తన తల్లికి సహాయకుడిగా ఉంటున్నాడు. విజయనగరంలోని లక్ష్మీ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో సెకెండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని ట్రైనింగ్‌లో భాగంగా ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో పురుషుల వార్డులో పేషెంట్లకు ఇంజక్షన్ ఇచ్చి మంచినీళ్ల తాగడానికి నర్సుల రెస్ట్ రూము వద్దకు ఆమె వెళ్లారు. రెస్ట్ రూము లోపల గడియ పెట్టి ఉండడంతో తలుపు కొట్టారు. అప్పటికే ఆ రూములో ఉన్న గోపి ఆమె చేయి పట్టుకొని గది లోపలికి లాగి అత్యాచారం చేయబోయాడు. ఊహించని పరిణామంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఆస్పత్రి సిబ్బంది, సెక్యూరిటీ గార్డు వచ్చి నిందితుడు గోపిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో, ఆయన కిటికీ అద్దాలు పగలగొట్టి ఫర్నిచర్‌ను చిందరవందర చేశాడు. పారిపోయే క్రమంలో ఆపరేషన్ థియేటర్ అద్దాలు పగులగొట్టాడు. ఈ నేపథ్యంలో గాయపడిన ఆయనను సెక్యూరిటీ గార్డు పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం నిందితుడికి ఆస్పత్రిలో చికిత్స అందించారు. పట్టుబడిన గోపి... తన తల్లికి బాగోలేక ఆస్పత్రికి వచ్చామని, క్షమించి వదిలేయాలని సెక్యూరిటీ సిబ్బందిని వేడుకున్నాడు. మద్యం మత్తులో ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు వైద్యులు చెబుతున్నారు. గోపిపై కేసు నమోదు చేశామని, కేసు దర్యాప్తులో ఉందని వన్‌టౌన్ ఎస్ఐ ఎ.నరేష్ తెలిపారు.

ఇన్విగా హెల్త్‌కేర్ ఈక్విటీ ఫండ్ ఏర్పాటు

హైదరాబాద్ : ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులో తేవడమే లక్ష్యంగా ఇన్విగా హెల్త్ కేర్ ప్రయివేటు కొత్తగా ఈక్విటీ ఫండ్‌ను ప్రారంభించినట్లు హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (హెచ్‌సిజి) వ్యవస్థాపకుడు డాక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. వ్యవస్థాపకులకు మద్దతును అందించడానికి దాదాపుగా రూ.167 కోట్లు (20 మిలియన్ డాలర్లు) ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మానవ శ్వాసకోశ వైరల్ వ్యాధుల కోసం వినూత్నరీకాంబినెంట్ వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించిన బయోటెక్ స్టార్టప్ మైన్‌వాక్స్‌లో తొలి పెట్టుబడి పెట్టినట్లు ప్రకటించారు.

మహీంద్రా నుంచి కొత్త బొలెరో నియో ప్లస్

న్యూఢిల్లీ : మహీంద్రా అండ్ మహీంద్రా భారత మార్కెట్లోకి కొత్త బొలెరో నియో ప్లస్ మోడల్‌ను విడుదల చేసింది. ఈ సీటర్ వాహన ధరల శ్రేణీని రూ.11.39 లక్షలుగా- రూ.12.49 లక్షలుగా నిర్ణయించింది. పాత మాడల్‌తో పోలిస్తే ఈ కొత్త వేరియంట్ ధర రూ.1.50 లక్షలు అధికంగా ఉంది.

ఇవి రంగంలోకి డైమ్లర్ ఇండియా

న్యూఢిల్లీ : ప్రముఖ వాణిజ్య వాహనాల కంపెనీ డైమ్లర్ ఇండియా విద్యుత్ రంగ వాహనాల విభాగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. రవాణా పరిష్కారాలను డీకార్బనైజ్ చేయడానికి దీర్ఘకాలిక సంసిద్ధత కోసం వ్యూహాలను సిద్ధం చేశామని తెలిపింది. ఆల్-ఎలక్ట్రిక్, నెక్స్ట్-జనరేషన్ 'ఇ-క్యాంటర్' తో బ్యాటరీ ఎలక్ట్రిక్ మార్కెట్‌లోకి ప్రవేస్తున్నట్లు వెల్లడించింది. రాబోయే 6 నుండి 12 నెలల్లో భారతదేశ మార్కెట్ లోకి 'ఇ-క్యాంటర్'ను విడుదల చేయనున్నట్లు డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ సత్యకాం ఆర్య తెలిపారు.

గాజాలో ఊచకోతకు అదానీ డ్రోన్లు

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేస్తున్నది. హిందుస్తాన్ టైమ్స్ ఈ ఏడాది జనవరిలోనే ఇందుకు సంబంధించిన ఒక వార్తా కథనాన్ని ప్రచురించింది. అదానీ, ఇజ్రాయిల్ కంపెనీల జాయింట్ వెంచర్, రక్షణ పరికరాల తయారీలో విదేశీ పెట్టుబడులకు సంబంధించి ఎలాంటి ఆటంకం లేకుండా చూడడం కోసం మోడీ ప్రభుత్వం అంతకు ముందే ఒక కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ఆ విధానం ప్రకారం ఆటోమేటిక్ రూట్‌లో 74 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ)ని అనుమతిస్తున్నది. కేస్ బై కేస్ ప్రాతిపదికపై వంద శాతం క్లైమేట్ రంగాన్ని ప్రధానంగా విదేశీ ఉత్పత్తిదారులకు, వ్యూహాత్మక భాగస్వాములుగా అనుమతిస్తున్నట్లు పేర్కొంది. ఇజ్రాయిల్‌కు అదానీ డ్రోన్ల ఎగుమతికి కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వశాఖ అధీనంలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి) లైసెన్సు ఇచ్చింది. డ్రోన్లు, యుఎవిలే కాదు, టవర్ అసాల్ట్ రైఫిల్, అసాల్ట్ రైఫిల్ ఎక్స్95, గెలీల్ స్నిప్పర్ రైఫిల్, నెగెవ్ లైట్ మెషిన్ గన్స్, యుజి సబ్‌మెషినరీ గన్స్ వంటివి ఇజ్రాయిలీ కంపెనీతో కలిసి అదాని ఏరో స్పేస్ ఉత్పత్తి చేస్తోంది. ఈ డ్రోన్లను, మానవ రహిత యుద్ధ విమానాలను, ఆయుధాలను భారత సాయుధ బలగాల్లో ప్రవేశపెట్టేందుకు కూడా అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ రంగంలోని డిఆర్‌డిఒ, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వంటి ప్రఖ్యాత సంస్థలను నిర్వీర్యం చేసి అదాని ఏరోస్పేస్‌కు ఆర్డర్లు ఇవ్వడం దేశ భద్రతకు మంచిది కాదని రక్షణ రంగ నిపుణులు పలువురు హెచ్చరిస్తున్నారు.

నేటి నుంచి నామినేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

పోటీ చేసే అభ్యర్థులు ఫారమ్ 2ఎ, అసెంబ్లీకి పోటీ చేసే వారు ఫారమ్ 2బిలో దరఖాస్తు చేయాలి. పని దినాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. పబ్లిక్ సెలవు దినాల్లో నామినేషన్ స్వీకరించబడదు. నామినేషన్లను ఆర్‌ఒకు గానీ, సంబంధిత ఎఆర్‌ఒకు మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థి తమ నామినేషన్‌ను నేరుగా గానీ, తన ప్రపోజరు ద్వారా గానీ సమర్పించవచ్చు. అభ్యర్థి తమ నామినేషన్‌తో పాటు తమ పేరిట కొత్తగా తెరిచిన బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల నుంచి ఒక అభ్యర్థి నామినేషన్లను ఫైల్ చేయడం కుదరదు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. సువిధ యాప్ ద్వారా నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నప్పటికీ వాటి కాపీలను భౌతికంగా ఆర్‌ఒకు అందజేయాల్సి ఉంటుంది. ఫారం-26 ద్వారా తన అఫిడవిట్‌ను సమర్పించాలి. ఫారమ్ -26, స్టాంప్ పేపర్ విలువ రూ.10 లేదా అంతకంటే ఎక్కువ ఉండాలి. అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచి ఖర్చు వారి ఖాతాలో లెక్కించడం జరుగుతుంది. పత్రికల్లో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్ వార్తలను సైతం అభ్యర్థి ఖాతాలో ఎన్నికల కమిషన్ లెక్కిస్తుంది.

ఇదేనా న్యాయం?

(మొదటిపేజీ తరువాయి)


వెంకటాయపాలెం గ్రామస్తులు

కూడా అమలుకు నోచుకోలేదని కొందరు తెలిపారు. గ్రామంలోని దళిత వాడలో ఇప్పటికీ అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. సంఘటన జరిగినప్పుడు పెత్తందారులు వేధింపులకు గురి చేయడమే కాకుండా తమను కూలి పనులకు కూడా పిలవకుండా సాంఘిక బహిష్కరణ చేశారని గుర్తుచేసుకున్నారు. అయినా ఐక్యంగా నిలబడి వేధింపులను ఎదుర్కొని న్యాయం కోసం పోరాడామని చెప్పారు. '1997-98 మధ్య సాంఘిక బహిష్కరణకు గురైనప్పుడు అగ్రవర్ణాల వారు ఎవరూ కూలి పనులకు పిలవలేదు. పరిసర ప్రాంతాల్లోని వారు చందాలు వేసుకుని బియ్యం, నిత్యావసర సరుకులు, బట్టలు వంటివి అందజేశారు. ఏడాది పాటు నానా ఇబ్బందులు పడ్డాం' అని గ్రామస్తులు ఇంజా రాంప్రసాద్, దడాల సత్యనారాయణ, తనికెళ్ల లావరాజు, పెయ్యల బాబి, సిహెచ్ పట్టాభి తదితరులు తెలిపారు. ఈ కేసులో కోర్టు తీర్పు సైతం నిందితులకే అనుకూలంగా ఉందని బాధితులకు, గ్రామస్తులకు ఒరిగిందేమీ లేదంటూ వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.

సామాజిక కోణంలో ఈ అంశాన్ని చూడాలి

శిరోముండనం ఘటనను అన్ని పార్టీలూ రాజకీయ కోణంలోనే చూశాయి తప్ప, సామాజిక కోణంలో చూడలేదు. బాధితులకు న్యాయం చేయాలని నేను, నా భార్య కలిసి నిరవధిక దీక్ష చేపట్టాం. ఆ సందర్భంలో నాటి సిఎం చంద్రబాబు వద్దకు మా ప్రతినిధి బృందాన్ని తీసుకెళ్లారు. అప్పుడు ఆయన ఇచ్చిన హామీలు ఏవీ నేటికీ అమలు కాలేదు. ఇప్పటికైనా బాధితులకు పూర్తి న్యాయం చేయాలి. అట్రాసిటీ కేసులో బాధితులకు నిబంధనల మేరకు పూర్తి సాయం అందించాలి. ఇన్నేళ్ల బాధితుల సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం వచ్చిన కోర్టు తీర్పులోనూ బాధితులకు పూర్తి న్యాయం జరగలేదు.

- నక్కా శ్రీనగేష్, శిరోముండనం ఘటనపై ఉద్యమించిన నేత

ఎవరినీ కలవని సిఎం జగన్

- నేడు తూర్పుగోదావరి జిల్లాలోకి బస్సు యాత్ర

ప్రజాశక్తి - తణుకు రూరల్

శ్రీరామ నవమి సందర్భంగా యాత్రకు విరామం ప్రకటించిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఎవ్వరినీ కలవలేదు. ఆయన సతీమణి భారతి కూడా తనతోనే ఉన్నారు. సిఎం జగన్ బస్సు యాత్ర గురువారం పశ్చిమగోదావరి జిల్లా నుంచి తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించనుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మంగళవారం భీమవరం సభ అనంతరం రాత్రికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఈతకోట చేరుకోవాల్సి ఉంది. బుధవారం శ్రీరామనవమి కావడంతో బస్సు యాత్రకు సిఎం విరామం ప్రకటించారు. భీమవరం సభ అనంతరం గణపవరం, పిప్పర, దువ్వ మీదుగా సాగిన బస్సుయాత్ర రాత్రికి తేతలి వద్దకు చేరుకుంది. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు తేతలి వై.జంక్షన్ నుంచి యాత్ర ప్రారంభమై వర్షిష్ట జంక్షన్, ఉండ్రాజవరం జంక్షన్, పెరవలి, సిద్ధాంతం, రావులపాలెం మీదుగా కడియపులంక చేరుకుంటుంది. భోజన విరామం అనంతరం ధవళేశ్వరం మండలం బొమ్మూరు, రాజమండ్రిలోని మోరంపూడి జంక్షన్, తాడితోట జంక్షన్, దేవిచౌక్, పేపర్‌మిల్లు, మల్లయ్యపేట మీదుగా రాజానగరం చేరుకోనున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు.

రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దుకు బిజెపి కుట్ర

- సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్స
- 19న నామినేషన్ దాఖలు



పాలకొండలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎంపి అభ్యర్థి అప్పలనర్స, నాయకులు సుబ్బరావమ్మ తదితరులు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్, పాలకొండ

భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన గిరిజనుల హక్కులను, చట్టాలను, రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బిజెపి కుట్ర పన్నుతోందని సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్స అన్నారు. పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలోనూ, సీతంపేట మండల కేంద్రంలో నిర్వహించిన పలు సభలోనూ ఆయన మాట్లాడారు. పాలకొండలో ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణ నుంచి ఎలం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో అప్పలనర్సతో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, నాయకులు కె.నాగమణి, కె.మోహన్‌రావు, సిహెచ్ అమ్మన్నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ.. బిజెపి మూడోసారి అధికారం చేపడితే ఇప్పుడున్న భారత రాజ్యాంగం కన్నా భిన్నమైన రాజ్యాంగం అమలు చేస్తామని ఆ పార్టీ నేతలు బహిరంగంగానే ప్రకటిస్తుండడం దేశ ద్రోహచర్య అని విమర్శించారు. భిన్నత్వంలో ఏకత్వం గల మన దేశంలో బిజెపి పూర్తిగా మైనార్టీ కులాలను, మతాలను ధ్వంసం చేస్తూ ఒకే కులం.. ఒకే మతం అజెండాగా పని చేస్తోందని తెలిపారు.

1/70 చట్టం, రిజర్వేషన్లు, అటవీ హక్కుల చట్టం, గ్రామ సభలకు ఉన్న అధికారాలన్ని బిజెపి కాలరాసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అటవీ హక్కుల పరిరక్షణ చట్టాన్ని రద్దు చేసి ఏజెన్సీలోని గనులను అదానీ, అంబానీలకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ఇప్పటికే సాలూరు, అరకు ప్రాంతాల్లో ఎనిమిది హైడ్రోజన్ పవర్ ప్లాంట్ల నిర్మాణానికి అనుమతులతో పనులు చేపడుతోందని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి పట్ల బిజెపి, వైసిపి, టిడిపి, జనసేనకు ఎటువంటి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజాసమస్యలపై పనిచేసే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. రాష్ట్రానికి అన్ని విధాలా ద్రోహం చేసిన బిజెపితో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు జతకట్టడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం నిష్పక్షపాతంగా ప్రజల పక్షాన పోరాడుతున్న ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని కోరారు.

నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అరకు పార్లమెంటు అభ్యర్థి పి.అప్పలనర్స ఈ నెల 19న నామినేషన్ వేస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పాతబస్టాండ్ వద్ద బహిరంగ సభ నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా చేరుకొని నామినేషన్ వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్మికులు, కర్షకులు, గిరిజనులు, మేధావులు, అభ్యుదయవాదులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భుజాలు తడుముకుంటున్న చంద్రబాబు : రవిచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాయితో దాడి చేయించిన ఘటనలో బొండా ఉమాతో పాటు తన పేరు బయటకు వస్తుందనే చంద్రబాబు భుజాలు తడుముకుంటున్నారని, ఈ ఘటనలో అసలు దొంగ ఆయనే అనిపిస్తోందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసులు ఇప్పటి వరకూ ఘటనపై ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయకున్నా అధికారులు వైసిపి ప్రమేయంతో పనిచేస్తున్నారనడం సరైంది కాదన్నారు.

జనసేన అభ్యర్థులకు బి-ఫారాలు అందజేత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శ్రీరామనవమి సందర్భంగా జనసేన తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు బి- ఫారాలను ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అందజేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం బి-ఫారమ్స్ అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు చాలా కీలకమైనవన్నారు. ఎన్నో ఒత్తిళ్లు ఎదురైనా ఎదుర్కొని కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే ధృడ సంకల్పంతో ఏర్పడిన కూటమికి రానున్న ఎన్నికల్లో ప్రజలు పట్టం కడతారని ఆశిస్తున్నట్లు పవన్‌కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, వారికి పూర్తి స్థాయిలో జవాబుదారీతనం వహించేలా పాలన ఉంటుందని అన్నారు. జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్తు కోసం వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో కొన్ని కోణాల నుంచి ఆలోచించి పవన్‌కల్యాణ్ అభ్యర్థులను ఎంపిక చేశారన్నారు. అనంతరం బి-ఫారమ్స్ తీసుకున్న అభ్యర్థులతో రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలూ పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు.

20న షర్మిల నామినేషన్

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పులివెందుల : సునీత, తులసిరెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

కడపలో ఈ నెల 20వ తేదీన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా షర్మిల నామినేషన్ దాఖలు చేస్తారని వివేకా కుమార్తె డాక్టర్ వైఎస్ సునీత, పిసిసి మీడియా చైర్మన్ ఎన్ తులసిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. వివేకా చివరి కోరిక షర్మిలను ఎంపిగా చూడమేనని పేర్కొన్నారు. పులివెందులలోని వివేకా నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం వారు మాట్లాడారు. పులివెందుల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, విమర్శించారు. ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయంలోనే కడప జిల్లా అభివృద్ధి జరిగిందన్నారు. కడపకు రిమ్స్ మెడికల్ కళాశాల, యోగి వేమన యూనివర్సిటీ, ప్రాజెక్టు నిర్మాణలు, పులివెందుల సంబంధించి త్రిపుల్‌ఐటి, జెఎన్‌టియు కళాశాల, ఐజి కార్లు, నాలుగు రోడ్ల విస్తరణ వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఎంతో ఆదరణ ఉందన్నారు. వైఎస్ఆర్ మరణించే రెండుమూడు రోజుల కిందట కూడా రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పేవారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం దుష్టచతురాష్టత పాలన నడుస్తోందని, ఈ పాలనకు చరమగీతం పాడాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన అబద్ధాల పాలనని, రూ.మూడు లక్షల కోట్ల అప్పు భారాన్ని ఈ రోజు రాష్ట్రంపై ఉంచారని తెలిపారు. చుట్టుపక్కల రాష్ట్రాలలో ఎక్కడా లేని ధరలూ మన రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు, బిజెపికి వత్తాసు పలుకుతున్నాయని, ప్రత్యేక హోదా గురించి మాట్లాడలేని స్థితిలో ఈ పార్టీలు ఉన్నాయని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని, రెండు మూడు రోజుల్లోనే పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిని ప్రకటిస్తామని తెలిపారు. త్వరలోనే ఇంటింటి ప్రచార కార్యక్రమమూ ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో నాయకులు ఎన్ శివప్రకాష్‌రెడ్డి, వేలూరు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బిజెపి జెండా మోయలేక టిడిపికి రాజీనామా :

- కరీముల్లా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్ :

మతతత్వ బిజెపి జెండాను మోయడం ఇష్టం లేకనే టిడిపి ప్రాథమిక సభ్యత్వానికి, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలుగు యువత ఒంగోలు జిల్లా మాజీ అధ్యక్షులు షేక్ కరీముల్లా తెలిపారు. ముస్లిం సమాజానికి హాని కలిగించే సిఎఎ, ఎన్ఆర్‌సి వంటి చట్టాలను తీసుకొచ్చిన బిజెపితో కలిసి పనిచేసే అవసరం తనకు లేదన్నారు. నగరంలోని కెబి కాన్ఫరెన్స్ హాలులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..తన రాజకీయ అవసరాల కోసం బిజెపితో చంద్రబాబు జతకట్టారని విమర్శించారు.

ప్రభుత్వంపై ప్రజల అవిశ్వాసం..!

- జీవనోపాధిపై ఆందోళన
- 72% మంది ఆదాయాల్లో పతనం
- ధరలు పెరిగాయని 90% మంది వెల్లడి



న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా మెజారిటీ ప్రజలు తమ జీవనోపాధిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు మూడింట ఒక వంతు మంది నిరాశాలో ఉన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది మార్చిలో వెల్లడించిన వినియోగదారుల విశ్వాస సర్వేపై సిఎస్‌డిఎస్-లోక్‌నీతి ప్రీపోల్ సర్వే విశ్లేషణ నిర్వహించింది. ప్రస్తుతం హెచ్చు ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆదాయాలు పడిపోవడం ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. ఇవి సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎకు ఎదురుగాలిగా నిలువనున్నాయి. ఈ ప్రీపోల్ సర్వేలో 32 శాతం మంది పెరుగుతున్న నిరుద్యోగంపై ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం కారణంగా అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి మూడింట ఒక్క వంతు మంది ఆసక్తి చూపడం లేదు.

ఆర్‌బిఐ ఇటీవల మార్చి 2 నుంచి 8వ తేదిల మధ్య 19 నగరాల్లో నిర్వహించిన సర్వేలో 6,083 మంది అభిప్రాయాలను సేకరించింది. ఈ సర్వేలోనూ నిరుద్యోగం, ధరలు, ఆదాయాల తగ్గుదలపై ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఆర్‌బిఐ సర్వే ప్రకారం.. ఏడాది క్రితంతో పోల్చితే ఉపాధి అవకాశాలు పెరిగాయని.. అయినప్పటికీ 38 శాతం మంది నిరుద్యోగం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా ముందు నాటి స్థాయికి అవకాశాలు చేరుతున్నాయని పేర్కొన్నారు.

ఏడాది క్రితంతో పోల్చితే ఆదాయాలు చాలా తక్కువగా ఉన్నాయని 22 శాతం మంది పేర్కొన్నారు. ఇంతక్రితం 2014-15 నాటి సర్వేతో పోల్చితే 10 శాతం అదనం ప్రతికూలత పెరిగింది. 27 శాతం మంది ఆదాయాలు పెరగ్గా.. 50 శాతం మంది ఆదాయాలు అలాగే ఉన్నాయి. ప్రతీ ఏడాది పెరుగుతున్న వస్తు ధరలు భారం అవుతున్నాయి.

ఆర్‌బిఐ సర్వే ప్రకారం.. ఏడాది క్రితంతో పోల్చితే ధరలు పెరిగాయని 90 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు.

ధరలు అలాగే ఉన్నాయని 9 శాతం మంది, తగ్గాయని ఒక్క శాతం మంది ఆర్‌బిఐ సర్వేలో పేర్కొన్నారు.

ఏడాది క్రితం ఆర్థిక వ్యవస్థ పేలవంగా ఉండగా.. ఇటీవల కొంత మెరుగు పడిందని తెలిపింది. ఆర్థిక వ్యవస్థ పట్ల ప్రజల్లో ఇప్పటికీ 2015-16 నాటి స్థాయికి విశ్వాసం చేరలేదు. ఏడాది క్రితంతో పోల్చితే ఆర్థిక వ్యవస్థ బాగోలేదని 36 శాతం మంది పేర్కొన్నారు.

ఎసిబికి చిక్కిన పౌరసరఫరాల అధికారి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ ఎసిబికి చిక్కారు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రైస్ మిల్లులో పెద్ద ఎత్తున నిల్వలు చేస్తున్నారని, నెలనెలా మామూళ్లు ఇవ్వాలని అవనిగడ్డకు చెందిన రైస్ మిల్లు యజమాని వినయ్‌కుమార్‌ను సివిల్ సప్లయిస్ డిటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ నెలకు రూ.10 వేలు ఇవ్వాలని ఒత్తిడి పెంచారు. ఎసిబి అధికారులకు రైసు మిల్లు యజమాని ఫిర్యాదు చేశారు. మచిలీపట్నం బైపాస్ రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద మిల్లు యజమాని నుంచి డిటి శ్రీనివాస్ లంచం తీసుకుంటుండగా ఎసిబి ఎస్‌పి స్నేహిత రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని స్నేహిత తెలిపారు.

వైసిపిని గద్దె దించాలి

- ఎన్‌డిఎ కూటమి నేతలు


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించడం ద్వారానే గ్రామీణ పరిపాలన మెరుగుపడుతుందని ఎన్‌డిఎ కూటమి నేతలు పేర్కొన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం టిడిపి మాజీ ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్, బిజెపి మీడియా ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం, జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు మీడియాతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ఆర్థిక సంఘం నిధులు రూ.8,600 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించారు.

కమలంపై రాజవంశీయుల గుస్సా

- ఎస్‌పితో కాంగ్రెస్ అవగాహన
- నిరుద్యోగం, ధరల పెరుగుదలే 'ఇండియా ప్రచారాస్త్రాలు
- రామాలయమే కమలం ఎజెండా
- మధ్యప్రదేశ్‌లో నాలుగు దశల్లో ఎన్నికలు






ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో హిందీ రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్ ఒకటి. ఈ రాష్ట్రంలో 29 లోక్‌సభ స్థానాలున్నాయి. అందులో పది ఎస్సి, ఎస్టి రిజర్వుడు స్థానాలు కాగా, 19 జనరల్ కేటగిరి స్థానాలు. రాష్ట్రంలో మొదటి నాలుగు విడతల్లో ఎన్నికలు జరుగుతాయి. మధ్యప్రదేశ్‌లో తొలి విడతలో ఆరు స్థానాల్లో పోలింగ్ జరగనుంది. ఈ విడతలో 88 మంది బరిలో ఉన్నారు. ఈ నెల 19న పోలింగ్ జరగనుంది. రెండో విడతలో ఏడు స్థానాలకు ఏప్రిల్ 26న, మూడో విడతలో ఎనిమిది స్థానాలకు మే 7న, నాలుగో విడతలో ఎనిమిది స్థానాలకు మే 13న పోలింగ్ జరగనుంది.

ఎన్నికలకు సిద్ధమైన కాంగ్రెస్

2018 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో గెలిచిన కాంగ్రెస్, చిన్న పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఆరు నెలల్లో జరిగిన 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తిగా డీలా పడింది. 29 స్థానాల్లో కేవలం ఒక స్థానాన్నే గెలుచుకుంది. ఆ తరువాత లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చెందింది. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత జ్యోతిరాధిత్య సింధియా 2020 మార్చిలోనే 21 మంది ఎమ్మెల్యేలతో తిరుగుబాటు చేశారు. దీంతో కమల్ నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోయింది. వెంటనే సింధియా బిజెపిలో చేరడంతో కాంగ్రెస్‌లో సంక్షోభం నెలకొంది. బిజెపి ప్రభుత్వం ఏర్పాటు అయింది. సింధియాకు రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి కేంద్ర మంత్రిని చేశారు. అలాగే రాష్ట్రంలో సింధియా వర్గం ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇచ్చారు. అయితే ఇటీవలి 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత కాంగ్రెస్‌లో స్తబ్దత నెలకొంది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి కమల్ నాథ్ బిజెపిలో చేరుతారనే చర్చతో మధ్యప్రదేశ్ కాంగ్రెస్‌లో ఏం జరుగుతుందో ఎవరికి తెలియని పరిస్థితి నెలకొంది. అయితే చివరికి ఆయన వెనక్కి తగ్గడంతో కథ సుఖాంతం అయింది. ఇప్పుడు కాంగ్రెస్ పూర్తిగా కోలుకుని ఎన్నికల యుద్ధానికి సిద్ధమైంది.

బిజెపిలో అసంతృప్తి రాగాలు

బిజెపిలో అసంతృప్తి రాగాలు రోజు రోజుకి పెరుగుతున్నాయి. పార్టీ నేతలు, ఎంపిలు తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సారధ్యంలో బిజెపి అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లింది. అయితే ఎన్నికల్లో గెలిచిన తరువాత ఆయనను పక్కపెట్టి, మోహన్ యాదవ్ ను ముఖ్యమంత్రిని చేశారు. దీంతో శివరాజ్ సింగ్ చౌహాన్ అసంతృప్తిగా ఉన్నారు. అయితే ఆయన రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానని, జాతీయ రాజకీయాలకు వెళ్లనని ప్రకటించారు. బిజెపి ఆయనకు ఎంపి టిక్కెట్టు ఇచ్చి రాష్ట్రంలో లేకుండా చేయాలని చూస్తోంది. అలాగే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి భోపాల్ ఎంపి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ కి ఆ పార్టీ టిక్కెట్టు నిరాకరించింది. దీంతో ఆమె ఆగ్రహం వెళ్లగక్కారు. కెపి యాదవ్ (గుణ), రాజ్‌బహదూర్ సింగ్ (సాగర్), జెఎస్ దామోర్ (రత్లాం), రమాకాంత్ భార్గవ (విదిషా), వివేక్ షెజ్వాల్కర్ (గ్వాలియర్)లకు కూడా బిజెపి టిక్కెట్లు ఇవ్వలేదు. వీరంతా బిజెపిపై తీవ్ర అసహనంతో ఉన్నారు.

ఎవరెన్ని స్థానాల్లో పోటీ ?

గత ఎన్నికల్లో బిజెపి 28 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ ఒక్క స్థానానికే పరిమితం అయింది. ప్రస్తుత ఎన్నికల్లో బిజెపి 29 స్థానాల్లో పోటీ చేయగా, ఇండియా ఫోరంలో భాగంగా కాంగ్రెస్ 28, ఎస్పి 1 స్థానంలో పోటీ చేస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో ఒబిసిలు 50 శాతం, ఎస్టీలు 20 శాతం, ఎస్సిలు 15 శాతం, అగ్రవర్ణాలు 15 శాతం ఉన్నారు. ముస్లీంలు 7 శాతం ఉన్నారు.

రామాలయం.... నిరుద్యోగ సమస్య

బిజెపి రామమందిరం అంశాన్ని నమ్ముకుంది. కాంగ్రెస్ నిరుద్యోగం, ధరలు పెరుగుదల అంశాలపై ఫోకస్ పెట్టి ప్రచారం చేస్తోంది. యువత అసహనంతో ఉన్నారు. దీన్ని సానుకూలంగా మార్చుకునేందుకు ఇండియా ఫోరం పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. అందుకే ఉద్యోగ నియామకాలు, సాయుధ దళాల్లో అగ్నిపథ్ రద్దు, కులగణన వంటి అంశాలను ప్రచారాస్త్రాలుగా కాంగ్రెస్ చేసుకుంది.

భార్యాభర్తలే ప్రత్యర్థులు

భార్య కాంగ్రెస్ తరపున, భర్త బిఎస్‌పి తరపున పోటీ చేస్తున్నారు. కంకర్ ముంజారే, అనుభా ముంజరే భార్యాభర్తలు. భార్య అనుభ గతేడాది నవంబర్‌లో మధ్యప్రదేశ్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి బిజెపి అభ్యర్థి గౌరీశంకర్ బైసన్‌పై విజయం సాధించారు. అనుభ భర్త కంకర్ ముంజారే ఓ మాజీ ఎమ్మెల్యే, ఎంపి కూడా. ప్రస్తుతం ఈయన బిఎస్‌పిలో ఉన్నారు. వచ్చే లోక్?సభ ఎన్నికల్లో కంకర్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఎన్నికలు ముగిసేవరకు ఒకే ఇంట్లో ఉండకూడదని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు ఇంటిని వీడి బయటకొచ్చేశారు. ప్రస్తుతం ఆయన జిల్లాలోని ఓ డ్యామ్ సమీపంలో పూరిగుడిసెను ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారు. ఇక్కడి నుంచే తన ప్రచార కార్యక్రమాలను చక్కబెడుతున్నారు. ఇక ఏప్రిల్ 19న పోలింగ్ ముగిసిన రోజే తిరిగి ఇంటికెళ్తానని ఆయన చెబుతున్నారు. భర్త కంకర్ ముంజరే నిర్ణయం బాధాకరమని ఎమ్మెల్యే అనుభ అన్నారు.

మోడీ వేవ్ లేదు

అమరావతి బిజెపి అభ్యర్థి నవనీత్ రాణా

ముంబయి : ఈ లోక్‌సభ ఎన్నికల్లో మోడీ వేవ్ లేదని బిజెపి అభ్యర్థి నవనీత్ రాణా వ్యాఖ్యానించినట్లు సోషల్‌మీడియాలో వీడియో ఒకటి వైరల్‌గా మారింది. తాను పోటీ చేస్తున్న అమరావతి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో 'పంచాయతీ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ పోరాడాలి. మధ్యాహ్నం 12 కల్లా ఓటర్లందరినీ పోలింగ్ బూత్‌కు తీసుకురావాలి. మోడీ వేవ్ ఉందనే భ్రమలో ఉండకండి' అని నవనీత్ వ్యాఖ్యానించారు. ఈ వీడియో కాస్తా సోషల్‌మీడియాలో వైరల్ అవ్వడంతో ఎన్‌సిపి, శివసేన (యుబిటి) పార్టీలు బిజెపిపై విమర్శలు గుప్పించాయి. మోడీ వేవ్ లేదని ఆ పార్టీ నేతలే నిజాలు ఒప్పుకుంటున్నారని శివసేన నాయకుడు సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. అయితే ఈ వివాదంపై నవనీత్ వివరణ ఇచ్చారు. తన ప్రసంగాన్ని వక్రీకరించారని ఆమె ప్రతిపక్షాలపై మండిపడ్డారు.



ఇద్దరూ.. ఇద్దరే!

- తమిళనాట ఎర్రజెండా రెపరెపలు
- డిఎంకె కూటమిలో రెండు స్థానాల్లో సిపిఎం పోటీ

గోపి వలిగలం

తమిళనాడు రాష్ట్రంలో ఈనెల 19న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో డిఎంకె కూటమి నుంచి సర్దుబాటులో భాగంగా పోటీలో నిలిచిన వామపక్షాల అభ్యర్థులకు ప్రజాదరణ కనిపిస్తోంది. సిపిఎంకు ఇద్దరు, సిపిఐకి ఇద్దరు పొత్తులో భాగంగా బరిలో ఉన్నారు. సిపిఎం నుంచి మదురై సిట్టింగ్ ఎంపి సు.వెంకటేశన్, దిండిగల్ నుంచి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్.సచ్చిదానంద్ పోటీ చేస్తున్నారు. నాగపట్నం నుంచి సిపిఐ అభ్యర్థి సెల్వరాజ్, తిరుపూర్ నుంచి సుబ్బరాయన్ పోటీలో ఉన్నారు. డిఎంకె, కాంగ్రెస్, విసికె, ఇండియన్ ముస్లీం లీగ్ కూటమికి దళిత బిసి, కార్మిక ఉద్యోగ సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. ప్రచారంలో అందరికంటే దూసుకెళుతున్నారు వామపక్ష అభ్యర్థులు.

ప్రజా ఉద్యమాలే ఊపిరిగా..

కూటమిలో భాగస్వామ్యంగా మదురై, దిండిగల్ నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థులు సు.వెంకటేశన్, ఆర్.సచ్చిదానంద్ ఇద్దరూ ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పనిచేస్తున్నవారే. మదురై నుంచి సిట్టింగ్ ఎంపిగా పోటీ చేస్తున్న సు.వెంకటేశన్ ఐదేళ్లుగా ఎంపిగా ఉన్నారు. విద్యార్థి దశనుంచే వామపక్ష భావజాలానికి ఆకర్షితులయ్యారు. రచయితగానూ రాణిస్తూ ఎన్నో పుస్తకాలను రచించారు. బికాం వరకూ చదువుకుని మధ్యలోనే నిలిచిపోయారు. ఉద్యమాల పత్రిక థికదీర్ లో సబ్‌ఎడిటర్‌గా ఉన్నారు. సిపిఎం ఏరియా కార్యదర్శిగానూ ఉన్నారు. ఆయన రచించిన పుస్తకాలకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. సామాన్య ప్రజానీకానికి అర్థమయ్యే రీతిలో వారి బాధలే ఆ పుస్తకాల్లో ఉండడంతో పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారు. అభ్యుదయ రచయితగా పేరు ఉంది. రెడ్‌ఫ్లవర్, కావల్‌పొట్టమ్ వీరి ప్రసిద్ధి రచనలు. రచనలకు సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. తమిళనాడు రాష్ట్ర సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులుగానూ ఉన్నారు. 2019 ఎన్నికల్లో డిఎంకె కూటమిలో మదురై నుంచి పోటీ చేసి అన్నాడిఎంకె అభ్యర్థి సత్యాయాన్‌పై లక్షా 5వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కరోనా కాలంలో మదురై జిల్లాలో విశేష సేవలను అందించారు. 26వేల మంది పాజిటివ్ రోగులకు ఆశ్రయం కల్పించారు. నియోజకవర్గంలో ఎంపి నిధులతో నిధులు వెచ్చించి విద్యార్థులకు ట్రైనింగ్ ద్వారా ఉన్నత చదువులకు అవకాశం కల్పించారు. పదివేల మందికిపైగా విద్యార్థులు లబ్ధి పొందారు. ప్రస్తుతం అన్నాడిఎంకె అభ్యర్థి డాక్టర్ శరవణ్ ప్రధాన ప్రత్యర్థి.

సర్పంచి నుంచి ఎంపి అభ్యర్థిగా

దిండిగల్ సిపిఎం ఎంపి అభ్యర్థి ఆర్.సచ్చిదానంద్ సర్పంచి స్థాయి నుంచి ఎంపి అభ్యర్థి స్థాయి వరకూ ఎదిగారు. దిండిగల్ లోక్‌సభ నియోజకవర్గం సిపిఎంకు కంచుకోట. తమిళనాడు రాష్ట్రంలోనే అత్యధికమైన పార్టీ సభ్యులు ఈ ప్రాంతంలోనే ఉన్నారు. ఈ నియోజకవర్గంలోనే పళణి యాత్రాస్థలం ఉంది. పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు ఎ.బాలసుబ్రమణ్యం, రాష్ట్ర కార్యదర్శి ఎన్.వరదరాజన్ (లేట్) ఈ ప్రాంతం నుంచి వచ్చినవారే. విద్యార్థి స్థాయి నుంచే ఉద్యమాల్లో పాల్గొంటూ డివైఎఫ్ఐ, ఆలిండియా కిసాన్ కౌన్సిల్ స్థాయికి ఎదిగారు. దిండిగల్ జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. దిండిగల్, పళణి, వేడసందూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడుసార్లు సిపిఎం ఎంఎల్‌ఎలు గెలుపొందారు. ఎస్‌డిపి ముస్లీం పార్టీ నుంచి మహ్మద్ ముబారక్ ప్రధాన పోటీదారుగా ఉన్నారు. అన్నాడిఎంకె, పిఎంకెలూ పోటీలో ఉన్నాయి. 2019లో రాష్ట్రంలోనే అత్యధికంగా 5 లక్షల మెజార్టీతో డిఎంకె అభ్యరి దిండిగల్‌లో గెలుపొందారు.


సచ్చిదానంద్


వెంకటేశన్

కూచ్ బిహార్‌లో వేర్పాటువాదులతో బిజెపి దోస్తీ

- కేంద్ర హోం సహాయ మంత్రి ప్రామాణిక్ కోసం మోడీ ప్రచారం
- పోటీలో ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థి
- కాంగ్రెస్, టిఎంసి క్యాండేట్లు కూడా



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పశ్చిమ బెంగాల్‌లోని కూచ్ బిహార్... బిజెపి, తృణమూల్ కాంగ్రెస్‌ల రాజకీయ ద్రోహానికి బలైంది. ఉత్తర బెంగాల్‌లోని అస్సాంకు ఆనుకుని ఉన్న ఈ వ్యవసాయ ప్రాధాన్యత ప్రాంతం ప్రస్తుతం అభివృద్ధిలో స్తబ్దతను ఎదుర్కొంటోంది. టిఎంసి నుంచి బిజెపిలో చేరి కేంద్ర సహాయ మంత్రిగా పనిచేసిన నిషిత్ ప్రమాణిక్ ప్రస్తుతం కూచ్ బెహార్ ఎంపిగా ఉన్నారు. కూచ్ బెహార్ అనే ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న వేర్పాటువాదులతో పొత్తుపెట్టుకుని బిజెపి ఇక్కడ రాజకీయ లబ్ధి పొందింది. కూచ్ బెహార్ జిల్లాలో 52 శాతం మంది షెడ్యూల్డ్ కులాల వారున్నారు. వీరిలో 42 శాతం ఉన్న రాజవంశీ వర్గానికి నేతగా ఉన్న అనంత్ మహరాజ్‌ను బిజెపి రాజ్యసభ సభ్యునిగా చేసింది. 'నారాయణ' అనే ప్రత్యేక ఆర్మీ బెటాలియన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో బిజెపి తన ప్రభావాన్ని చాటుకుంది. అనంత్ మహరాజ్ రాజ్యసభ సభ్యునిగా కూర్చోవడం మినహా ఆ వర్గానికి బెటాలియన్‌తో సహా ఏమీ రాలేదు.

సిటిజన్‌షిప్ ఇబ్బందులు

పౌరసత్వ సవరణ చట్టం అమలులోకి వచ్చినప్పుడు బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన మౌత్వ సమాజం కూడా ఆందోళన చెందింది. సిపిఎం కూచ్ బెహార్ జిల్లా కార్యదర్శి అనంతరాయ్ మాట్లాడుతూ.. తమ దరఖాస్తులు సంక్లిష్టమైన ప్రక్రియల్లో చిక్కుకు పోతున్నాయన్నారు. అధికారులు అడిగే పత్రాలను చూపించలేకపోతున్నామని తెలిపారు. 'ఎన్‌ఆర్‌సి అమలులోకి వచ్చినప్పుడు, అస్సాంలో లక్షలాది మంది జాబితా నుండి దూరంగా ఉన్నారు. ఇది వారిని ఆందోళనకు గురిచేసింది.

లెఫ్ట్ సర్కారులో అభివృద్ధే...

లెఫ్ట్‌ఫ్రంట్ సర్కారు హయాంలో కూచ్ బెహార్‌లో విద్యా రంగం, వ్యవసాయం, అటవీ సంరక్షణలో గణనీయమైన పురోగతి చెందింది. జూట్ ఇండస్ట్రియల్ పార్క్ కూడా స్థాపించబడింది. 2011లో రాష్ట్రంలో టిఎంసి ప్రభుత్వం వచ్చిన తరువాత, 2019లో బిజెపి ఎంపి గెలిచిన తరువాత అభివృద్ధి అని చెప్పుకునేదేమీ జరగలేదు. తణమూల్ గ్యాంగ్‌స్టర్లకు నాయకత్వం వహించిన ప్రామాణిక్‌ను బిజెపి కేంద్రంలో హోంశాఖ సహాయ మంత్రిని చేసింది. ఇక్కడ అవినీతి, దోపిడీ మాత్రమే జరుగుతోంది. టిఎంసి, బిజెపిలను ఓడించేందుకు లెఫ్ట్ ఫ్రంట్ పోరాడుతోంది' అని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన అనంతరాయ్ చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థిగా ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన నితీష్ చంద్రరాయ్ ప్రస్తుత ఎన్నికల బరిలో ఉన్నారు. ఈ తడవ కూడా అభ్యర్థి ప్రామాణిక్‌కు ఓట్లు అడిగేందుకు ప్రధాని నరేంద్ర మోడీ వచ్చారు. 19న తొలి దశలో ఇక్కడ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇతర ప్రధాన అభ్యర్థులు జగదీష్ బసునియా (టిఎంసి), ప్రియా రే చౌదరి (కాంగ్రెస్) ఉన్నారు.

తమిళనాట ముగిసిన ప్రచార హోరు


- రేపు పుదుచ్చేరి సహా 40 స్థానాల్లో పోలింగ్

ప్రజాశక్తి – చెన్నయ్

తమిళనాడులో నెలరోజుల పాటు సాగిన ఎన్నికల ప్రచారం బుధవారం సాయంత్రం ముగిసింది. చివరిరోజు అన్ని పార్టీలకు చెందిన నేతలు, అభ్యర్థులు సుడిగాలి పర్యటన చేశారు. నేతల ఉపన్యాసాలతో 40 ఎంపి నియోజకవర్గాలూ (పుదిచ్చేరి సహా) హోరెత్తాయి. శుక్రవారం పోలింగ్ జరగనుంది. పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహు చెప్పారు. తమిళనాడు ఎన్నికల్లో డిఎంకె (ఇండియా కూటమి), అన్నాడిఎంకె (మినీ కూటమి), బిజెపి సారథ్యంలో ఎన్‌డిఎ కూటముల మధ్య హోరాహోరీ పోరు జరుగుతోంది. ఒంటరిగా నామ్ తమిళర్ కచ్చ్ పోటీలో ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బిజెపి అగ్రనేతలు తమిళనాడుపై కేంద్రీకరించారు. ఎన్‌డిఎ అభ్యర్థుల గెలుపు కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ తొమ్మిదిసార్లు, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ తదితరులు ప్రచారం నిర్వహించారు. ఇండియా కూటమిని బలపరుస్తూ ఎఐసిసి నేత రాహుల్‌గాంధీ రెండుసార్లు విచ్చేశారు. డిఎంకె ముఖ్యమంత్రి స్టాలిన్, యువజన నేత ఉదయనిధి స్టాలిన్, డిఎంకె డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కనిమొళి ప్రచారం చేశారు. సిపిఎం మదురై, దిండిగల్ ప్రాంతాల్లోనూ, సిపిఐ నాగపట్నం, తిరుపూర్‌లో పోటీ చేస్తున్నారు. ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు కోసం మదురైలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రచారం చేశారు. చెన్నయ్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్ సుడిగాలి పర్యటన చేస్తూ మోడీ మళ్లీ అధికారంలోకి రాకుండా, దేశ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి లౌకికవాదాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు ప్రచార పర్వం ముగియడంతో నియోజకవర్గాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. శుక్రవారం ఓటింగ్‌కు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను చేశారు. ఎన్నికల నేపథ్యంలో 19న సినిమా షోలను రద్దు చేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

బెంబేలెత్తిస్తున్న సమ్మర్ హీట్

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల తరుణంలో దేశవ్యాప్తంగా పొలిటికల్ హీట్ పెరుగుతోంది. సమాంతరంగా పొలిటికల్ వేసవి ఉష్ణోగ్రతలు మరింత పెరిగి జనానికి మంటపుట్టిస్తున్నాయి. దీంతో ఎన్నికల ప్రచారానికి ఉష్ణోగ్రతలు అడ్డంకిగా మారుతోందని భారత వాతావరణ శాఖ నివేదిక తెలియజేస్తోంది. 543 పార్లమెంటు స్థానాల్లో 495 నియోజకవర్గాల్లో ఉష్ణోగ్రతలను ఐఎండి అంచనా వేసింది. 495 నియోజకవర్గాల్లో 59 నియోజకవర్గాల్లో 40–42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు ఉంటాయని హెచ్చరించింది. ఇక 194 నియోజకవర్గాల్లో 37.5–40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. 35–37.5 డిగ్రీల సెల్సియస్ 86 నియోజకవర్గాల్లో నమోదవుతాయి. 30 డిగ్రీల ఉష్ణోగతలు నమోదయ్యే నియోజకవర్గాలు కేవలం 15 మాత్రమే ఉన్నాయని ఐఎండి తెలిపింది. ప్రధానంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో పెరిగిన ఉష్ణోగ్రతలు రాజకీయ నాయకుల ఎన్నికల ప్రచారానికి అడ్డంకిగా మారనున్నాయనేది స్పష్టంగా అర్థమౌతుంది.



కలం బాణాలు




అయోధ్యలో రామాలయం మేమే నిర్మించాం : మోడీ

మోడీ జీ వ్యూహం లో
బందీయా రాముడు?
వైరం మాకేనంటూ
ప్రచారాలు ఆపుడు

బిజెపి సభల్లోన
మతతత్వం ముప్పు
ఎన్నికలకు దేవుళ్ళను
దింపడమా,తప్పు

రేవంత్‌రెడ్డి బిజెపిలో చేరతారన్న కెసిఆర్



బిజెపి లో చేరడమా
టి సిఎం రేవంతు
కెసిఆర్ జ్యోతిష్యం
దిగ్భ్రాంతిక మనవంతు

మొన్న దాక పార్టీలను
మొత్తంగా ఆవాహన
సిఎంకె ఇప్పుడింక
ఎసరెట్టే ఆలోచన!

పెత్తందార్లకు పేదలకు మధ్య యుద్ధం : జగన్



పేదలకూ పెద్దలకూ
పోరాటం ఇదేనా?
బటన్ నొక్కు సంక్షేమం
వర్గసమర దారేనా?


మేలు చేయు పథకాలకు
సంతోషం కానీ
స్వర్గం దింపేసినట్టు
చెప్పకండి కహానీ

- తె.ర

అరకులో ముక్కోణపు పోటీ

- బిజెపిపై ఆదివాసీల్లో తీవ్ర వ్యతిరేకత
- వైసిపి క్యాండేట్ రాజకీయాలకు కొత్త
- సిపిఎం అభ్యర్థికి ప్రజల్లో ఆదరణ

ప్రజాశక్తి - పాడేరు, అరకులోయ, రంపచోడవరం విలేకరులు


తనూజా రాణి
అప్పలనర్స
గీత

అరకు పార్లమెంటు నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. వైసిపి, బిజెపి, సిపిఎం అభ్యర్థుల మధ్య జరిగే పార్లమెంటు పోరుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ లోక్‌సభ నియోజకవర్గం ఎస్‌టిలకు రిజర్వు చేయబడింది. దీనిలో పాలకొండ, కురుపాం, పార్వతీపురం, సాలూరు, అరకు, పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని అసెంబ్లీ సెగ్మెంట్లతో కూడి ఉన్న ఈ ఎంపి నియోజకవర్గం భౌగోళికంగా చాలా పెద్దది. ఇక అభ్యర్థుల విషయానికొస్తే.. వైసిపి ఎంపి అభ్యర్థిగా గుమ్మ తనూజరాణి, బిజెపి అభ్యర్థిగా కొత్తపల్లి గీత, సిపిఎం అభ్యర్థిగా పాచిపెంట అప్పలనర్స బరిలో ఉన్నారు. టిడిపి, జనసేన బిజెపి కూటమి నుంచి పోటీ చేస్తున్న కొత్తపల్లి గీతపై గిరిజనుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆమె గిరిజనేతరురాలు అని, అవినీతిపరురాలు అని ఆదివాసీల్లో ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఒక దఫా ఎంపిగా ఎన్నికై తమను పట్టించుకోలేదన్న విమర్శలు ఆమెపై ఉన్నాయి. వైసిపి నుంచి అరకు ప్రస్తుత ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ కోడలు డాక్టర్ గుమ్మ తనూజరాణి బరిలో ఉన్నారు. ఆమె రాజకీయాలకు పూర్తిగా కొత్త. సిపిఎం అభ్యర్థిగా బరిలో ఉన్న పి అప్పలనర్స ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. విద్యార్థి దశ నుంచీ ఆయన ఉద్యమాల్లో ఉండటంతో ఈ ప్రాంతంలో ఆయనంటే తెలియనివారు లేరు. గిరిజన హక్కులపై ఆయన గట్టిగా గళమెత్తుతారన్న నమ్మకం ఆదివాసీల్లో ఉంది.

అల్లూరి జిల్లాలో...

అల్లూరి జిల్లాలో అరకు, పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. గతంలో వీటిని వైసిపి కైవసం చేసుకుంది. ప్రస్తుతం అరకు అసెంబ్లీ నుంచి వైసిపి అభ్యర్థిగా రేగం మత్స్యలింగం, కూటమి అభ్యర్థిగా బిజెపి నుంచి పాంగి రాజారావు బరిలో ఉన్నారు. బిజెపి అభ్యర్థికి టిడిపి శ్రేణులు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. తొలుత ఈ సీటును టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర నాయకులు దొన్ను దొరకు కేటాయించారు. ఆయన రెండు నెలలు పాటు ప్రచారం కూడా చేసుకున్నారు. ఆయన్ను కాదని తాజాగా బిజెపి అభ్యర్థి పాంగి రాజారావును కూటమి తరఫున ప్రకటించారు. ఆయనకు ఎన్నికల్లో సహకరించేది లేదని టిడిపి కార్యకర్తల సమావేశంలో దొన్నుదొర, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తేల్చి చెప్పేశారు. దొన్నుదొర ఇండిపెండెంటుగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. వైసిపి అభ్యర్థి రేగం మత్స్యలింగం పార్టీలో గ్రూపుల పోరుతో సతమతమవుతున్నారు. ఇండియా వేదిక తరఫున కాంగ్రెస్ నుంచి శెట్టి గంగాధర స్వామి బరిలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమైన సివేరి అబ్రహం కూడా ప్రభావం చూపుతారు. ఆయన మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుమారుడు. టిడిపి టికెట్ ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు.

ఇండిపెండెంటుగా గిడ్డి ఈశ్వరి..!

పాడేరు నియోజకవర్గానికి సంబంధించి వైసిపి అభ్యర్థిగా మత్స్యరాస విశ్వేశ్వరరాజు, టిడిపి అభ్యర్థిగా కిల్లు వెంకట రమేష్ నాయుడు, కాంగ్రెస్ అభ్యర్థిగా శతక బుల్లిబాబు పోటీ చేయనున్నారు. ఈ ముగ్గురు ముమ్మర ప్రచారంలో వారున్నారు. మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరికి టికెట్ దక్కకపోవడంతో ఆమె ఇండిపెండెంటుగా పోటీ చేస్తారని ప్రచారం సాగుతోంది. అదే జరిగితే కూటమి అభ్యర్థికి తలనొప్పి తప్పదు. రంపచోడవరం నియోజకవర్గానికి సంబంధించి టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా మిరియాల శిరీషా దేవిని టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఆమె రాజకీయాలకు పూర్తిగా కొత్త. పార్టీ కోసం ఐదేళ్లపాటు కష్టపడిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరిని కాదని కొత్త వ్యక్తికి సీటు ఎలా కేటాయిస్తారని రాజేశ్వరి మద్దతుదారులు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అధిష్టానం ఈ టికెట్‌పై పునరాలోచిస్తున్నట్టు తెలుస్తోంది.

ఏదేమైనా టిడిపిలో ఒకరికి టికెట్ ఇచ్చి మరొకరికి ఇవ్వకుంటే సహకరించుకునే పరిస్థితులు కనిపించడం లేదు. వైసిపి అభ్యర్థిగా సిట్టింగు ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి బరిలో ఉన్నారు. ఆమెపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్న విమర్శలు ఉన్నాయి. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ఆమె ఎటువంటి కృషీ చేయకపోవడంతో ప్రచారానికి వెళ్లినప్పుడు కొన్నిచోట్ల నిరసన వ్యక్తమవుతోంది.

సిపిఎం నుంచి బరిలో లోతా రామారావు

సిపిఎం నుంచి లోతా రామారావు బరిలో ఉన్నారు. ఇండియా వేదికలోని సిపిఐ, కాంగ్రెస్, పలు ప్రజా, గిరిజన సంఘాలు ఆయన్ను బలపరుస్తున్నాయి. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా పలు ఉద్యమాలకు రామారావు నాయకత్వం వహించారు. లోదొడ్డి పంచాయతీకి రెండుసార్లు సర్పంచిగా ఎన్నికై ఆదర్శ ప్రజాప్రతినిధిగా నిలిచారు. ప్రస్తుతం గిరిజన గ్రామాల్లో ప్రచారంలో ముందున్నారు. రాష్ట్ర విభజన తరువాత ఈ పదేళ్లలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు విలీన మండలాలను, పోలవరం నిర్వాసితులను గాలికొదిలేసిన వైనాన్ని ప్రజల్లోకి ఆయన బలంగా తీసుకెళ్తున్నారు. నిర్వాసితుల సమస్యలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతున్నారు.



'పశ్చిమ' సమరం రసవత్తరం

- గరంగరంగానే 'ఉండి' రాజకీయం



ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, నరసాపురం ఎంపి స్థానం ఉన్నాయి. గత ఎన్నికల్లో వైసిపి ఐదు చోట్ల, టిడిపి రెండు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోగా, ఎంపి స్థానం వైసిపి దక్కించుకుంది. ఈసారి ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఎన్నికల బరిలో దిగగా, వైసిపి ఒంటరిగా ముందుకు సాగుతోంది. ఇరుపార్టీలు అభ్యర్థుల ఎంపికను పూర్తిచేయడంతో, ఎన్నికల బరిలో నువ్వానేనా అన్నట్లు అంతా తలపడుతున్నారు. ఒక ఉండి నియోజకవర్గంలో మాత్రం ప్రతిపక్ష టిడిపి అభ్యర్థిపై అధిష్టానం పిల్లిమొగ్గలు వేస్తుండటంతో అక్కడ రాజకీయం గరంగరంగా మారింది.

'పశ్చిమ'లో ఇలా..

నరసాపురం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసిపి గెలిచింది. ఇక్కడ టిడిపి, బిజెపి, జనసేన పొత్తులో భాగంగా ఈసారి జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ నుంచి బొమ్మిడి నాయకర్ పోటీ చేస్తున్నారు. వైసిపి అభ్యర్థిగా సిట్టింగు ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద్‌రాజు మరోసారి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి కానూరి ఉదయభాస్కర్ కృష్ణప్రసాద్ పోటీ చేస్తున్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో గత ఎన్నికల్లో టిడిపి నుంచి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు గెలిచారు. ఈ ఎన్నికల్లోనూ మరోసారి ఆయనే పోటీ చేస్తున్నారు. వైసిపి నుంచి గుడాల గోపీ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి కొలుకులూరి అర్జునరావు పోటీ చేస్తున్నారు. ఆచంట నియోజకవర్గం నుంచి వైసిపి తరఫున సిట్టింగు ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పోటీ చేస్తున్నారు. టిడిపి నుంచి మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. తణుకు నియోజకవర్గం నుంచి టిడిపి తరఫున మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పోటీ చేస్తున్నారు. జనసేన టికెట్ ఆశించిన విడివాడ రామచంద్రరావు సహకరించని పరిస్థితి నెలకొంది. వైసిపి అభ్యర్థిగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి కడలి రామారావు పోటీ చేస్తున్నారు. భీమవరం నియోజకవర్గంలో వైసిపి తరఫున సిట్టింగు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. జనసేన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పులపర్తి ఆంజనేయులు పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఎ సీతారాం పోటీ చేస్తున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి వైసిపి తరఫున మంత్రి కొట్టు సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. అవినీతి ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. జనసేన అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మార్నీడి శేఖర్ పోటీ చేస్తున్నారు.

మంతెన రామరాజుకు పార్టీ నుంచి వ్యతిరేకత

ఉండి నియోజవర్గం నుంచి టిడిపి సిట్టింగు ఎమ్మెల్యే మంతెన రామరాజు మరోసారి పోటీ చేస్తున్నారు. ఈయనపై పార్టీ నుంచి కొంత వ్యతిరేకత వ్యక్తమైంది. గతంలో ఇదే నియోజకవర్గం నుంచి టిడిపి ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలుపొందిన వేటుకూరి వెంకట శివరామరాజుకు టికెట్ రాకపోవడంతో రెబల్‌గా పోటీలోకి దిగడం కొంత సమస్యగా మారింది. అదే తరుణంలో ఇక్కడ మంతెన రామరాజును మార్చి ఇటీవలే టిడిపిలో చేరిన రఘురామ కృష్ణరాజుకు టికెట్ ఇస్తారని ప్రచారం జరుగుతోంది. దీనికి వ్యతిరేకంగా రామరాజు అనుచరులు పెద్దయెత్తున ఆందోళన నిర్వహించారు. ఈ అంశాలన్నీ టిడిపికి మైనస్‌గా మారాయి. వైసిపి నుంచి పివిఎల్ నరసింహరాజు పోటీ చేస్తున్నారు. పార్టీ బలంపైనే ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. కాంగ్రెస్ నుంచి వేగేశ్న గోపాల కృష్ణరాజు పోటీ చేస్తున్నారు.

ఎంపి స్థానంలో ఎవరి లెక్కలు వారివే..


నరసాపురం ఎంపి బరిలో బిజెపి అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మ పోటీ చేస్తున్నారు. ఇక్కడ బిజెపికి పెద్దగా బలం లేదు. వైసిపి ఎంపి అభ్యర్థిగా గూడూరి ఉమాబాల పోటీ చేస్తున్నారు. రాజకీయంగా బలమైన అభ్యర్థి కాదు. కాంగ్రెస్ నుంచి ఎంపి అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు.

బి-ఫారమ్ గుబులు

- ఎవరి సీటుకు గండి పడుతుందోనని అభ్యర్థుల ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థుల్లో బి-ఫారమ్ గుబులు రేపుతోంది. ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థుల్లో గెలుపే ప్రామాణికంగా తీసుకుని ఆయా స్థానాల్లో మార్పులు చేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. దీంతో పోటీ చేయాలనుకునే సీటును ఎవరు తన్నుకుపోతారో అనే ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంది. ఎన్నికల కమిషన్ ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ గెజిట్ విడుదల చేయబోతోంది. అదేరోజు నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. గడువు దగ్గర పడే కొద్దీ అభ్యర్థుల్లో తమ భవితవ్యం ఎటువైపు మరలుతుందో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. వైసిపి రెబల్ ఎంపి రఘురామకృష్ణరాజు ఇటీవల టిడిపిలో చేరారు. కచ్చితంగా ఈ దఫా ఎన్నికల్లో ఎంపిగా గానీ, ఎమ్మెల్యేగా గానీ పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. దీంతో ఆయన కోసం ఉండి స్థానాన్ని ఖాళీ చేయిస్తారనే ప్రచారం



జరుగుతోంది. ఈ నేపథ్యంలో టిడిపి తొలి జాబితాలో సీటు పొందిన ఉండి సిట్టింగు ఎమ్మెల్యే, ప్రస్తుత టిడిపి అసెంబ్లీ అభ్యర్థి మంతెన రామరాజును పోటీ నుంచి తప్పిస్తారనే ప్రచారం సాగుతోంది. రామరాజుకు మద్దతుగా నియోజకవర్గంలో ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీంతో రామరాజుకు టిడిపి బి-ఫారమ్ ఇస్తుందా లేదా అనే ఆందోళన ఆయనను వెంటాడుతోంది. అలాగే నెల్లూరు జిల్లా కందుకూరు నుంచి ఇంటూరి నాగేశ్వరరావుకు టిడిపి టికెట్ ఖరారు చేసింది. ఇటీవల నియోజకవర్గంలో ఏర్పడిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయనను కూడా తప్పిస్తారనే ప్రచారం సాగుతోంది. ఉత్తరాంధ్రలో మాడుగుల నియోజకవర్గ టికెట్ ఇప్పటికే ఎన్‌ఆర్‌ఐకు కేటాయించింది. ఇదే స్థానంలో టిడిపి సీనియర్ నేత బండారు సత్యనారాయణకు టికెట్ ఇవ్వొచ్చని పార్టీలో ప్రచారం జరుగుతోంది. అలాగే అనపర్తి టికెట్ పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించారు. ఇటీవల బిజెపి అగ్రనేతలతో జరిగిన చర్చల్లో ఆ స్థానాన్ని టిడిపికి కేటాయించి అందుకు బదులుగా తంబళ్లపల్లె స్థానాన్ని బిజెపికి టిడిపి ఆఫర్ ఇచ్చింది. దీంతో రాజకీయ వాతావరణం ఎలా మారుతుందోననే ఆందోళన అందరిలోనూ వ్యక్తమైంది.

నాలుగైదు స్థానాల్లో వైసిపి అభ్యర్థుల మార్పు..!

వైసిపిలో నాలుగైదు స్థానాల్లో అభ్యర్థులను మార్చే అవకాశం లేకపోలేదని చర్చ నడుస్తోంది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రానున్న ఎన్నికల్లో మండపేట నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఈయనకు విశాఖ ఎస్‌సి, ఎస్‌టి కోర్టు దళితుల శిరోముండనం కేసులో 18 నెలల జైలుశిక్ష విధించింది. ఈ నేపథ్యంలో త్రిమూర్తులును తప్పించి మరొకరికి సీటు ఇచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. అలాగే ప్రకాశం జిల్లా సంతనూతలపాడు, గుంటూరు-2, రాయలసీమ జిల్లాలో ఓ పార్లమెంటు అభ్యర్థిని మార్చే అవకాశం ఉంది. వీటితోపాటు మరో రెండు, మూడు నియోజకవర్గాల్లో మార్పులు, చేర్పులుండొచ్చని సమాచారం. ఈ దఫా ఎన్నికలు వైసిపి, టిడిపికి చావో రేవో అనే పరిస్థితి నెలకొంది.

భవితవ్యమేమిటో?

- మళ్లీ బరిలో 'ముగ్గురు నాని'లు
- అసెంబ్లీకి ఆళ్ల, కొడాలి, లోక్‌సభకు కేశినేని పోటీ





ఈసారి ఎన్నికల బరిలోనూ ముగ్గురు నానిలు బరిలో ఉన్నారు. ఇద్దరు అసెంబ్లీకి, మరొక్కరు పార్లమెంటుకు పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నిల్లో 151 స్థానాలు గెల్చుకున్న సిఎం జగన్ తన మొదటి కేబినెట్‌లోకి ముగ్గురు మంత్రులు నాని పేరుతో ఉన్నవారికి అవకాశం కల్పించారు. వారిలో ఏలూరు జిల్లా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఆళ్ల కాళీకృష్ణశ్రీనివాస్ (నాని), కృష్ణా జిల్లా గుడివాడ నుంచి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), మచిలీపట్నం నుంచి పేర్ని వెంకట్రామయ్య (నాని). వీరు ముగ్గురూ వైసిపి నుంచి గెలుపొందారు. మూడేళ్ల తర్వాత రెండోదశ మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు నానిలకు చోటు దక్కలేదు. ఆళ్ల, కొడాలి నాని తిరిగి ఈ ఎన్నికల్లో పోటీచేస్తుండగా, పేర్ని నాని తన కుమారుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)ని నిలబెట్టారు. అయితే విజయవాడ పార్లమెంటు బరిలో టిడిపి నుంచి వైసిపిలోకి చేరిన కేశినేని శ్రీనివాసరావు (నాని) అనూహ్యంగా సీటును దక్కించుకున్నారు. ఇప్పుడు ఈ విధంగా చూస్తే మళ్లీ ముగ్గురు నానిలు అయ్యారు. కేశినేని నాని 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో విజయవాడ పార్లమెంటు స్థానం నుంచి టిడిపి తరఫున గెలుపొందిన విషయం తెలిసిందే. గుడివాడ శాసనసభ్యులు కొడాలి నాని ఆహార్యం వేరుగా ఉంటుంది. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్న సమయంలో కూడా కొడాలి నాని తన శాఖ కంటే కూడా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించటం, టిడిపినీ, ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేష్‌ను తిట్టడానికే ఎక్కువ సమయం కేటాయించారనే ఆరోపణలున్నాయి. బూతులు మంత్రిగా కూడా టిడిపి వారు నానిపై విమర్శలు గుప్పిస్తుంచారు. మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని నాని కూడా రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రవాణాశాఖ మంత్రిగా గతంలో పనిచేశారు. ఇప్పుడు వైసిపి అధినేత వైఎస్ జగన్‌ను ఒప్పించి తన కుమారుడుకు సీటు ఇప్పించుకున్నారు. ఏలూరుకు చెందిన ఆళ్ల నాని ప్రచారానికి దూరంగా ఉంటారు. పెద్దగా హడావుడి లేకుండా తనవంతుగా తన పనులు చేసుకుంటూపోతారు. జగన్‌కు వీరవిధేయుడుగా ఉండటం వల్ల ఆయనకు మళ్లీ టికెట్టు వచ్చింది అని ప్రచారం జరుగుతోంది.

వీరవిధేయుడుగా ఆళ్లకు గుర్తింపు

ఆళ్ల నాని 1994 నుంచి 2019 వరకూ ఆరుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయగా 2004, 2009లో కాంగ్రెస్, 2019 వైసిపి తరఫున గెలుపొందారు. కాంగ్రెస్ హయాంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైసిపి ప్రభుత్వంలో సిఎం వైఎస్ జగన్‌కు వీరవిధేయుడుగా ఉన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రితోపాటుగా ఉపముఖ్యమంత్రిగా అవకాశం దక్కటంతో మూడేళ్లపాటు ఆ పదవిలో కొనసాగారు. ప్రస్తుతం ఆళ్ల నాని తిరిగి పోటీచేస్తుండగా టిడిపి, బిజెపి, జనసేన తరఫున బడేటి రాధాకృష్ణ (చంటి) రంగంలో ఉన్నారు.

ప్రతిపక్షంపై దాడే కొడాలి అస్త్రం

2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి తరఫున కొడాలి నాని గెలుపొందారు. 2012లో టిడిపిని వీడి వైసిపిలో చేరారు. 2014, 2019లో వైసిపి తరఫున గెలుపొందారు. గత ఎన్నికల్లో అప్పటి టిడిపి అభ్యర్థి దేవినేని అవినాష్‌పై 19,479 ఓట్ల తేడాతో గెలుపొందారు. దేవినేని అవినాష్ వైసిపిలో చేరి విజయవాడ తూర్పు అభ్యర్థిగా బరిలో ఉన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి రాగా కొడాలి రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల మంత్రిగా పనిచేశారు. ఈసారి వైసిపి తరఫున కొడాలి నాని, టిడిపి తరఫున వెనిగండ్ల రాము పోటీచేస్తున్నారు.

పేర్ని వారసత్వ రాజకీయాలు

బందరులో నాని తనయుడు కిట్టు బరిలో ఉన్నారు. 2019లో వైసిపి, 2009, 2004లో కాంగ్రెస్ తరఫున నాని గెలుపొందారు. ఆయన తండ్రి పేర్ని కృష్ణమూర్తి 1989లో గెలిచి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. కొల్లు రవీంద్ర, ఆయన మామ నడకుదుటి నరసింహారావు టిడిపి ప్రభుత్వ హయాంలో మంత్రులుగా పనిచేశారు. పేర్ని నానికి ప్రత్యర్థి కొల్లు రవీంద్ర, ఇప్పుడు ఆయన తనయుడు పేర్ని కిట్టుపై పోటీచేస్తున్నారు.

విజయవాడలో కేశినేని బ్రదర్స్ రసవత్తర పోరు

విజయవాడ లోక్‌సభ బరిలో ఈసారి కేశినేని శ్రీనివాసరావు (నాని), ఆయన సోదరుడు కేశినేని శివనాథ్ (చిన్ని) మధ్య రసవత్తంగా పోరు జరగనుంది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో అన్న విజయం కోసం పనిచేసిన చిన్ని ఇప్పుడు తన విజయం కోసం అర్రులు చాస్తున్నారు. మొదటి నుంచి చంద్రబాబు వైఖరిపై విమర్శలు గుప్పిస్తున్న కేశినేని నానికి చెక్‌పెట్టడానికి పూనుకుంటున్నారన్న విషయాన్ని గ్రహించిన నాని ఆ పార్టీ నుంచి బయటపడేందుకు పెద్దయెత్తునే వ్యూహాత్మంగా వ్యవహరించారు. 2019 ఎన్నికల్లో టిడిపి మూడు పార్లమెంటు స్థానాలు కైవసం చేసుకోగా, అందులో విజయవాడ ఒకటి. రెండోసారి గెలుపొందిన తర్వాత మొదట్లో చంద్రబాబుకు దగ్గరగా ఉన్న నాని ఆ తర్వాత దూరంగా జరగటం ప్రారంభించారు. అవకాశం చిక్కినప్పుడల్లా తన అసంతృప్తినీ, ఆగ్రహాన్ని బహిరంగంగా వ్యక్తం చేశారు. అన్న వ్యవహారశైలిపై అధిష్టానం ఆగ్రహంతో ఉన్న విషయాన్ని పసిగట్టిన కేశినేని చిన్ని చాపకింద నీరులా పార్టీలోకి యాక్టివ్‌రోల్‌ను మరింగా పెంచారు. దీంతో చిన్నిని తెరపైకి తెచ్చేశారు. ఈ వైరం ఈ రోజుది కాదని, గత కొన్నేళ్లుగా కొనసాగుతోందని అన్నదమ్ములిద్దరూ ఇప్పుడు చెప్పుకుంటున్నారు.

-యడవల్లి శ్రీనివాసరావు

1994 ఎన్నికలు - టిడిపిలో తిరుగుబాటు - ఎన్‌టిఆర్ పదవీచ్యుతి

1989లో ఓటమి చవిచూసిన తెలుగుదేశం పార్టీ 1994 ఎన్నికల్లో తిరిగి విజయం సాధించింది. ఆ ఐదేళ్లలో ముగ్గురు ముఖ్యమంత్రుల మార్పు, ప్రజా వ్యతిరేక విధానాల పుణ్యమాని ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి చెందాల్సి వచ్చింది. 1994లో సిపిఐ, సిపిఐ(ఎం) వంటి మిత్రపక్షాలతో కలిసి ఎన్‌టి రామారావు నేతృత్వంలో టిడిపి ఎన్నికలకు వెళ్లింది.

ఆ ఎన్నికల్లో టిడిపి 251 స్థానాలకు పోటీ చేసి 216 స్థానాల్లో విజయదుందుభి మోగించింది. 1,37,43,842 (44.14 శాతం) ఓట్లు సాధించింది. కాంగ్రెస్ 294 సీట్లకు పోటీ చేసి 26 స్థానాలు మాత్రమే గెలవగలిగింది. ఆ పార్టీ 1,05,40,182 (33.85 శాతం) ఓట్లు పొందింది. అప్పటివరకూ జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎన్నికల చరిత్రలో అత్యంత తక్కువ సీట్లు కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లోనే వచ్చాయి. టిడిపి మిత్రపక్షాలైన సిపిఐ 21 స్థానాలకు పోటీ చేసి 19 స్థానాలను, సిపిఐ(ఎం) 16 స్థానాలకు పోటీ చేసి 15 స్థానాలను గెలుచుకున్నాయి. సిపిఐకి 10,56,789 (3.39 శాతం), సిపిఐ(ఎం) 9,23,204 (2.96 శాతం) ఓట్లు సాధించాయి. పోటీ చేసిన 1953 మంది ఇండిపెండెంట్లలో 12 మంది మాత్రమే గెలిచారు. వీరికి 26,96,143 (8.66 శాతం) ఓట్లు లభించాయి. బిజెపి 280 స్థానాల్లో పోటీ చేసి 3 సీట్లలో విజయం సాధించింది. 12,10,873 (3.89 శాతం) ఓట్లు పొందింది. ఎంఐఎం 1, ఎంబిటి 2 స్థానాలు గెలిచాయి.


ముఖ్యమంత్రిగా ఎన్‌టిఆర్


ముఖ్యమంత్రిగా ఎన్‌టి రామారావు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకుడి స్థానం పొందడానికి తగిన సీట్లు కాంగ్రెస్‌కు లభించలేదు. కేబినెట్ ర్యాంక్‌గల ప్రతిపక్ష నాయకుడుగా ఎన్నిక కావాలంటే కనీసం 29 శాసనసభా స్థానాలు వచ్చి ఉండాలి. అయితే కాంగ్రెస్‌కు 26 స్థానాలే వచ్చాయి. అందువల్ల కాంగ్రెస్ రాజ్యాంగ గుర్తింపు పొందిన ప్రతిపక్ష నాయకత్వ స్థానం పొంద లేకపోయింది. హైదరా బాద్‌లోని ఖైరతాబాద్ కాంగ్రెస్ శాసనసభ్యుడైన పి. జనార్ధనరెడ్డి కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా ఎన్నికయ్యారు. సిపిఐ శాసనసభా పక్ష నేతగా చెన్నమనేని రాజేశ్వరరావు, సిపిఐ(ఎం) శాసనసభా పక్ష నేతగా బోడేపూడి వెంకటేశ్వ రరావు, బిజెపి శాసనసభా పక్ష నేతగా చెన్నమనేని విద్యాసాగరరావు ఎన్నికయ్యారు.

- యు. రామకృష్ణ

1994 శాసనసభలో పార్టీల బలాబలాలు

పార్టీ	పోటీ	గెలుపు	ఓట్లు	శాతం
తెలుగుదేశం	251	216	1,37,43,842	44.14
కాంగ్రెస్	294	26	1,05,40,182	33.85
సిపిఐ	21	19	10,56,789	3.39
సిపిఐ(ఎం)	16	15	9,23,204	2.96
బిజెపి	280	03	12,10,873	3.89
ఇండిపెండెంట్లు	1953	12	26,96,143	8.66


ఎన్. టి. రామారావు


చంద్రబాబు నాయుడు


పి. జనార్ధన రెడ్డి


చెన్నమనేని రాజేశ్వరరావు


బోడేపూడి వెంకటేశ్వరరావు

లెజిస్లేచర్ పార్టీలో చంద్రబాబు తిరుగుబాటు

1994 నుంచి సాఫీగా సాగిపోతున్న టిడిపి ప్రభుత్వంలో వచ్చిన పెద్ద కుదుపు 1995లో ఎన్‌టిఆర్ పదవీచ్యుతికి దారితీసింది. ఎన్‌టిఆర్ 1993లో లక్ష్మీపార్వతిని ద్వితీయ వివాహం చేసుకున్నారు. తర్వాత్తర్వాత లక్ష్మీపార్వతి తెలుగుదేశం పార్టీ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందనే ఆరోపణల నేపథ్యంలో.. టిడిపిలోని కొందరు నేతలు విమర్శలు చేయడం ప్రారంభించారు. ముఖ్యంగా రెవెన్యూ, ఆర్థిక మంత్రిగా ఉన్న చంద్రబాబు బాగా అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలోనే నాడు రాష్ట్రంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లు, జిల్లా సహకార మార్కెటింగ్ కమిటీ అధ్యక్షుల ఎన్నికలు జరిగాయి. టిడిపి అధికారికంగా పోటీ చేసిన అభ్యర్థులు అనేకచోట్ల ఓడిపోయారు. పార్టీలో పోటీ అభ్యర్థులు గెలిచారు. ఎన్‌టిఆర్ దీనికి బాధ్యులుగా గుర్తించిన కొందరు నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అంతేకాదు.. తనను పదవీచ్యుతుణ్ణి చేసేందుకు పెద్ద కుట్ర జరుగుతుందని కూడా గుర్తించారు. దీని వెనుక మంత్రులు కూడా ఉన్నారన్న విషయం తెలుసుకున్న ఎన్‌టిఆర్, 1995 ఆగస్టు 25న చంద్రబాబును, మరో ముగ్గురు మంత్రులను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారు. దీంతో ఎప్పటినుంచో తనకు టచ్‌లో ఉన్న తెలుగుదేశం ఎమ్మెల్యేలను చంద్రబాబు ఓ హోటల్‌లో సమావేశపరిచారు. అనేక నాటకీయ పరిణామాలు చకచకా సాగాయి. ఎన్‌టిఆర్‌కు శాసనసభలో బలం లేదని, తనకు 154 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని చంద్రబాబు రాష్ట్ర గవర్నర్‌ను సంతృప్తపరచగలిగారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు 1995 సెప్టెంబరు 1న ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ విధంగా ఎన్‌టిఆర్ పదవీచ్యుతి జరిగింది. ఎన్‌టిఆర్ తన అల్లుడైన చంద్రబాబును ద్రోహిగా అభివర్ణిస్తూ చేసిన స్వీయ ప్రకటన పెద్ద సంచలనం కలిగించింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న చంద్రబాబు 1983లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చేతిలో ఓడిపోయి.. తరువాత టిడిపిలో చేరి తనకే బిక్ష పెట్టిన ఎన్‌టిఆర్‌ను పదవీచ్యుతుణ్ణి చేసిన ప్రక్రియ విమర్శకుల నోట నేటికీ పెద్ద చర్చనీయాంశంగా ఉంది.

సంపాదకీయం

శిరోముండనం !

ఇరవై ఎనిమిది సంవత్సరాల క్రితం రాష్ట్రంలో సంచలనం సృష్టించిన శిరోముండనం సంఘటనలో ప్రత్యేక కోర్టు వెలువరించిన తీర్పు భిన్నాభిప్రాయాలకు వేదికైంది. ఎట్టకేలకు తీర్పు రావడంతో పాటు, అధికార, ధన, కుల బలంతో రెచ్చిపోయిన తోట త్రిమూర్తులను ప్రత్యేక కోర్టు దోషిగా నిర్ధారించడం నిస్సందేహంగా ఆహ్వానించదగ్గ విషయం. అమానుష కాండకు తెగబడినప్పటి నుండి ఇప్పటివరకు అధికారాన్ని అంటిబెట్టుకునే ఉన్న త్రిమూర్తులు కేసును నీరు గార్చడానికి వేసిన ఎత్తులు దిగ్భ్రాంతిని కలిగిస్తాయి. దీంతో ఈ కేసు ఎప్పటికైనా ముగుస్తుందా? బాధితులకు న్యాయం జరుగుతుందా అన్న అనుమానాలు సైతం ముసురుకున్నాయి. చిట్టచివరకు త్రిమూర్తులను ధర్మాసనం దోషిగా ప్రకటించడం ఇంతకాలం పట్టువిడవకుండా పోరాడిన వెంకటాయ పాలెం దళితుల, బాధితుల, వారికి అండగా నిలిచిన ప్రజాసంఘాల విజయం! అయితే, దోషులకు ధర్మాసనం విధించిన 18 నెలల జైలు శిక్ష, 4.78 లక్షల రూపాయల జరిమాన అత్యంత అసంతృప్తికరం! ఒక రకంగా కోర్టు విధించిన ఈ శిక్ష ఆయన మీద నామమాత్రపు ప్రభావం కూడా చూపదు! జైలుకు పోకుండానే బెయిల్ పొందడానికి ఆయన అనుచరగణం చేస్తున్న ప్రయత్నాలే దీనికి నిదర్శనం.

నిజానికి ఈ అనాగరిక సంఘటన వెలుగులోకి రావడం, ఆ తరువాత న్యాయం కోసం జరిగిన సుదీర్ఘ పోరాటం, దానికి లభించిన మద్దతు ఒక అద్భుతం. పీడనతో పాటు, దానిని ప్రతిఘటించే శక్తి కూడా ఈ సమాజంలోనే ఉంటుందనడానికి ఇదో నిదర్శనం. 1994 ఎన్నికల్లో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం మండలం వెంకటాయపాలెం గ్రామంలో రాజకీయంగా తనతో కలిసి రాలేదన్న కక్షతో ఇద్దరు దళిత యువకులపై అక్రమ కేసులు బనాయించి, కనుబొమలతో పాటు వారికి శిరోముండనం చేయించిన నికృష్ట చరిత్ర తోట త్రిమూర్తులది! ఆయన అధికార బలానికి జడిసి దళితవాడంతా ఆ అవమానాన్ని మౌనంగానే భరించింది. అయితే, రెండు రోజుల తరువాత దినపత్రికల్లో ప్రచురితమైన ఈ దారుణం కలకలం రేపింది. అప్పటి జిల్లా ఎస్‌పి స్వయంగా కదిలారు. త్రిమూర్తులుతో పాటు, ఆయన అనుచరులపైనా ఎస్‌సి, ఎస్‌టి వేధింపుల చట్టం కింద కేసులు పెట్టారు. బాధితులకు అండగా హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు కదిలాయి. ఐక్య పోరాట వేదికగా దృఢంగా నిలిచాయి. ఉన్నవాడికి చట్టం ఎలా చుట్టంగా మారుతుందనడానికి కూడా ఈ కేసు ఒక ఉదాహరణ. ఈ కాలమంతా తోట త్రిమూర్తులు అధాకారాన్ని అంటబెట్టుకునే ఉన్నారు. కాంగ్రెస్, టిడిపి, వైసిపి ఏ పార్టీ అధికారం ఉంటే ఆ పార్టీలోకి ఫిరాయించారు. అధికార, అంగబలాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించారు. బాధితులపై క్రిస్టియన్లన్న ముద్ర వేశారు. పనులు దొరక్కుండా చేసి ఆకలితో అలమటించేలా చేశారు. విచారణ జరిగే కాలంలో నలుగురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మారారు. న్యాయమూర్తులను, కోర్టులను కూడా అదే స్థాయిలో మార్చారంటే ఏ స్థాయిలో అధికార దుర్వినియోగం జరిగిందో ఊహించవచ్చు. సుదీర్ఘ కాల విచారణలో 24 మంది సాక్షుల్లో ప్రస్తుతం ఇద్దరు ముగ్గురు మాత్రమే ప్రాణాలతో ఉన్నారు. ఇంత నిరీక్షణ, పోరాటం తరువాత వచ్చిన తీర్పుతో దక్కిన ఊరటా అంతంతమాత్రమే!

దళితులపై జరిగే దారుణాల విచారణలో అంతులేని జాప్యం, నిస్సారమైన తీర్పులు కొత్తేమీ కాదు! గతంలోనూ ఇటువంటి సంఘటనలు ఉన్నాయి. ఈ దుస్థితిని మార్చి దళిత ప్రజానీకంలో మనోధైర్యం నింపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. తోట త్రిమూర్తులకు ప్రత్యేక కోర్టు విధించిన శిక్షపై ప్రభుత్వం తక్షణం అప్పీలుకు వెళ్లాలి. ఆయనకు కఠినశిక్ష పడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. దళితుల మద్దతు తమకే ఉందని చెప్పుకుంటున్న వైసిపికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ఆయనపై రాజకీయపరమైన చర్యలు చేపట్టాలి. ఇప్పటికే ఉన్న ఎంఎల్‌సి పదవికి రాజీనామా ఇప్పించాలి. ఈ దిశలో చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వంపైనా, వైసిపిపైనా పౌర సమాజం ఒత్తిడి తీసుకురావాలి.

మహనీయుల మాట



తెలివైన వారెప్పుడూ
కాలాన్ని క్షణం కూడా
వృథా చేయకుండా
సద్వినియోగం చేసుకుంటారు.
- జాన్ రస్కిన్,
బ్రిటిష్ రచయిత.

బిజెపి ఎన్నికల మ్యానిఫెస్టో డొల్లతనం

విశ్లేషణ



వి.రాంభూపాల్

బిజెపి ఎన్నికల మ్యానిఫెస్టో గత పది సంవత్సరాల పాలనా వైఫల్యాల గురించి మాట్లాడకపోగా, ఇన్నేళ్ళుగా దేశ ప్రజల ఐక్యతకు దండలో దారంలా నిలిచిన లౌకికతత్వాన్నే ప్రమాదంలో పడేసే విధంగా వుంది. బ్రిటీష్ పాలనా కాలం నాటి కంటే ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల లాంటి సమస్యలు అత్యంత తీవ్రమయ్యాయని అనేక నివేదికలు చెబుతున్నా కనీస చలనం మోడీకి, ఆయన పార్టీకి లేదని ఈ ప్రణాళిక రుజువు చేసింది. మోడీ నామ స్మరణతో, అందమైన ఆయన రంగురంగుల చిత్రాలతో, ఆకర్షణీయమైన డిజైనింగ్‌లతో, గంభీరమైన పదవిన్యాసాలతో 69 పేజీల బిజెపి ఎన్నికల ప్రణాళిక పేరు 'సంకల్ప పత్రం'. ఇది దేశాభివృద్ధి కోసం సంకల్పం కాదు, మత రాజ్య నిర్మాణానికి సంకల్పం లాగా వుంది. ఏప్రిల్ 14న సరిగ్గా మొదటి విడత పోలింగ్‌కు ఐదు రోజుల ముందు 24 రకాల మోడీ గ్యారంటీలతో హడావుడిగా విడుదల చేసింది. తమ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ వివాదాస్పద ఎజెండాలు పౌరసత్వ చట్ట సవరణ, ఒకే ఎన్నిక లాంటి వాటిని ఈ ప్రణాళికలో చేర్చడం వెనుక దేశ ప్రజల అభివృద్ధి కంటే మత రాజ్య నిర్మాణమే తమ ప్రాధాన్యత అని మరోసారి చాటుకున్నారు.

గత పది సంవత్సరాల మోడీ పాలనలో 80 కోట్ల మందికి పైగా ఉచిత రేషన్, 50 కోట్ల మంది పౌరులకు బ్యాంకు అకౌంట్లు, ఆరు కోట్ల మంది తల్లులు, పిల్లలకు వ్యాక్సినేషన్, పది కోట్ల మంది మహిళలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్, 14 కోట్ల కుటుంబాలకు శుద్ధమైన కుళాయి నీరు, నాలుగు కోట్ల మందికి పక్కా ఇల్లు, 46 కోట్ల మంది యువతకు రుణాలు ఇవ్వడం, 11 కోట్ల మంది రైతులకు సంవత్సరానికి ఆరు వేల రూపాయలు సహాయం చేయడం లాంటి వాటి గురించి గొప్పగా చెప్పుకున్న ఈ ప్రణాళికలో, 2014 నాటి నల్లధనం వెలికితీత, ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు, ధరల నియంత్రణ, అవినీతి అరికట్టడం లాంటి కీలకమైన హామీల అమలు ఎలా జరిగిందో చెప్పలేకపోయారు.

కరోనా సమయంలో 2020 ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన (పిఎంజికెఎవై)' పథకం ద్వారా 80 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇవ్వడాన్ని చెప్పిన బిజెపి, కరోనా మహమ్మారి దుష్ఫలితాలు ఇంకా ప్రజలను పట్టి పీడిస్తున్న ఈ ఉచిత బియ్యం పథకాన్ని 2022 డిసెంబర్‌లో ఎందుకు నిలిపివేశారో చెప్పలేదు. ప్రజా పంపిణీ ద్వారా పేదలకు అందిస్తున్న ఆహార సరుకుల సబ్సిడీకి కోట్లు ఖర్చు చేశామంటున్న మోడీ ప్రభుత్వం, 2014-15 బడ్జెట్‌లో యుపిఎ ప్రభుత్వం 6.4 శాతం నిధులు ఆహార సబ్సిడీ కోసం కేటాయించగా, ఈ ప్రభుత్వం 2024-25 నాటికి 4.3 శాతానికి తగ్గించిన విషయాన్ని కావాలనే దాచింది. 125 దేశాల ప్రపంచ ఆకలి సూచికలో మన దేశం 2018లో 103వ స్థానం నుండి, 2023 నాటికి 111వ స్థానానికి దిగజారిన విషయంపై ఈ ప్రణాళిక మౌనం దాల్చింది. పది కోట్ల మంది మహిళలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ అందించామని చెప్పుకున్న బిజెపి తన పాలనలో గ్యాస్ లబ్ధిదారుల్లో సుమారు కోటి మంది సంవత్సరంలో ఒక్క సిలిండర్ కూడా కొనలేదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇటీవల ప్రకటించడం పట్ల తేలు కుట్టిన దొంగల్లా ఉన్నారు. ప్రపంచమంతా పెట్రోల్ ధరలు, ఆహార సరుకుల ధరలు తగ్గుతున్నా మన దేశంలో 2014-2024 మధ్య గ్యాస్ రూ.410 నుండి రూ.1200 (మార్చి 8న వంద రూపాయలు తగ్గించారు), డీజిల్ 62 నుండి 93, పెట్రోల్ 72 నుండి 106, సన్‌ఫ్లవర్ ఆయిల్ 80 నుండి 160, పప్పుదినుసులు 75 నుండి 150కి పెరగడానికి కారణాలు ఏమిటో ఈ ప్రణాళికలో లేవు. మోడీ ఈ పది సంవత్సరాల్లో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లపై వేసిన పన్నుల వల్ల అదనంగా రూ. 26.74 లక్షల కోట్లు, జిఎస్‌టి పేరుతో వివిధ రకాల సరుకులపై అదనంగా రూ. 31.25 లక్షల కోట్లు మొత్తం రూ. 58 లక్షల కోట్ల భారాలు ప్రజలపై వేశారు. ఆరు కోట్ల మంది తల్లులు, పిల్లలకు వ్యాక్సినేషన్ చేసి వారి ఆరోగ్యాన్ని కాపాడామని బిజెపి ప్రభుత్వం చెబుతుంటే, ఐదు సంవత్సరాల లోపు వున్న 36 శాతం మంది పిల్లలు పౌష్టికాహార లోపంతో వుండాల్సిన బరువు కంటే తక్కువగా వున్నారని, మహిళల్లో 15 నుండి 49 సంవత్సరాల లోపు వున్న మహిళల్లో రక్తహీనతతో బాధపడుతున్న వారు 2015-16లో 53 శాతం మంది వుండగా, 2020 నాటికి 57.2 శాతానికి పెరిగిన విషయాన్ని దాచారు. 2013-14 కేంద్ర బడ్జెట్‌లో వైద్యానికి 2.05 శాతం కేటాయిస్తే 2024-25లో కేవలం 1.9 శాతం నిధులు కేటాయించారు. ఇండోనేషియా మన కంటే పది రెట్లు వైద్యానికి ఖర్చు చేస్తుంది. అభివృద్ధి చెందుతున్న 50 దేశాలు వైద్యం కోసం చేస్తున్న ఖర్చులో మన దేశం స్థానం కింద నుండి పదోస్థానం.

రాముడి విగ్రహ ప్రతిష్ట చేసిన ఉత్తరప్రదేశ్‌లో 16 వేల ఉద్యోగాలకు 50 లక్షల మంది దరఖాస్తు చేసుకోవడం ఈ దేశ నిరుద్యోగ తీవ్రతకు నిదర్శనం. 2014లో నిరుద్యోగ రేటు 2.1 వుండగా 2024 నాటికి 8.1 శాతానికి పెరిగింది. గత 43 సంవత్సరాల్లో నిరుద్యోగం ఇంత తీవ్ర స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి. 2023 అక్టోబర్ నాటికి నాలుగు కోట్ల 20 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నట్లు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. డిగ్రీ ఆపైన చదువుకున్న వారిలో 25 ఏళ్ళ లోపు 42.3 శాతం, 25-29 ఏళ్ళ లోపు 22.8 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా-2023' రిపోర్టు ప్రకటించింది. వ్యవసాయ సంక్షోభంతో గ్రామీణ నిరుద్యోగం భారీగా పెరిగింది. 2016-2023 మధ్య నాలుగు కోట్ల మంది ప్రజలు వ్యవసాయాన్ని వదిలి పట్టణాలకు, నగరాలకు వలసలు వచ్చారు. వ్యవసాయ రంగానికి కేటాయించే కేంద్ర బడ్జెట్ మోడీ పాలనలో క్రమంగా తగ్గి ఈ సంవత్సరానికి 2014తో పోలిస్తే 30 శాతం తగ్గింది. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల కోసం తెచ్చిన వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన చారిత్రాత్మకమైన ఆందోళనలో 752 మంది రైతులు మరణించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని లక్ష్యానికి అనుగుణంగా అమలు చేయడానికి సంవత్సరానికి రూ.2.72 లక్షల కోట్లు అవసరం కాగా, ఈ సంవత్సరం బడ్జెట్‌లో కేవలం రూ.73,000 కోట్లు మాత్రమే కేటాయించి పేదల నోట్లో మట్టి కొడుతున్నారు. ఈ పది సంవత్సరాల్లో 1,74,000 మంది రైతులు ఆర్థిక ఇబ్బందులతో, పంట నష్టాలతో ఆత్మహత్యలు చేసుకున్నారు. ఐదు లక్షల కోట్లు కేటాయిస్తే దేశవ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతుల బ్యాంకు రుణాలన్నీ మాఫీ చేయవచ్చు. అన్నదాతల రుణాలు మాఫీ చేయలేని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు మాత్రం రూ.30 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసింది.

మోడీ ఇచ్చిన 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' నినాదం కార్పొరేట్ కంపెనీలు, సంపన్నులను మాత్రం భారీగా వికసించేటట్లు చేసింది. 2014 నాటికి దేశంలో వందల కోట్ల సంపద వున్న సంపన్నులు 2014లో 56 మంది వుంటే, నేడు 169 మందికి పెరిగారు. అదానీ, అంబానీ లాంటి మోడీ ఆప్తమిత్రుల సంపదకు అంతు లేకుండా పోయింది. 2013లో అదానీ సంపద రూ. 25,792 కోట్ల నుండి 2022 నాటికి రూ. 7,48,800 కోట్లకు, అంబానీ సంపద 2014లో రూ. 1,54,742 కోట్ల నుండి 2022 నాటికి రూ. 7,54,620 కోట్లకు పెరిగింది. బిజెపి అధికారం చేపట్టే నాటికి దేశంలో పెరిగిన అవినీతితో యువత తీవ్ర నిరాశకు లోనయి వున్నారని మోడీ ఈ ప్రణాళికలో చెప్పుకున్నారు. ఆనాటి కాంగ్రెసు ప్రభుత్వ పాలనలో అవినీతి, కుంభకోణాలు వున్నాయన్నది నిజం. కాని ఈ పదేళ్ళలో జరిగిన బ్యాంకుల లూఠీ, ప్రభుత్వ రంగ సంస్థలను చౌకగా అమ్మివేయడం, సహజ వనరులను కొల్లగొట్టడం, పెద్ద నోట్ల కుంభకోణం, తాజాగా ఎన్నికల బాండ్ల భారీ అవినీతి లాంటి వాటితో పోలిస్తే నాటి అవినీతి గీత చిన్నదిగా మారిపోతుంది. 2005-14 మధ్య బ్యాంకు కుంభకోణాల విలువ రూ. 34,993 కోట్లు కాగా, 2015-23 మధ్య 5.89 లక్షల కోట్లకు చేరింది. విజయ్‌మాల్యా పది వేల కోట్లు, నీరవ్ మోడీ 11,400 కోట్లు, జతిన్ మెహతా ఏడు వేల కోట్లు, రిషీ కమలేష్ అగర్వాల్ 22,842 కోట్లు, కనీష్ గోల్డ్ 824 కోట్లు, గుజరాత్ లోని స్టెర్లింగ్ బయోటెక్ సంస్థ 8,100 కోట్లు, విక్రమ్ కొఠారీ 2,919 కోట్లు ఇలా చెబుతూ పోతే ఈ అక్రమార్కుల లిస్టు చాలా పెద్దదేవుంది.

రైతుల వ్యవసాయం, యువతకు ఉపాధి, ధరల నియంత్రణ, ఆర్థిక అసమానతలు తగ్గించడం, అవినీతిని అరికట్టడం, సహజ వనరుల పరిరక్షణ, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతిభద్రతలు, నూరు జిల్లాల్లో పేదిరికాన్ని తొలగిస్తామనే బిజెపి హామీ అమలు గురించి, అందరికీ చదువు అందించే ప్రణాళిక లాంటి కీలక సమస్యలకు బిజెపి ఎన్నికల ప్రణాళికలో చోటు లేదు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, 370 ఆర్టికల్ రద్దు లాంటి వాటిని ఎన్నికల్లో వాడుకునే కుటిల ప్రయత్నాలు ఈ ఎన్నికల ప్రణాళికలో కనిపిస్తాయి. ఈ ఎన్నికల్లో బిజెపి ఓడిపోకపోతే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో అనేక మంది నిపుణులు రూపొందించిన భారత రాజ్యాంగం, అందులో భాగంగా ప్రజాస్వామ్య వ్యవస్థ తీవ్ర ప్రమాదంలో పడుతుంది. ప్రజాస్వామ్యంలో ఇవే చివరి ఎన్నికలు కాకూడదని, దేశంలో నియంతల పాలన రాకూడదని భావించే మేధావులు, ప్రజాతంత్రవాదులు, లౌకికవాదులు ఐక్యంగా బిజెపి ఎన్నికల ప్రణాళికలోని ప్రమాదాన్ని ప్రజలకు వివరించాలి. బిజెపిని, దాని మిత్రపక్షాలను ఓడించాలి.

/వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/



"రైతుల వ్యవసాయం, యువతకు ఉపాధి, ధరల నియంత్రణ, ఆర్థిక అసమానతలు తగ్గించడం, అవినీతిని అరికట్టడం, సహజ వనరుల పరిరక్షణ, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతిభద్రతలు, నూరు జిల్లాల్లో పేదిరికాన్ని తొలగిస్తామనే బిజెపి హామీ అమలు గురించి, అందరికీ చదువు అందించే ప్రణాళిక లాంటి కీలక సమస్యలకు బిజెపి ఎన్నికల ప్రణాళికలో చోటు లేదు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, 370 ఆర్టికల్ రద్దు లాంటి వాటిని ఎన్నికల్లో వాడుకునే కుటిల ప్రయత్నాలు ఈ ఎన్నికల ప్రణాళికలో కనిపిస్తాయి. ఈ ఎన్నికల్లో బిజెపి ఓడిపోకపోతే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో అనేక మంది నిపుణులు రూపొందించిన భారత రాజ్యాంగం, అందులో భాగంగా ప్రజాస్వామ్య వ్యవస్థ తీవ్ర ప్రమాదంలో పడుతుంది. ప్రజాస్వామ్యంలో ఇవే చివరి ఎన్నికలు కాకూడదని, దేశంలో నియంతల పాలన రాకూడదని భావించే మేధావులు, ప్రజాతంత్రవాదులు, లౌకిక వాదులు ఐక్యంగా బిజెపి ఎన్నికల ప్రణాళికలోని ప్రమాదాన్ని ప్రజలకు వివరించాలి."

విశాఖ స్టీల్‌ప్లాంట్ మూసివేతకు అదానీ, మోడీ కుట్ర

సమస్య



సిహెచ్. నరసింగరావు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని కోక్ ఓవెన్ విభాగం నడవడానికి ఒక్కరోజుకు కావాల్సిన కోకింగ్ కోల్ కూడా లేకుండా ఖాళీ అయ్యింది. 40 సంవత్సరాల క్రితం స్టీల్ ప్లాంట్ ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు ఇటువంటి పరిస్థితి ఎన్నడూ లేదు. దీనికి నిరనగా ఏప్రిల్ 21న జరిగే "విశాఖ స్టీల్ గర్జన"లో కార్మికులందరూ పాల్గొనాలని, ప్రజలు మద్దతునివ్వాలని సిఐటియు కోరుతున్నది. స్టీల్‌ప్లాంట్‌లో మొట్టమొదటి విభాగం కోక్‌ఓవెన్. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కోక్ ఓవెన్ లైఫ్‌లైన్ లాంటిది. కోక్‌ఓవెన్ విభాగం తర్వాతే మిగిలిన సింటర్ ప్లాంట్, బ్లాస్ట్ ఫర్నేస్ విభాగాలు ఉంటాయి. కోక్ ఓవెన్ నడవకపోతే విశాఖ స్టీల్‌ప్లాంట్ అంతా స్థంభించిపోతుంది. కోక్ ఓవెన్‌లో రోజుకు కనీసం 320 పుషింగ్‌లు తీయాలి. 320 పుషింగ్‌లు తీయడానికి కావాల్సిన ముడిసరుకు ఉండాలి. కోక్ ఓవెన్ నడవకపోతే బ్యాటరీలు దెబ్బతింటాయి. బ్యాటరీలు దెబ్బ తింటే రిపేర్లు చేయడానికి కనీసం 60 రోజులు పడుతుంది. ప్రస్తుతం ఉన్న ఐదు బ్యాటరీలు సక్రమంగా నడిస్తేనే విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి సవ్యంగా సాగుతుంది. ఎన్నికల సమయాన్ని అదునుగా తీసుకుని విశాఖస్టీల్ ప్లాంట్‌ను ఎలాగైనా నడవకుండా చేయడానికి అదానీ, మోడీలు కుట్ర పన్నారు.

గంగవరం పోర్టు యార్డులో 30 వేల టన్నుల కోకింగ్ కోల్ నిల్వ వున్నది. ఆస్ట్రేలియా నుండి వచ్చిన 1.5 లక్షల టన్నులు కోకింగ్ కోల్ గంగవరం పోర్టు బయట ఉంది. కానీ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో మాత్రం నేడు ఒక్క టన్ను కూడా లేదు. ఎందుకు ఈ పరిస్థితి వచ్చింది? గంగవరం యాజమాన్యం కావాలని గంగవరం కార్మికులతో వివాదం సృష్టించింది. గంగవరం పోర్టు ఏర్పడిన గత 16 సంవత్సరాల నుండి కార్మికులు 8 గంటలు పనిచేస్తున్నారు. కానీ కార్మికులకు కొత్త కాంట్రాక్టర్లను పెట్టి రోజుకు 12 గంటలు పని చేయించాలని యాజమాన్యం సిద్ధం చేస్తున్నది. ఇప్పటికే రైల్వే, వెయింగ్ సెక్షన్లలో అమలు చేశారు. దీనివల్ల ఇప్పుడు గంగవరం పోర్టులో పని చేసే కార్మికుల్లో మూడో వంతు మందికి ఉద్యోగాలు పోతాయి. కొత్త కాంట్రాక్టర్లు ఎవరిని వుంచుతారో, ఎవర్ని తొలగిస్తారో తెలియదు. యాజమాన్యం పోర్టులోని స్టాక్ యార్డులో పని చేసే 200 మంది ఆపరేటర్లకు నెలకు రూ. 15 వేలు మాత్రమే చెల్లిస్తున్నది. కానీ తమ అనుయాయులకు బెర్తల వద్ద ఒకే పని చేస్తున్న ఆపరేటర్లకు నెలకు లక్ష రూపాయలు పైగా చెల్లిస్తున్నది. స్థానికులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నది. సమాన పనికి సమాన వేతనం చెల్లించమని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను యాజమాన్యం ఐదు నిమిషాల్లో పరిష్కారం చేయగలరు. కానీ కావాలనే యాజమాన్యం కనీస చర్చలు కూడా జరపలేదు. కార్మికులు సమ్మె చేస్తున్నందువల్ల స్టీల్‌ప్లాంట్‌కు కోకింగ్ కోల్ సరఫరా చేయలేక పోతున్నామని నాటకాలాడుతున్నారు. ఇది పచ్చి మోసం. ఆంధ్ర రాష్ట్రంలోని పరిశ్రమలకు మణిహారంగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌కు అప్పగించాలనే కుట్రలో భాగమే. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూటికి నూరు శాతం అమ్మాలని 40 మాసాల క్రితం కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయినా ఒక్క శాతం కూడా వాటాలు అమ్మకుండా స్టీల్‌ప్లాంట్ పోరాట కమిటి అడ్డుపడింది. అందుకని కొత్త ఎత్తుగడతో స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బ కొట్టడానికి కేంద్ర ప్రభుత్వం, అదానీ, మోడీ కలసి ఎన్నికల సమయాన్ని ఎంచుకున్నారు. ఈ సమయంలో నాయకులంతా ఎన్నికల్లో బిజీగా ఉంటారు. అదే సమయంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోకుండా అదానీ ఆపుతున్నారు. ఇంత వరకు ఈ తీవ్రమైన సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు జోక్యం చేసుకోలేదు? విశాఖ స్టీల్‌లో బయోమెట్రిక్ పద్ధతిని అమలు చేయాలని గత నెల రోజుల నుండి ప్రతిరోజూ ఢిల్లీ నుంచి స్టీల్ శాఖ కింది స్థాయి అధికారుల వరకు డాష్ బోర్డులో ఒత్తిడి చేశారు. కానీ ఎంతో ముఖ్యమైన ముడిసరుకు సమస్యను ఎందుకు పట్టించుకోలేదు? కేంద్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా మోడీకి అతి సన్నిహితంగా ఉండే అదానీతో మాట్లాడి గంగవరం పోర్టు కార్మిక సమస్యను పరిష్కరించవచ్చు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఇనుప ఖనిజం, కోకింగ్ కోల్, కోల్, సున్నపు రాయితో సహా వివిధ ఖనిజాలను కనీసం నెల రోజుల ముందే స్టాక్ ఉంటుంది. స్టాక్ యార్డులు ఆ విధంగా డిజైన్ చేయబడ్డాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ మూడు నెలల ముందే డబ్బులు చెల్లించి కోకింగ్ కోల్ దిగుమతి చేసుకుంటారు. ఆస్ట్రేలియాలోని కంపెనీలకు ముందే డబ్బులు చెల్లించి 40 రోజుల షిప్ ప్రయాణంతో గంగవరం పోర్టుకు 5 రోజుల క్రితమే కోకింగ్ కోల్ వచ్చింది. స్టీల్‌ప్లాంట్ గంగవరం పోర్టు వద్ద గోడ మాత్రమే అడ్డం. అయినా గోడ ఇవతల ఉన్న స్టీల్‌ప్లాంట్‌కు రాకుండా అదానీ కంపెనీ అడ్డుపడుతున్నది. కావాలనే గంగవరం పోర్టులో సమస్య సృష్టించి కార్మికులను రోడ్డు పైకి నెట్టింది. కార్మికులు సమ్మెలో ఉన్నందు వల్ల కోకింగ్ కోల్ సరఫరా చేయలేకపోతున్నామని గంగవరం పోర్టు యాజమాన్యం జిల్లా అధికారుల వద్ద అబద్దాలు ఆడుతున్నారు.

దేశంలోనే భారీ పరిశ్రమల రక్షణ కోసం జరిగిన పోరాటాల్లో విశాఖ స్టీల్ పోరాటం అత్యున్నతమైంది. ఈ పోరాటంలో బి.జె.పి. మినహా అన్ని రాజకీయ పార్టీలను ఒకే వేదిక పైకి తెచ్చారు. బియంఎస్‌తో సహా అఖిల భారత ట్రేడ్ యూనియన్ నాయకులంతా వచ్చి విశాఖ స్టీల్ పోరాటానికి మద్దతునిచ్చారు. దేశంలోనే 550 రైతు సంఘాలతో ఏర్పడిన కిసాన్ సంయుక్త మోర్చా ఆలిండియా నాయకులు రాకేష్ తికాయత్, అశోక్ ధావలే, వడ్డే శోభనాద్రీశ్వర రావుతో సహా పాల్గొని విశాఖ బీచ్‌లో భారీ సభ నిర్వహించారు. విశాఖ స్టీల్ కార్మికులు జరిపిన మూడు సమ్మెలకు మద్దతుగా రాష్ట్ర వ్యాపితంగా రాస్తారోకోలు, బంద్‌లు జరిగాయి. 10 వేల మందితో 10 కి.మీ మానవహారం ఈ పోరాటంలో ఒక మైలురాయి. రాష్ట్ర వ్యాపితంగా అనేక సంస్థల నాయకులు, మహిళలు, విద్యార్థి, యువజనులతో సహా అన్ని రంగాల ప్రజలు ఈ ఉద్యమంలో మమేకమయ్యారు. ఇది ప్రజల ఉద్యమం. అందుకే బి.జె.పి. నాయకత్వం ఈ ప్రజా ఉద్యమాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. నేడు దొడ్డి దారిలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మూయించాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నది. దీనికి నిరసనగా ఏప్రిల్ 21న జరిగే 'విశాఖ స్టీల్ గర్జన'కు ప్రజలు మద్దతునివ్వాలని కోరుతున్నాము.

/వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూటికి నూరు శాతం అమ్మాలని 40 మాసాల క్రితం కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయినా ఒక్క శాతం కూడా వాటాలు అమ్మకుండా స్టీల్‌ప్లాంట్ పోరాట కమిటి అడ్డుపడింది. అందుకని కొత్త ఎత్తుగడతో స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బ కొట్టడానికి కేంద్ర ప్రభుత్వం అదానీ, మోడీ కలసి ఎన్నికల సమయాన్ని ఎంచుకున్నారు. ఈ సమయంలో నాయకులంతా ఎన్నికల్లో బిజీగా ఉంటారు. అదే సమయంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోకుండా అదానీ ఆపుతున్నారు. ఇంత వరకు ఈ తీవ్రమైన సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు జోక్యం చేసుకోలేదు?



జనవాక్యం

మితిమీరిన వేగం అనర్థం

ఈ మధ్య కాలంలో యువత బైక్ లపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ అనేక ప్రమాదాలకు కేంద్రబిందువుగా నిలుస్తుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. ఉడుకు రక్తం నరనరాన ఉప్పొంగే యువత అతివేగంగా బైక్ నడపడం ఎంత ప్రమాదకరమో, ఒక్కొక్కసారి అది తమ ప్రాణాల మీదకు తెస్తుందనే విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. ముఖ్యంగా, అతివేగం అనర్థదాయకం వంటి బోర్డులను రాష్ట్ర రవాణా శాఖ వారు ఎన్ని పెట్టినా వాటిని పెడచెవిన పెడుతూ యువత అత్యంత వాయు వేగంతో తమ మోటార్ బైక్‌లను దౌడు తీయిస్తున్నారు. పైగా ఒకే బైక్‌పై ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ముగ్గురు ప్రయాణం చేస్తూ తమ ఇష్టం వచ్చిన రీతిలో సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. అటు వారి ప్రాణాలను ప్రమాదపు అంచుల్లోకి తీసుకుపోవడమే గాక ఇటు రోడ్డు మీద నడిచే పాదచారులను, వాహనాలపై ప్రయాణించే ఇతర వాహనదారుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టి వేస్తుండటం శోచనీయం. పోలీసు శాఖ వారు ఎంతో నిఘా పెట్టి ఈ యువత వేగానికి చెక్ పెట్టేలా వారి నుంచి జరిమానాలు వసూలు చేస్తున్నా వారిపై క్రమశిక్షణ చర్యలు ఎన్ని తీసుకుంటున్నా పరిస్థితిలో పెద్దగా మార్పు కానరావడం లేదు. అదేవిధంగా యువత తల్లిదండ్రులు సైతం తమ వంతుగా బైక్‌లపై వేగంగా వెళ్లడం వల్ల ఎన్నో అనర్థాలు వున్నాయి అని పదే పదే హెచ్చరిస్తున్నప్పటికి బేఖాతర్ చేస్తున్నారు. ఇలా అనేక ప్రమాదాలను కొని తెచ్చుకుంటూ తల్లిదండ్రులకు తీవ్ర ఆవేదనను, ఎనలేని గర్భ శోకాన్ని మిగుల్చుతున్నారు. ఏదిఏమైనా ఈ మితిమీరిన వేగం అనే అత్యంత అనారోగ్యపు అలవాటుకు పాదాక్రాంతం, బానిస అవ్వడమే గాక, వేగంగా వెళ్లడం అనేది ఒక వేలంవెర్రిగా భావిస్తున్న యువత వారి జీవితాలను వారే సర్వనాశనం చేసుకుంటున్నారు. ఏమైనా ప్రతి ఏడాది దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ఏదో ఒక సందర్భంలో వేలాది మంది యువత ఈ అదుపు తప్పిన వేగం కారణంగా తమ విలువైన ప్రాణాలను మృత్యుకూపంలోకి నెట్టి వేసుకుంటుండటం అత్యంత దిగ్భ్రాంతికరం. ఇప్పటికైనా యువత తాము అంతకు తాముగా వివేకంతో వ్యవహరించి తమ వేగానికి ముకుతాడు వేయాలి. అది వారికి, ఈ సమాజానికి ఎంతో ఆరోగ్యకరం. కాబట్టి 'నేటి యువత రేపటి మన దేశ బంగారు భవిష్యత్తుకు ఆశాకిరణాలు' అనే అత్యంత ప్రధానమైన విషయాన్ని గుర్తు పెట్టుకొని మసలుకోవాలి. దానివల్ల అటు వారికి, వారిని నమ్ముకున్న తల్లిదండ్రులకు, ఇటు దేశానికి ఎంతో మేలు చేసిన వారవుతారు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, బేతంచెర్ల, నంద్యాల జిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

ఐఐటి బాంబేలో చదివినా.. నో ప్లేస్‌మెంట్

- 36 శాతం మంది గ్రాడ్యుయేట్ల దుస్థితి
- ఆర్థిక మాంద్యమే కారణమంటున్న అర్థికవేత్తలు



న్యూఢిల్లీ : దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐఐటి బాంబేలో గ్రాడ్యుయేట్ పట్టాలు పొందిన విద్యార్థుల్లో కనీసం 36 శాతం మందికి ఉద్యోగాలు రాలేదని గ్లోబల్ ఐఐటి పూర్వ విద్యార్థుల సపోర్ట్ గ్రూప్ వెల్లడించిన డేటాలో తెలిసింది. ఐఐటి కాన్పూర్ విద్యార్థి ధీరజ్ సింగ్ ఈ గ్రూపును నిర్వహిస్తున్నారు. మొత్తంగా ఈ ఏడాది రెండు వేల మంది గ్రాడ్యుయేట్లు కాగా, వారిలో 712 మంది విద్యార్థులు 2024 సంవత్సరానికి ప్లేస్‌మెంట్ సెల్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. డిసెంబరులో ఈ ప్లేస్‌మెంట్ సీజను ప్రారంభమవుతుంది. ఇది మేలో ముగుస్తుంది.

ఈ గ్రూపు అందించిన డేటా ప్రకారం, 2023లో 2209 మంది రిజిస్టర్డ్ విద్యార్థులు వుండగా 1485 మందికి ప్లేస్‌మెంట్ వచ్చింది. అంటే 32.8 శాతం మంది గత సీజనులో ఎలాంటి ప్లేస్‌మెంట్ లేకుండా వుండిపోయారు. ఇంత ప్రతిష్టాత్మక విద్యా సంస్థలో చదివి కూడా కేంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాలు తక్కువ మందికే రావడం పట్ల ఆ గ్రూపు ఆందోళన వ్యక్తం చేసింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కంపెనీలను కేంపస్‌కు ఆహ్వానించడానికి పెద్ద పోరాటాలు చేయాల్సి వస్తోందని ఐఐటి-బాంబే ప్లేస్‌మెంట్ సెల్ అధికారి ఒకరు హిందూస్తాన్ టైమ్స్‌కు తెలిపారు. అంతర్జాతీయంగా ఆర్థిక మాంద్యం పరిస్థితులు నెలకొనడమే ఇందుకు కారణమన్నారు. ఒకవేళ కేంపస్‌కు వచ్చినా సంస్థ ముందుగా నిర్ణయించిన వేతన ప్యాకేజీలను ఆమోదించడానికి చాలా కంపెనీలు ఇష్టపడడం లేదన్నారు. అనేక దఫాలుగా చర్చలు జరిపితేనే గానీ ఒక అంగీకారానికి రావడం కూడా కష్టమవుతోందన్నారు.

సాధారణంగా అంతర్జాతీయ కంపెనీలు ఎక్కువగా ఐఐటిలకు వెళుతుంటాయి. ఈసారి ఐఐటి బాంబేకు కూడా దేశీయ కంపెనీలు మాత్రమే వెళ్ళాయి. ఐఐటి ఢిల్లీ, ఐఐటి కాన్పూర్‌ల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈఏడాది ఫిబ్రవరి 28వరకు ఐఐటి ఢిల్లీలో ప్లేస్‌మెంట్ అయిన విద్యార్థుల సంఖ్య 1036గా వుందని ఆర్‌టిఐ సమాధానం ద్వారా వెల్లడైంది. కేంపస్ రిక్రూట్‌మెంట్‌కు ఎంతమంది నమోదు చేసుకున్నారనే వివరాలు వెల్లడించలేదు. ఐఐటి కాన్పూర్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. 2024లో 69శాతం మందికి ప్లేస్‌మెంట్ రావచ్చని అంచనా వేశారు. 2023, 2022 సంవత్సరాల్లో వరుసగా 91, 90శాతంగా ఈ ప్లేస్‌మెంట్‌లు వున్నాయి. కార్మిక విభాగ ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా టెలిగ్రాఫ్‌తో మాట్లాడుతూ ఐఐటిల్లో కేంపస్ రిక్రూట్‌మెంట్‌లు మందగించడానికి కారణాలు వక్రీకరించబడిన అభివృద్ధి, చిన్న కంపెనీలను పణంగా పెట్టి పెద్ద కంపెనీలు అభివృద్ధి చెందడమని పేర్కొన్నారు.

గత పదేళ్ళలో దేశంలో విద్యావంతుల్లో నిరుద్యోగిత రేటు బాగా పడిపోయిందని చెప్పారు. అయితే గ్రాడ్యుయేట్ల విషయానికి వస్తే, గత దశాబ్ద కాలంలో నిరుద్యోగరేటు 19.2 శాతం నుండి 35.8 శాతానికి పెరిగిందన్నారు. పోస్టు గ్రాడ్యుయేట్ల విషయంలో కూడా ఇది 21.3 శాతం నుండి 36.2 శాతానికి పెరిగిందన్నారు.

భారత్‌పై ఇటీవల అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) అందచేసిన నివేదిక ప్రకారం, దేశంలో దాదాపు 82 శాతం మంది అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్నారు. దాదాపు 90 శాతం మంది చిన్నా చితకా ఉద్యోగాలే చేస్తున్నారు. సంఘటిత రంగంలో కూడా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు అనియత రంగంలోనే వున్నారని 2019, 2022 మధ్య ఈ ధోరణి బాగా పెరిగిందని ఐఎల్‌ఓ పేర్కొంది.

ప్రజాస్వామ్య ఫలాలు అందుకోలేకపోతున్న భారత్

- ఉద్యోగ కల్పన లేకపోవడమే కారణం
- ఉద్యోగావకాశాలున్న రంగాల్లోనూ ఉపాధి కరువు
- విదేశాలకు వలస బాట పడుతున్న యువత
- రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ ఆందోళన



వాషింగ్టన్ : ప్రజాస్వామ్య ఫలితాల ప్రయోజనాలను భారత్ అందిపుచ్చుకోలేకపోతోందని రిజర్వ్‌బ్యాంక్ (ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. మానవ పెట్టుబడిని పెంచాల్సిన అవసరం ఉన్నదని, వారి నైపుణ్యాలను కూడా మెరుగుపరచాలని ఆయన సూచించారు. 'ప్రజాస్వామ్య ఫలాలను పొందే మార్గంలో మనం సగం దూరం ప్రయాణించాం. అయితే ఆ ప్రయోజనాలను అందిపుచ్చుకోలేకపోవడమే సమస్యగా మారింది' అని చెప్పారు. జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన సదస్సులో రఘురామ్ రాజన్ ప్రసంగించారు. ప్రజాస్వామ్య ఫలాలు అందకపోవడానికి యువతకు ఉద్యోగాలు కల్పించలేకపోవడమే కారణమని ఆయన చెప్పారు. ఉద్యోగాల సంఖ్యను పెంచాలంటే ప్రజల సామర్థ్యాలను మెరుగుపర చాలని, ఉద్యోగాల స్వభావాన్ని మార్చాలని అభిప్రాయపడ్డారు. నిరుద్యోగ యువతకు అప్రెంటిస్‌షిప్ కల్పిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ విలువైనదేనని చెప్పారు. అయితే దీనిని సమర్థవంతంగా అమలు చేయాలంటే చేయాల్సింది ఎంతో ఉందని అన్నారు. మంచి ఉద్యోగాలు చేయడానికి మనకు మరింత మంది విద్యార్థులు అవసరమవుతారని తెలిపారు. ఉద్యోగాల కల్పనపై మరింతగా దృష్టి సారించాలని కోరారు.

ఉపాధి రంగాలపై చిన్నచూపు

చిప్ తయారీపై భారత్ పెద్ద ఎత్తున ఖర్చు చేయడాన్ని రఘురామ్ రాజన్ తప్పు పట్టారు. 'ఈ చిప్ ఫ్యాక్టరీలను గురించి ఆలోచించండి. చిప్ తయారీ కోసం అనేక బిలియన్ డాలర్ల సొమ్మును సబ్సిడీగా అందజేస్తున్నారు' అని చెప్పారు. తోలు పరిశ్రమ వంటి ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉన్న రంగాల పనితీరు సంతృప్తికరంగా లేదని అన్నారు. 'ఆయా రంగాలలో మనం సరిగా పనిచేయడం లేదు. ఉద్యోగాల సమస్య పెరిగితే ఆశ్చర్యపడాల్సిన అవసరమే లేదు. ఉద్యోగ సమస్య అనేది గత పది సంవత్సరాలలో వచ్చింది కాదు. గత కొన్ని దశాబ్దాలుగా అది పెరుగుతూ వస్తోంది. అయితే ఉద్యోగావకాశాలు అధికంగా ఉన్న రంగాలను మనం నిర్లక్ష్యం చేస్తున్నాము. తప్పు ఎక్కడ జరుగుతోందో తెలుసుకొని దానిని సరిచేసుకోవాల్సిన అవసరం ఉంది' అని అభిప్రాయపడ్డారు. దేశంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాల స్థాపన కోసం సింగపూర్, సిలికాన్ వ్యాలీ వెళుతున్నారని, ఎందుకంటే అక్కడి మార్కెట్లలో ప్రవేశం వారికి సులభతరంగా ఉంటోందని చెప్పారు.

యంగ్ ఇండియాది కోహ్లీ మనస్తత్వం

'దేశంలోనే ఉండకుండా బయటకు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో వారిని అడగాలి. అయితే వారు ప్రపంచాన్నే మార్చేయాలని కోరుకోవడం ఆనందదాయకం. మరిన్ని దేశాలలో విస్తరించాలని వారు భావిస్తున్నారు. ఒక యంగ్ ఇండియా ఉన్నదని నేను అనుకుంటున్నాను. దానిది విరాట్ కోహ్లీ మనస్తత్వం. ప్రపంచంలో రెండో స్థానంలో ఉండడాన్ని వారు ఇష్టపడరు' అని రఘురామ్ రాజన్ అన్నారు.

బిజెపి గూండాల ముఠాలా ఇడి

- సిపిఎం నేత ఎంవి గోవిందన్ విమర్శ



అలపుజ : బిజెపి గూండాల ముఠా తరహాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వ్యవహరిస్తోందని సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ బుధవారం విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె టి వీణా తదితరులను ఇడి వేధింపులకు గురి చేయడంపై స్పందిస్తూ గోవిందన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే 2024 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష గొంతుకలను నొక్కిపెట్టి బిజెపి అనుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు ఇడి ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. 'ఇడి విచారణ చేసి ఎవరినైనా అరెస్టు చేయనివ్వండి. ఇడి అనేది బిజెపి గూండాల ముఠా. ఇది ఎన్ని ప్రయత్నాలు చేసినా బిజెపి ఎన్నికల్లో విజయం సాధించడం లేదు. ఏప్రిల్ 26 తరువాత ఇడి దర్యాప్తు హంగామా ముగుస్తుంది' అని గోవిందన్ అన్నారు.

ఎక్స్‌ను వారంలో పునరుద్ధరించండి

- పాక్ ప్రభుత్వానికి సింధ్ హైకోర్టు ఆదేశాలు

కరాచీ : సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్ (గతంలో ట్విటర్)పై సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని, వారంలోగా దీనిని పునరుద్ధరించాలని పాకిస్తాన్ హోం మంత్రిత్వ శాఖను సింధ్ హైకోర్టు బుధవారం ఆదేశించింది. ఎక్స్‌పై నిషేధానికి వ్యతిరేకంగా దాఖలైన అనేక పిటీషన్లను హైకోర్టు విచారించింది. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అఖీల్ అహ్మద్ అబ్బాసీ 'ఎక్స్‌ను మూసివేయడం ద్వారా మీరు (హోం శాఖ) ఏం సాధించారు? ప్రపంచం మనల్ని చూసి నవ్వుతోంది' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు పంపిన నివేదికలపై చర్యలు తీసుకునే అధికారాన్ని చట్టం హోం శాఖకు ఇవ్వలేదని ఈ సందర్భంగా న్యాయమూర్తి స్పష్టం చేశారు. జాతీయ భద్రతా బెదిరింపులను సాకుగా చూపుతూ పాకిస్థాన్‌లో ఎక్స్‌పై ఫిబ్రవరిలో నిషేధం విధించారు. హోం శాఖ, ఇంటెలిజెన్స్ ఏజెన్సీల నుంచి మార్గదర్శకాల మేరకు ఎక్స్‌పై నిషేధం విధించినట్లు గత నెలలో కోర్టుకు పాకిస్థాన్ టెలికమ్యూనికేషన్స్ అథారిటీ (పిటిఎ) వెల్లడించింది.

క్యూబా సోషలిజానికి 63 ఏళ్లు

సోషలిజమే మా ఊపిరి : క్యూబన్ల ప్రతిజ్ఞ



హవానా : 'మనలో కొన ఊపిరి వున్నంతవరకూ మన జాతీయ పతాకాన్ని కాపాడుకుందాం' పార్టీ కార్యకర్తగా మన మాతృభూమికి, విప్లవానికి అంకితమవుతూ, ప్రజల పట్ల నిబద్ధతతో వుందాం. నిజమైన క్యూబన్ విప్లవ వీరుల మనో నిశ్చయమిదేనని అంతర్జాతీయ యోధుడు, రిజర్వ్ కెప్టెన్ పాస్టర్ కాంటెరో ఎచాజబాల్ వ్యాఖ్యానించారు. క్యూబా విప్లవ లక్షణం సోషలిజమేనని ప్రకటించి 63 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాటి పోరాట యోధులను స్మరించుకుంటూ మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎచాజబాల్ మాట్లాడారు.

1961 ఏప్రిల్ 15న క్యూబా వైమానిక బలగాలపై అమెరికా జరిపిన దాడుల్లో మరణించిన వారి అంత్యక్రియల సందర్భంగా 16వ తేదీన హవానాలోని వదాడో జిల్లాలో జరిగిన కార్యక్రమంలో కమాండర్ ఇన్ చీఫ్ ఫైడెల్ కాస్ట్రో రజ్ చెప్పిన మాటలు నేటికీ ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. 'ఇలాంటి వీరులున్నందువల్లే లాటిన్ అమెరికా ప్రజలు స్వేచ్ఛగా వున్నారు, క్యూబా ప్రస్థానంలో ఇదొక ముఖ్యమైన రోజు' అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల కోసం ప్రజలు చేపట్టిన సామ్యవాద, ప్రజాస్వామ్య విప్లవమిది అని వ్యాఖ్యానించారు.

దేశ అధ్యక్షులు, క్యూబా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ ఫస్ట్ కార్యదర్శి మిగుయెల్ డియాజ్ కానెల్, హవానా ప్రావిన్షియల్ కమిటీ ఫస్ట్ సెక్రటరీ లివాన్ ఇజెక్విర్డో అలోన్సో పాల్గొన్న ఈ సంస్మరణ కార్యక్రమంలో పాస్టర్ కాంటెరో మాట్లాడుతూ, దాడులు జరుగుతున్న ఆనాటి రోజుల్లో కష్టాలు, ఇబ్బందుల మధ్యనే ప్రజలు అత్యున్నత నైతిక విలువలతో ఎదిగారని కొనియాడారు.

హవానా పిసిసి ఫస్ట్ సెక్రటరీ అలోన్సో మాట్లాడుతూ, సామాజిక, ఆర్థికాంశాలకు సంబంధించి విప్లవం క్లిష్టమైన సమయాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో మనం ఈనాడు ఈ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. అత్యంత పవిత్రమైన మన ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి క్రూరంగా, సాంప్రదాయేతర పద్ధతుల్లో యుద్ధం జరుగుతోందన్నారు. చివరగా లాంగ్ లివ్ ఫ్రీ క్యూబా అంటూ క్యూబా అధ్యక్షుని నినాదాలతో సభ ముగిసింది.

తొలి విడత బరిలో కీలక నాయకులు

వీరిలో 8 మంది కేంద్రమంత్రులు

ఇద్దరు మాజీ సిఎంలు, ఒక మాజీ గవర్నర్ కూడా

21 రాష్ట్రాల్లోని 102 లోక్‌సభ స్థానాలకు 19 నుంచి పోలింగ్



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల సమరంలో తొలి విడత ఘట్టానికి కొద్ది గంటల తెర లేవనుంది. ఈ నెల 19న పోలింగ్ జరగనున్న 102 లోక్‌సభ స్థానాలకు సంబంధించి బుధవారంతో ప్రచారానికి తెర పడింది. 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల(యూటీ)లో 102 స్థానాలకు ఈ నెల 19న పోలింగ్ జరగనున్నది. తొలి దశ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్న వారిలో ఎనిమిది మంది కేంద్ర మంత్రులు, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు, ఒక మాజీ గవర్నర్ ఉన్నారు.

వీరిలో బిజెపి అగ్రనాయకులు, కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నాగ్‌పూర్ స్థానం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించాలని చూస్తున్నారు. 2014లో, అతను ఏడుసార్లు ఎంపీగా ఎన్నికైన విలాస్ ముత్తెంవార్‌ను 2.84 లక్షల ఓట్ల తేడాతో ఓడించారు. 2019లో ప్రస్తుత మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలేను 2.16 లక్షల ఓట్లతో ఓడించి సీటును నిలబెట్టుకున్నాడు.

కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అరుణాచల్ పశ్చిమ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన 2004 నుంచి మూడుసార్లు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. రిజిజు ప్రధాన ప్రత్యర్థి మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత అరుణాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు నబమ్ టుకీ కావటం గమనార్హం. దీంతో అక్కడ పోటీ తీవ్రంగానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బనాద సోనోవాల్ అసోంలోని దిబ్రూగఢ్ నుంచి బరిలో ఉన్నారు. కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలికి టిక్కెట్ ఇవ్వకపోవటంతో రాజ్యసభ సభ్యులైన సోనోవాల్‌ను దిబ్రూగఢ్ నుంచి బిజెపి పోటీకి దింపింది.

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ(ఎస్‌పి)కి చెందిన హరేంద్ర మాలిక్, బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అభ్యర్థి దారా సింగ్ ప్రజాపతి, బిజెపి నుంచి కేంద్ర మంత్రి సంజీవ్ బలియన్ బరిలో ఉన్నారు. ఇక్కడ త్రిముఖ పోరు ఉంటుందని విశ్లేషకులు చెప్తున్నారు. దీంతో కేంద్ర మంత్రికి విజయం కష్టమేనని అంటున్నారు. ఇక మోడీ క్యాబినెట్‌లో రెండు పర్యాయాలు పార్లమెంటేరియన్‌గా, జూనియర్ మంత్రిగా పనిచేసిన జితేంద్ర సింగ్ ఉదంపూర్‌లో హ్యాట్రిక్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యులు భూపేంద్ర యాదవ్.. రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా మత్స్య ప్రాంతానికి చెందిన సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లలిత్ యాదవ్‌తో పోటీలో ఉన్నారు. ఇక్కడ యాదవ్ సామాజికవర్గం కీలక పాత్రను పోషించనున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. రాజస్థాన్‌లోని బికనీర్ లోక్‌సభ స్థానం నుంచి కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్.. కాంగ్రెస్ మాజీ మంత్రి గోవింద్ రామ్ మేఘ్వాల్‌తో పోటీ పడనున్నారు.

తమిళనాడులోని నీలగిరి లోక్‌సభ నియోజకవర్గం ప్రస్తుత డిఎంకె ఎంపి, మాజీ టెలికాం మంత్రి ఎ. రాజాపై బిజెపి నుంచి కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ పోటీ చేయనున్నారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన మురుగన్ ఇక్కడి నుంచి పోటీ చేయడం ఇదే తొలిసారి కావటం గమనార్హం.

శివగంగ ఎంపీ కార్తీ చిదంబరం తన తండ్రి ఏడుసార్లు గెలుపొందిన స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. బిజెపి నుంచి టి. దేవనాథన్ యాదవ్, ఏఐఏడీఎంకే నుంచి జేవియర్ దాస్‌లు బరిలో ఉన్నారు. తమిళనాడు బిజెపి అధ్యక్షులు కె. అన్నామలై ఆ రాష్ట్రంలోని కోయంబత్తూర్ నుంచి పోటీ చేస్తున్నారు. అలాగే, అక్కడి నుంచి డీఎంకే నాయకుడు గణపతి పి. రాజ్‌కుమార్, ఎఐఎడిఎంకెకు చెందిన సింగై రామచంద్రన్‌తో అన్నామలై పోటీ పడనున్నారు.

ఇక క్రియాశీల రాజకీయాల్లోకి రావటానికి ఇటీవల తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి రాజీనామా చేసిన తమిళిసై సౌందరరాజన్.. బిజెపి నుంచి చెన్నై సౌత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కుమార్తె, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోదరి అయిన కనిమొళిపై 2019 ఎన్నికల్లో తూత్తుకుడి నుంచి పోటీ చేసిన సౌందరరాజన్.. భారీ ఓట్ల తేడాతో ఓడిపోయారు. కాగా, కనిమొళి.. తూత్తుకుడి స్థానం నుంచి తిరిగి విజయం సాధించాలని చూస్తున్నారు. ఇక ఆమెపై ఎన్డీయే మిత్రపక్షమైన తమిళ మానిల కాంగ్రెస్ (మూపనార్) ఎస్.డి.ఆర్ విజయశీలన్‌ను, ఏఐఏడీఎంకే ఆర్. శివసామి వేలుమణిని పోటీకి దింపాయి.

కాంగ్రెస్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్ నాథ్ కుమారుడు నకుల్ నాథ్.. ఛింద్వారా నుంచి మళ్లీ ఎన్నిక కావటానికి ప్రణాళికలు రచిస్తున్నారు. 1980 నుంచి తొమ్మిది సార్లు ఈ సీటును గెలుచుకున్న కమల్ నాథ్.. ఈ సారి కూడా తన కుమారుడిని గెలిపించేదుకు కృషి చేస్తున్నారు. 2019 ఎన్నికలలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని 29 స్థానాలకు గాను 28 స్థానాలను బిజెపి కైవసం చేసుకున్నది. అయితే చింద్వారా నుంచి నకుల్ మాత్రం 37,536 తేడాతో బిజెపి అభ్యర్థిని ఓడించాడు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు చెందిన ఏకైక ఎంపీగా ఉన్నారు.

త్రిపురలోని ఉన్న రెండు లోక్‌సభ నియోజకవర్గాలలో.. పశ్చిమ త్రిపుర స్థానానికి మాజీ ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్ బిజెపి నుంచి బరిలో ఉన్నారు. ఆయనపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు ఆశిష్ కుమార్ సాహా పోటీ చేయనున్నారు. ఇక్కడ పోటీ చాలా గట్టిగా ఉండనున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

అసోంలోని కలియాబోర్ ఎంపీగా 2014 నుంచి రెండుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన, లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ కుమారుడు గౌరవ్ గొగోయ్.. ఈ సారి పొరుగున ఉన్న జోర్హాట్‌లో పోటీ చేయనున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి చెందిన టోపోన్ కుమార్ గొగోయ్ ఇక్కడి నుంచి విజయం సాధించారు. మణిపూర్ న్యాయ, విద్యా శాఖ మంత్రి బసంత కుమార్ సింగ్ ఇన్నర్ మణిపూర్ నియోజకవర్గానికి బిజెపి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఆయనపై జేఎన్‌యూ ప్రొఫెసర్, కాంగ్రెస్ అభ్యర్థి బిమల్ అకోయిజామ్ పోటీ చేయనున్నారు. మెయిటీ కమ్యూనిటీకి చెందిన బసంత్ కుమార్ సింగ్.. అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేసిన తౌనోజం చావోబా సింగ్ కుమారుడు.

ఉత్తర రాజస్థాన్‌లోని బిజెపికి పట్టు ఉన్న స్థానం చురు నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా దేవేంద్ర ఝఝరియా(రెండుసార్లు పారాలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ జావెలిన్ త్రోయర్), కాంగ్రెస్ నుంచి రాహుల్ కస్వాన్‌లు బరిలో ఉన్నారు. వీరిద్దరి మధ్య బలమైన పోటీ ఉండనున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. కాగా, పార్టీ టికెట్ నిరాకరించటంతో రాహుల్ కస్వాన్ మార్చిలో రెండుసార్లు బిజెపిని వీడారు. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి బరిలో నిలుస్తున్నారు.

కాగా, 18వ లోక్‌సభకు ఎన్నికయ్యే 543 స్థానాలకు గానూ మొత్తం ఏడు దశల్లో పోలింగ్ జరగనున్నది. 19 నుంచి మొదటి దశ ప్రారంభం కానున్నది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగి అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది.

ఆయన అవినీతికి ఛాంపియన్

- మోడీపై రాహుల్ ఆగ్రహం
- ప్రపంచంలోనే అతి పెద్ద దోపిడీ స్కీమ్ బాండ్ల పథకం
- బిజెపి స్కోరు 150 దాటదు



ఘజియాబాద్ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల పథకం ప్రపంచంలోనే అతి పెద్ద దోపిడీ స్కీమ్ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధాని మోడీని అవినీతికి ఛాంపియన్‌గా ఆయన అభివర్ణించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా కౌశంబీలో ఆయన బుధవారం సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో కలిసి పాత్రికేయులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమికి అనుకూలంగా బలమైన గాలులు వీస్తున్నాయని, బిజెపి 150 సీట్లకే పరిమితం అవుతుందని రాహుల్ చెప్పారు.

ఎన్నికల నిధులలో పారదర్శకత కోసమే బాండ్ల పథకాన్ని తీసుకొచ్చామని ప్రధాని చెబుతున్నారని అంటూ అలాంటప్పుడు దానిని సుప్రీంకోర్టు ఎందుకు కొట్టివేసిందని రాహుల్ ప్రశ్నించారు. 'ఎన్నికల బాండ్ల పథకం ప్రపంచంలోనే అతి పెద్ద దోపిడీ పథకం. ఆ విషయం మన దేశంలో వ్యాపారులకు బాగా తెలుసు. ప్రధాని ఎంతగా వివరణ ఇస్తున్నప్పటికీ దాని ప్రభావమేమీ ఉండదు. ఎందుకంటే అవినీతికి ప్రధాని ఛాంపియన్ అనే విషయం దేశానికంతా తెలుసు' అని అన్నారు. కాలపరిమితితో నిమిత్తం లేకుండా పేదరికాన్ని కాంగ్రెస్ నిర్మూలిస్తుందంటూ తాను చేసిన వ్యాఖ్యలను మోడీ విమర్శించడాన్ని రాహుల్ ప్రస్తావించారు. పేదరికం అనేది ఒక్కసారిగా పోయేది కాదని, అయితే అందుకోసం తాము బలమైన ప్రయత్నాలు చేస్తామని చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లో అమేథీ నుండి పోటీ చేయడంపై అడిగిన ప్రశ్నకు రాహుల్ సమాధానమిస్తూ ఈ విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. అలాంటి నిర్ణయాలను పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ తీసుకుంటుందని అన్నారు. కాగా పశ్చిమ యూపీలోని ఘజియాబాద్ నుండి ఘాజీపూర్ వరకూ రాజకీయ పవనాలలో మార్పు కన్పిస్తోందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి ఘనంగా వీడ్కోలు పలుకుతామని అఖిలేష్ తెలిపారు. ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా చీలకుండా ప్రయత్నిస్తామని అన్నారు.



మోడీ సర్కార్ అన్నింటా విఫలం

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణన్

చెన్నై : కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అన్నింటా ఘోరంగా విఫలమైందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణన్ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో చెన్నై సెంట్రల్ స్థానం నుంచి పోటీ చేస్తున్న డిఎంకె అభ్యర్థి దయానిధి మారన్‌కు మద్దతుగా బుధవారం ధర్మపురం కాలనీలో ఇంటింటి ప్రచారంలో జి రామకృష్ణన్ పాల్గొన్నారు. గత ఎన్నికల్లో మోడీ ప్రతీ ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారని, నాణ్యమైన విద్య, ధరల తగ్గింపు వంటి అనేక హామీలు ఇచ్చారని రామకృష్ణన్ గుర్తు చేశారు. మోడీ హామీ ప్రకారం గత ఐదేళ్లల్లో 20 కోట్ల ఉద్యోగాలు కల్పించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ఆరు కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారని విమర్శించారు. అలాగే నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవడానికి ఎన్నికల బాండ్లను బిజెపి నాయకులు వినియోగించుకున్నారని విమర్శించారు. ఇంటింటి ప్రచారంలో అభ్యర్థి మారన్, సిపిఎం, కాంగ్రెస్, విసెకె కార్యకర్తలు, మద్దతుదారులు పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో 12 వీధుల్లోని సుమారు 1,500 కంటే ఎక్కువ ఇళ్లల్లో ప్రచారం నిర్వహించారు.

రైతాంగ సమస్యలపై బిజెపి మౌనం

- కిసాన్ సభ తీవ్ర విమర్శలు

న్యూఢిల్లీ : దేశ రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రస్తావించడంలో బిజెపి 2024 ఎన్నికల మేనిఫెస్టో విఫలమైందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) విమర్శించింది. రైతులను, వ్యవసాయ కార్మికుల ఊసెత్తకుండా బిజెపి అవమానించిందని ఎఐకెఎస్ పేర్కొంది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) అమలు, పంట సేకరణ, రైతు ఆత్మహత్యలు, రుణమాఫీ వంటి కీలకమైన అంశాలను మేనిఫెస్టో 2024లో ప్రస్తావించలేదని పేర్కొంది. నిజానికి 2014, 2019 మేనిఫెస్టోల్లో చేసిన పాత వాగ్దానాలనే తాజా మేనిఫెస్టోలో బిజెపి చేసిందని, అంటే పాత హామీలను అమలు చేయలేదని బిజెపి స్పష్టంగా అంగీకరించినట్లుయిందని ఎఐకెఎస్ తెలిపింది. దేశంలో తీవ్రంగా ఉన్న వ్యవసాయ సంక్షోభం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి బిజెపి పడరాని పాట్లు పడిందని ఎఐకెఎస్ విమర్శించింది. ఎప్పటికప్పుడు ఎంఎస్‌పిని పెంచుతామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చినా.. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వ్యవసాయ వ్యయాలను బిజెపి పరిగణనలోకి తీసుకోలేదని ఎఐకెఎస్ తప్పుబట్టింది. 2014 నుంచి 2022 వరకూ 1,00,474 మంది అన్నదాతలు, 3,12,214 మంది రోజువారీ వేతన కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, అయినా వీరి కుటుంబాలకు 2014 మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ఎలాంటి రుణ మాఫీ కానీ, ఆర్థిక సాయం కానీ చేయలేదని ఎఐకెఎస్ విమర్శించింది.



తేరుకుంటున్న దుబాయ్

దుబాయ్ : మేఘ మథనం చేస్తే కానీ వర్షాలు కురవని దుబాయ్ భారీ వర్షాలతో ఉక్కిరిబిక్కిరయింది. రెండు రోజుల పాటు భారీ వర్షాలతో నివాస ప్రాంతాలు, రహదారులు, ప్రయాణ ప్రాంగణాలు జలాశయాలను తలపించాయి. మోకాలు లోతు నీటితో ప్రజలు అవస్థలు పడ్డారు. అనేక విమాన సర్వీసులు, ఇతర ప్రయాణ వాహన సర్వీసులను రద్దు చేయాల్సివచ్చింది. సోమ, మంగళవారాల్లో కురిసిన భారీ వర్షాలకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) వరదనీటిలో చిక్కుకుంది. మంగళవారం రాత్రి నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బుధవారం నుంచి సహాయక చర్యలు, శిథిలాల తొలగింపు వంటి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నెమ్మదిగా తేరుకుంటోంది. మంగళవారం వర్షాల్లో వాహనం చిక్కుకుని ఒక వ్యక్తి మృతి చెందగా, ఇళ్లు, వ్యాపారాలు దారుణంగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలను తట్టుకునే డ్రైనేజీ సదుపాయాలు తక్కువగా ఉండటంతో చిన్నపాటి వర్షాలకే రోడ్లు మునిగిపోతుంటాయి. ఇక మంగళవారం రికార్డు స్థాయి వర్షాలకు రహదారులు భారీ నదులను తలపించాయి. రోడ్డు రవాణాతో పాటు విమాన సర్వీసులకు కూడా అంతరాయం ఏర్పడింది. సర్వీసులు రద్దు కావడంతో వందలాది మంది ప్రయాణీకులు విమానాశ్రయాల్లోనే ఇబ్బందులు పడుతున్నారు.

ఏడాదిన్నరలో కురవాల్సిన వాన కొన్ని గంటల్లోనే కురిసిందని యుఎఇ జాతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. యుఎఇ-ఒమన్ సరిహద్దులో ఉన్న అల్ ఐన్ అనే నగరంలో 24 గంటల్లోపే 254 మీమీ (10 అంగుళాలు) వర్షపాతం నమోదైంది. 1949లో రికార్డుల నమోదైనప్పటి నుంచి ఇదే అత్యధిక వర్షపాతం. వాతావరణ మార్పుల కారణంగా పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతల కారణంగానే యుఎఇ వంటి ఎడారి దేశాల్లో భారీ వర్షాలు వంటి వాతావరణ సంఘటనలకు దారి తీస్తున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. యుఎఇకి సమీప దేశమైన ఒమన్‌లో భారీ వర్షాలు ముంచెత్తాయి. మూడు రోజుల పాటు కురిసిన ఈ వర్షాల్లో 19 మంది మరణించారు.




మీ కోసం

బట్టలపై పడిన ఇంకు మరకలను నిమ్మరసం లేదా టూత్‌పేస్ట్‌తో రుద్దితే పోతాయి.

జీవన సౌరభం

ధైర్యంగా వేసే ప్రతి అడుగులోనూ భయపెట్టే విమర్శలే వస్తుంటాయి. వింటూ ఆగిపోవడమా లేక వినకుండా సాగిపోవడమా అనేది మన అడుగుల్లోనే ఉంటుంది.

బుజ్జిబాబు అలక



'ఇక ఈరోజుకి కోచింగ్ ఆపి భోజనానికి రండి' అంటూ డైనింగ్ టేబిల్ మీద అన్నీ సర్దుతూ పిలిచింది సరోజ. కోచింగ్ అంటే ఐఐటి, నీట్ లాంటివేమీ కాదు. ప్రముఖ ఇంటర్నేషనల్ స్కూల్లో తమ ఏకైక కుమారుడు బుజ్జిబాబుకు ఎల్కేజీలో ఎడ్మిషన్ కోసం రమేష్, సరోజ దంపతులు ఇంటి దగ్గరే కోచింగ్ ఇస్తున్నారు.

అమ్మ భోజనానికి ఎప్పుడు పిలుస్తుందా! అని ఎదురుచూస్తున్న బుజ్జి పరుగున వచ్చాడు. వాడి వేగం చూసి, 'మనవాడు పెద్ద తిండిబోతు అయ్యేలా ఉన్నాడు. నువ్వు పిలవగానే ఎక్కడివి, అక్కడ వదిలేసి వచ్చేసాడు' అన్నాడు రమేష్. ఇంతలో డైనింగ్ టేబిల్ మీద ఉన్న కోడి గుడ్ల కూర చూసి బుజ్జిబాబుకు కోపం, ఏడుపు ఒకేసారి వచ్చాయి. 'నాకు ఈ కూర వద్దు. నేను ఈరోజు భోజనం చెయ్యను' అన్నాడు కొంచెం గారాంగా.

'నీ కోచింగ్ వల్ల నాన్న గారు బజారుకు వెళ్లలేదు. వచ్చే ఆదివారం చికెనో, మటనో కొంటారులే. పేచీ పెట్టకుండా తినమ్మా' అంది సరోజ.

'నాకు ఏ చికెనూ, మటనూ వద్దు. పెద్ద గుడ్డు కావాలి' అన్నాడు బుజ్జి.

'ఈ కూరలో ఏ గుడ్డు పెద్దదో అదే తీసుకో' అంది సరోజ.

'ఇవి ఏవీ వద్దు. నాకు ఇంకా పెద్ద గుడ్డు కావాలి' అన్నాడు బుజ్జి ఇంకాస్త స్వరం పెంచి. 'సరే మూడు గుడ్లూ నువ్వే తిను' అన్నాడు ఒకింత అసహనంగా రమేష్. 'నాకేమీ వద్దు. పెద్ద గుడ్డు అయితేనే తింటాను' అంటూ మొండికేసిన బుజ్జికి వీపు మీద ఒక దెబ్బ వేసింది సరోజ.

అంతే! ఇల్లు ఎగిరి పోయేంత శబ్ధంతో బుజ్జి ఏడుపు లంకించుకున్నాడు. ఆ ఏడుపు విన్న పక్కింటి పద్మ, 'ఎందుకు వదినా అలా కొట్టావు. ఇదిగో బుజ్జి నీకు చికెన్ కర్రి తెచ్చాను.. తినమ్మా' అని చికెన్ కూరను బుజ్జి పక్కనే పెట్టింది. 'నాకు ఇదీ వద్దు' అని పద్మ తెచ్చిన గిన్నె పక్కకు తోసేసాడు బుజ్జి.

'మరింకేం కావాల్రా గాడిదా' కోపంగా అరిచాడు రమేష్.

'అదే నాన్న అమ్మ చెప్పింది కదా! ఆ గాడిద గుడ్డు కావాలి' అని ఏడుస్తూ చెప్పాడు బుజ్జి. బుజ్జి కోరికకు నిర్ఘాంతపోయాడు రమేష్. బుజ్జి అలకకు కారణం తెలిసిన సరోజ, పద్మ నవ్వుకున్నారు.

ఉదయం వీధిలో గాడిద పాలు అమ్ముతున్న వ్యక్తితో సరోజ, పద్మ మాట్లాడుతుంటే– 'ఏం కొంటున్నావమ్మా' అని బుజ్జి వచ్చి అడిగాడు. కోచింగ్ మధ్యలో వచ్చాడనే కోపంతో 'గాడిద గుడ్డు' అంది సరోజ. 'భలేభలే.. నాకు ఈరోజు అదే వండిపెట్టు' అని ఇంట్లోకి తుర్రుమన్నాడు బుజ్జి. అది గుర్తుకొచ్చి సరోజ, పద్మ నవ్వుతుంటే వారెందుకు నవ్వుతున్నారో తెలియక తెల్లమొహం వేశాడు రమేష్. విషయం తెలుసుకున్న రమేష్, బుజ్జికి అర్థమయ్యేలా గాడిదలు గుడ్డు పెట్టవని చెప్పాడు.

'జంతువులు ఏవీ గుడ్లు పెట్టవు. పిల్లల్ని కంటాయి. పక్షులు మాత్రమే గుడ్లు పెడతాయి' అని చెప్పినా, తేడా తెలియక తెల్లమొహం వేశాడు బుజ్జి. 'బయటకు చెవులు కనిపించేవి అన్నీ పిల్లల్ని కంటాయి. చెవులు కనిపించనివి గుడ్లు పెడతాయి' అని బుజ్జి వయసుకు అర్థమయ్యేలా చెప్పాడు రమేష్. 'ఇప్పుడు తెలిసింది నాన్న గారు. గాడిద చెవులు బయట ఉంటాయి గనుక గుడ్డు పెట్టదు. కోడి చెవులు బయటకు ఉండవు గనుక గుడ్డు పెడుతోంది. ఇప్పుడు నేను కోడిగుడ్డు కూరతో భోజనం చేస్తాను' అని భోజనం ప్లేటు ముందుకు తీసుకున్నాడు బుజ్జి.

- దంతులూరి వర్మ,
94928 16754.

నేను గీసిన బొమ్మ





తాటిపర్తి సాహిత్య,
5వ తరగతి,
ఎంపిపి స్కూలు, సజ్జాపురం, నెల్లూరు

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అమ్మకు ఇక ఏ కష్టం రాకూడదని ...



గాలి, వాన నుండి, ఆకాశంలో ఎగిరే పక్షుల బెడద నుండి బిడ్డలను రక్షించుకునేందుకు తల్లి కోడి ఎంతలా ఆరాటపడుతుందో! బిడ్డలను కాపాడుకునేందుకు తన రెక్కలను ఎంత పెద్దగా విస్తరిస్తుందో చూస్తే, చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. నోరు లేని పక్షులు, జంతువులే బిడ్డలను కాపాడుకునేందుకు ఇంతలా తపన పడుతుంటే మన అమ్మలు ఇంకెంత కష్టపడతారో కదా! అలా తన ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ఓ తల్లి తన బిడ్డలను ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చేసింది. అంతర్జాతీయ అథ్లెట్ ప్రియాంక స్కిప్పర్, సోషల్ మీడియాలో ఇటీవల తన తల్లి గురించి, పిల్లల కోసం ఆమె పడ్డ కష్టం గురించి తన ఇన్‌స్టాలో రాసుకొచ్చింది. ఒంటరి తల్లిగా తన తల్లి పడ్డ అవమానాలు, అవహేళనల గురించి చెబుతూనే ఆమెకు తోడుగా నిలవడం కోసమే తాను క్రీడారంగాన్ని ఎంచుకున్నానని చెప్పారు ప్రియాంక.

ప్రియాంక కడుపులో ఉండగానే ఆమె తండ్రి చనిపోయాడు. తండ్రి జ్ఞాపకాలు ఏవీ లేకుండానే ఆమె బాల్యం గడిచింది. అయితే, పెరిగి పెద్దవుతున్న ప్రియాంకకు తల్లి ఒక్కత్తే పగలు, రాత్రి తేడా లేకుండా కష్టపడడం ఎంతో ఆశ్చర్యంగా అనిపించేది.



"తన ఆరోగ్యం దెబ్బతిన్నా అమ్మ ఎందుకు పనికివెళుతుందో అర్థమయ్యేది కాదు. కొంచెం పెద్దయ్యాక ఈ విషయమే అమ్మని అడిగాను. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త ప్రతి రోజూ హింస పెడుతున్నా పిల్లల కోసం ఆ బాధను భరించానని అమ్మ చెప్పింది. ఇద్దరు తోబుట్టువులు తరువాత నేను కడుపులో ఉన్నప్పుడే నాన్న చనిపోతే అత్తింటి వారు అమ్మను ఇంటి నుండి గెంటేశారు. పుట్టింటి వారి ఆదరణా లేదని అమ్మ చెప్పింది. అందుకే తన బిడ్డల కోసం ఇంతలా కష్టపడుతున్నానని చెప్పింది. ఆ మాటలు నా మనసులో బలంగా నాటుకున్నాయి. నేను పెద్దయ్యాక అమ్మకు ఏ కష్టం లేకుండా చూసుకోవాలనుకున్నాను. చదువొక్కటే అమ్మ కష్టాన్ని దూరం చేయదు. ఇంకేదైనా చేయాలి. అప్పుడే నాకెంతో ఇష్టమైన ఫిటెనెస్ వైపు అడుగులు వేశాను. స్కిప్పర్‌గా రాణించాను. విజయంతో నేను గెలిచిన ప్రతి అవార్డు అమ్మ కళ్లల్లో ఎనలేని సంతోషాన్ని తెచ్చిపెట్టింది" అంటూ ఎంతో భావోద్వేగంగా ప్రియాంక తన అమ్మ గురించి చెప్పుకొచ్చింది.

జాతీయ రోప్ స్కిప్పింగ్‌లో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్న ప్రియాంక, తన పేరు మీద మూడు అంతర్జాతీయ రికార్డులను కూడా సాధించింది. ఎనిమిది జాతీయ బంగారు పతకాలు సాధించిన ప్రియాంక, తన తల్లి గురించి ఇంకా ఇలా రాసింది.

"నాన్న చనిపోయిన తరువాత అమ్మ తన పుట్టింటికి వెళ్లింది. అక్కడ బలవంతంగా గర్భస్రావం చేయాలని చూశారు. రెండో పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేశారు. ఈ పరిస్థితుల్లో ఇంటి నుండి బయటికి రావడం తప్ప అమ్మకు మరో మార్గం లేదు. చిన్న ఉద్యోగం సంపాదించి, చాలీ చాలని జీతంతోనే మమ్మల్ని చదివించింది. చిన్నప్పుడు మేము ఇంటి నుండి బయటికి కూడా వచ్చేవారం కాదు. మా కోసం అమ్మ పడుతున్న కష్టం అర్థమయ్యాక, తనని ఎలాగైనా సంతోషపెట్టాలని చూశాం. మేం పెరిగి పెద్దయ్యేసరికి అమ్మ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. రెండు కిడ్నీలు పాడై అమ్మ తీవ్ర అనారోగ్యానికి గురైంది. జీవితంలో త్వరగా ఎదగాలని, అమ్మను సంతోషపెట్టాలని, చదువుతో పాటు మేము ఆటల వైపు కూడా దృష్టి పెట్టాం. డాడ్జ్‌బాల్‌లో అన్నయ్య జాతీయస్థాయిలో సత్తా చూపాడు. మొట్టమొదటి సారి అన్నయ్య విజయం సాధించినప్పుడు రూ.14 వేల క్యాష్ ప్రైజ్ ఇచ్చారు. ఆ రోజు అది మాకు చాలా పెద్ద మొత్తం. పతకాల కంటే ఎంతో విలువైనది కూడా! ఆ రోజునే నేను కూడా నిశ్చయించుకున్నాను. అమ్మకు సాయంగా నిలవాలంటే నేను కూడా క్రీడాకారిణిగా రాణించాలనుకున్నాను. రోప్ స్కిప్పింగ్‌లో సత్తా చాటాను. స్కాలర్‌షిప్‌లు సాధించాను. నేను గెలుచుకున్న బంగారు, వెండి, రజత పతకాలను అమ్మకు బహుమతిగా ఇచ్చాను" అంటూ సుదీర్ఘంగా తన తల్లి గురించి రాసుకొచ్చింది.

సోషల్ మీడియా వేదికగా డబ్బు ఆర్జన చేయొచ్చని తెలిసి, ప్రియాంక ఆ దిశగా కూడా ప్రయత్నించింది. మొదట టిక్‌టాక్ వీడియోస్ చేసి లక్షలాది అనుచరులను సంపాదించుకొంది. "ఆ తరువాత దేశంలో టిక్‌టాక్ బ్యాన్ అవ్వడంతో ఒక్కసారిగా నిరుత్సాహపడిపోయాను. చాలా రోజులు కోలుకోలేదు. దాని ద్వారా వచ్చిన డబ్బులతో అమ్మను సంతోషపెట్టాలనుకున్నాను. ఫలితం చేతికందే దశలో అంతా వృథా అయింది. ఆ దిగులు చాలా రోజులు వేధించింది. అయితే స్నేహితులు ఇచ్చిన సలహాతో కొన్ని రోజులకే ఇన్‌స్టా వేదికగా నా అనుచరులను తిరిగి తెచ్చుకున్నాను. మాకు ఎవరి అండా లేదు. ఏ పెద్దలూ మమ్మల్ని ప్రోత్సహించరు. మా తోబుట్టువులందరం ఒకరికొకరు తోడుగా నిలబడతాం. అమ్మకు ఆసరా ఇవ్వాలనుకుంటాం. అమ్మే మా బలం. బలహీనత" అని పేర్కొంది.

"జీవితం చాలా చిన్నది. అది ముగిసిన రోజున పశ్చాత్తాప పడకుండా ఉండాలంటే సంపూర్ణవంతంగా జీవించండి" అంటూ తన ఫాలోవర్స్‌కి సూచించింది ప్రియాంక. విజయం సాధించిన ప్రతి ఒక్కరి వెనుకా కన్నీళ్లు తెప్పించే జీవితం ఒకటి ఉంటుందనడానికి ప్రియాంక జీవితం ఒక ఉదాహరణ.



సుగంధి ఆరోగ్యమండి..

వేసవిలో తాగే ప్రత్యేక పానీయాల్లో సుగంధి సోడా ఒకటి. రాయలసీమలో ఎక్కువగా పెరిగే ఈ సుగంధి పాల చెట్టు వేర్లను ఉపయోగించి తయారు చేసిన పానీయాన్ని నన్నారి అని కూడా పిలుస్తారు. ఇది శరీర వేడిని తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఒకప్పుడు కడప జిల్లాలోనే దొరికిన నన్నారి ఇప్పుడు అన్ని ప్రాంతాలకు విస్తరించింది.

నన్నారి ప్రయోజనాలు :

- నన్నారి వేరు సహజ శరీర శీతలకరణిగా పనిచేస్తుంది. వేసవిలో దీన్ని షర్బత్‌గా తీసుకుంటే డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చేస్తుంది. ఎండలో బయటకు వెళ్లొచ్చిన తర్వాత ఒక గ్లాసు నన్నారి షర్బత్ తాగితే చాలా ప్రశాంతంగా ఉంటుంది.
- నన్నారి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. ప్రత్యేకించి, సాంప్రదాయ బెల్లంతో తయారు చేసినట్లయితే, అత్యుత్తమ ఆరోగ్య టానిక్‌గా పనిచేసి, శక్తి స్థాయిలను పెంచుతుంది.
- నన్నారి షర్బత్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. అజీర్ణం, ఆకలి లేకపోవడం వంటి సమస్యలకు నివారిస్తుంది.
- ఒక గ్లాసు నన్నారి షర్బత్ తీసుకోవడం వల్ల మలబద్ధక సమస్య నివారణ అవుతుంది. పేగులు శుభ్రమవుతాయి.
- ఈ షర్బత్ యూరినరీ ఇన్ఫెక్షన్ల నుండి కాపాడుతుంది.

నన్నారి సిరప్ తయారీ..

మార్కెట్‌లో లభించే నన్నారి సిరప్‌లో సింథటిక్ రంగులు కలుపుతారు. కాబట్టి ఇంట్లో తయారు చేసుకోవడం ఉత్తమం. ముందుగా నన్నారి వేర్లను తీసుకొని బాగా శుభ్రం చేయాలి. తడి ఆరాక సుత్తి లేదా రోకలితో చితకొట్టి మధ్యలో ఉండే తెల్లటి భాగాన్ని తీసేయాలి. వాటిని రెండు మూడు రోజులపాటు బాగా ఎండనివ్వాలి. ఎండిన వేర్లను తగినన్ని నీళ్లు పోసి బాగా మరిగించాలి. నీళ్లు పూర్తి రంగు మారతాయి. ఈ నీటిని ఒక రోజంతా అలాగే ఉంచాలి. మరుసటి రోజు నీటిని వడగట్టి అందులో పంచదార / బెల్లం / తాటిబెల్లం వేసి చిక్కబడేవరకు మరిగించాలి. పానకాన్ని చల్లారాక గాజుసీసాలో వేసి ఫ్రిజ్‌లో నిల్వ చేసుకోవాలి. అవసరమైనప్పుడు ఒక గ్లాసు చల్లని నీటిలో లేదా సోడాలో రెండు స్పూన్ల నన్నారి సిరప్, కొద్దిగా నిమ్మరసం, నానబెట్టిన సబ్జాగింజలు కలుపుకొని తాగాలి.



ఫిబ్రవరి 12న 'హరిహర వీరమల్లు' విడుదల

పవన్ కళ్యాణ్, డైరెక్టర్ క్రిష్ కాంబినేషన్‌లో ఎఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్‌రావు నిర్మిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ సినిమా వాయిదాపడినట్లేనని సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలు వస్తున్న విషయం తెలిసిందే. గందర గోళాన్ని తొలగించేందుకు మేకర్స్ వెంటనే క్లారిటీ ఇచ్చారు. శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని 2025 ఫిబ్రవరి 12న సినిమా విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. ఈ లోపు టీజర్ కూడా విడుదల చేస్తామని కూడా పేర్కొన్నారు.

'జై హనుమాన్' పోస్టర్ విడుదల



ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన చిత్రం హనుమాన్. తేజ సజ్జా ప్రధాన పాత్రలో తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ కలెక్షన్ల వర్షం కురిపించింది. హనుమాన్ సూపర్ హిట్ కావడంతో ఈ చిత్రానికి సీక్వెల్‌గా జైహనుమాన్‌ను తీస్తున్నారు. శ్రీరామనవమి సందర్భంగా బుధవారంనాడు 'జై హనుమాన్' మూవీ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ విషయాన్ని తన ట్విటర్ ద్వారా వెల్లడించారు. హనుమాన్ కంటే అద్భుతంగా ఈ సినిమాను తెరకెక్కించనున్నట్లు తెలిపారు. జై హనుమాన్ చిత్ర పనులు ఏడాది కిందటే మొదలు పెట్టామని ప్రశాంత్‌వర్మ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. కథ సిద్ధంగా ఉందని.. ఎలా తీయాలో అన్న విషయంపై ఇంకా వర్క్ జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. విఎఫ్‌ఎక్స్‌తో పాటు మిగిలిన వాటిపై ఓ క్లారిటీ రాగానే షూటింగ్ మొదలవుతుందన్నారు. రాబోయే సినిమాల నాణ్యత విషయంలో అస్సలు రాజీపడేది లేదని ప్రశాంత్ వర్మ చెప్పుకొచ్చారు.



జాన్వీ కొత్త సినిమా 'ఉలజ్'

బాలీవుడ్ హీరోయిన్ జాన్వీకపూర్ 'దేవర' సినిమాలో ఎన్‌టిఆర్‌తో కలిసి నటిస్తున్నారు. తాజాగా ఆమె ప్రధాన పాత్రలో తెరెకక్కుతున్న తాజా చిత్రం 'ఉలజ్'. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ విదేశీ రాయబారి పాత్రలో కనిపించనుంది. సుధాన్షు సరియా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తే స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. విదేశాల్లో గూఢచర్యంపై కథాంశంగా రూపొందించినట్లు కనిపిస్తోంది. గుల్షన్ దేవయ్య, రోషన్ మాథ్యూ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆదిల్ హుస్సేన్, రాజేష్ తైలాంగ్, మెయాంగ్ చాంగ్, రాజేంద్ర గుప్తా, జితేంద్ర జోషి ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. జంగిల్ పిక్చర్స్ పతాకంపై వినీత్ జైన్ నిర్మించిన ఈ చిత్రం జూలై 5, విడుదలకానుంది. ఈ చిత్రం ద్వారా జాన్వీ కపూర్ యాక్షన్ జోనర్‌లో అడుగు పెట్టింది. హీరో రామ్‌చరణ్‌తో కలిసి మరో సినిమాలో నటించనుంది. బాలీవుడ్‌లోనూ కరణ్ జోహార్ మూవీ 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' షూటింగ్ ఇటీవలే పూర్తి చేసుకుంది.



వెంకటేష్ చిత్రానికి ఆడిషన్స్


వెంకటేష్, అనిల్‌రావీపూడి కాంబినేషన్లో రాబోతున్న చిత్రం నుండి తాజా అప్డేట్ ఒకటి బయటికి వచ్చింది. ఈ మూవీలో నటించే ఆర్టిస్టులు కోసం కాస్టింగ్ కాల్‌ని మేకర్స్ రిలీజ్ చేసారు. గోదావరి స్లాంగ్ మాట్లాడేవారు కావాలంటూ ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ సినిమాలో నటించేందుకు పిల్లలు, పెద్దలు కావాలని ఆ పోస్టర్‌లో ప్రకటించారు. 'ఈ సినిమాపై ఇంట్రెస్ట్ ఉన్నవాళ్లు VENKYANILO3@GMAIL.COM లేదా వాట్సాప్ 8247812007కి మీకు సంబంధించిన యాక్టింగ్ వీడియోలు పంపాలం'టూ ఆ ప్రకటనలో ఉంది. కాస్టింగ్ లభించగానే ఈ సినిమా మొదలు కాబోతుందని సమాచారం.

'తంగలాన్' గ్లింప్స్



విక్రమ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్' చిత్రం నుండి తాజాగా గ్లింప్స్ విడుదల చేశారు. పా రంజిత్ రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్, జియో స్టూడియోస్ బ్యానర్స్‌పై ప్రొడ్యూసర్ కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. బుధవారం విక్రమ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ చిత్రబృందం ఈ స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేసింది. గ్లింప్స్ రిలీజ్ సందర్భంగా దర్శకుడు పా. రంజిత్ మాట్లాడుతూ, "తంగలాన్" సినిమాను చరిత్రలో జరిగిన కొన్ని యదార్థ ఘటనల నేపథ్యంతో తెరకెక్కిస్తున్నాం. ఆ అడ్వెంచర్ స్టోరీని రూపొందించడంలో హీరో విక్రమ్‌తో పాటు మూవీ టీమ్ ఎంతో సపోర్ట్ చేసింది. జియో స్టూడియోస్ ఈ సినిమా కోసం స్టూడియో గ్రీన్‌తో చేతులు కలపడం సంతోషంగా ఉంది. విక్రమ్ ఈ సినిమా కోసం ఎంతగా కష్టపడ్డారో ఈ గ్లింప్స్ మీకు చూపిస్తుంది' అన్నారు. ఈ చిత్రంలో పార్వతి తిరువొతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్థ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందింది.

'భారతీయుడు 2' సిద్ధార్థ్



కమల్ హాసన్ నటిస్తున్న 'భారతీయుడు 2' చిత్రం నుండి సిద్ధార్థ్ లుక్‌ని చిత్రబృందం విడుదలచేసింది. శంకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. జూన్ నెలలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ ఇటీవల ప్రకటించారు. బుధవారం సిద్ధార్థ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. 'మీ వైవిధ్యభరితమైన పాత్రలు, కాలాతీత ఆకర్షణ అందరినీ ఆకర్షిస్తూనే ఉన్నాయి.. ఇదిగో మీ ప్రయాణంలో మరో ఏడాది విజయం' అంటూ భారతీయుడు టీం సిద్ధార్థ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసింది .ఈ చిత్రంలో సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్.జె.సూర్య, బాబీ సింహ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ మ్యూజిక్ అందిస్తున్నారు.

పేస్‌కు గుజరాత్ దాసోహం

- సీజన్-17 అత్యల్ప స్కోర్ నమోదు
- 89పరుగులకే గుజరాత్ ఆలౌట్
- ఆరు వికెట్ల తేడాతో నెగ్గిన ఢిల్లీ




అహ్మదాబాద్: ఢిల్లీ పేసర్ల ధాటికి గుజరాత్ జెయింట్ జట్టు దాసోహమైంది. ముఖేష్ కుమార్, ఇషాంత్ శర్మ, స్టబ్స్ ధాటికి గుజరాత్ జట్టు కేవలం 89పరుగులకే కుప్పకూలింది. ఆ లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ 8.5ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించి ఈ సీజన్‌లో మూడో విజయాన్ని సొంతం చేసుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌కు ఆరంభం నుంచే ఢిల్లీ బౌలర్లు కట్టడి చేశారు. రషీద్ ఖాన్ (31) మాత్రమే జట్టుకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. కానీ అప్పటికే జట్టు మొత్తం విఫలం కావడంతో 89 పరుగుల వద్దనే గుజరాత్ ఆగి పోయింది. దీంతో 90 పరుగుల అత్యల్ప టార్గెట్‌తో బరిలోకి దిగిన ఢిల్లీ బ్యాటర్లు 8.5 ఓవర్లలోనే అవలీలగానే టార్గెట్‌ను చేధించారు. గుజరాత్ ఇన్నింగ్స్‌లో రెండో ఓవర్‌లోనే ఓపెనర్ శుభ్‌మన్ గిల్(8) ఔటవ్వగా.. నాలుగో ఓవర్‌లో ఐదో బంతికి మరో ఓపెనర్ వృద్ధిమాన్ సాహ(2) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. తొమ్మిదో ఓవర్‌లో అభినవ్ మనోహర్ (8), షారుక్ ఖాన్(0)ను రిషబ్ పంత్ స్టంపౌట్ చేశాడు. 12వ ఓవర్‌లో రెండో బంతికి రాహుల్ తెవాటియా (10) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. 15వ ఓవర్‌లో చివరి బంతికి మోహిత్ శర్మ (2).. సుమిత్‌కు క్యాచ్ ఇచ్చాడు. 18వ ఓవర్‌లో మొదటి బంతికే రషీద్ ఖాన్ (31) పంత్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నూర్ అహ్మద్, స్పెన్సర్ జాన్సన్ వెంటవెంటనే పెవిలియన్‌కు చేరారు. ఫలితంగా 17.3 ఓవర్ల వద్ద 89 పరుగులకే గుజరాత్ ఆలౌట్ అయ్యింది. ఛేదనలో జెక్ ఫ్రేజర్(20) దూకుడుగా ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టాడు. అతనికి పృథ్వీ షా(7) తోడయ్యాడు. కానీ జెక్ ఫ్రేజర్ దూకుడుకు స్పెన్సర్ జాన్సన్ చెక్ పెట్టాడు. ఫ్రేజర్ ఔటయిన కాసేపటికే పృథ్వీ షా కూడా పెవిలియన్‌కు పంపించారు. ఆ తర్వాత కాసేపటికే గుజరాత్ బౌలర్లు అభిషేక్ పొరెల్(15), షై హెూప్(19) వికెట్లను తీసి ఢిల్లీని టెన్షన్ పెట్టాలని అనుకున్నారు. కానీ రిషబ్ పంత్(16), సుమిత్ కుమార్(9) నిలకడగా ఆడుతూ టార్గెట్‌ను చేధించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రిషబ్ పంత్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు...

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: వృద్ధిమాన్ సాహ (బి)ముఖేశ్ కుమార్ 2, శుబ్‌మన్ గిల్ (సి)పృథ్వీ షా (బి)ఇషాంత్ 8, సాయి సుదర్శన్ (రనౌట్)సుమిత్ కుమార్ 12, డేవిడ్ మిల్లర్ (సి)పంత్ (బి)ఇషాంత్ 2, మనోహర్ (స్టంప్)పంత్ (బి)స్టంప్స్ 8, తెవాటియా (ఎల్‌బి)అక్షర్ 10, షారుక్ ఖాన్ (స్టంప్)స్టంప్స్ 0, రషీద్ ఖాన్ (సి)పంత్ (బి)ముఖేశ్ కుమార్ 31, మోహిత్ శర్మ (సి)సుమిత్ కుమార్ (బి)ఖలీల్ అహ్మద్ 2, నూర్ అహ్మద్ (బి)ముఖేశ్ కుమార్ 1, జాన్సన్ (నాటౌట్) 1, అదనం 12. (17.3ఓవర్లలో ఆలౌట్) 89పరుగులు. **వికెట్ల పతనం:** 1/11, 2/28, 3/28, 4/30, 5/47, 6/48, 7/66, 8/78, 9/89, 10/89 **బౌలింగ్:** ఖలీల్ 4-1-18-1, ఇషాంత్ 2-0-8-2, ముఖేశ్ కుమార్ 2.3-0-14-3, కుల్దీప్ 4-0-16-0, స్టంబ్స్ 1-0-11-2, అక్షర్ 4-0-17-1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి)జాన్సన్ (బి)వారియర్ 7, ఫ్రేజర్ (సి)మనోహర్ (బి)జాన్సన్ 20, పోరెల్ (బి)వారియర్ 15, హోప్ (సి)మోహిత్ శర్మ (బి)రషీద్ ఖాన్ 19, పంత్ (నాటౌట్) 16, సుమిత్ కుమార్ (నాటౌట్) 9, అదనం 6. (8.5ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 92పరుగులు. వికెట్ల పతనం: 1/25, 2/31, 3/65, 4/67 బౌలింగ్: సందీప్ వారియర్ 3-0-40-2, జాన్సన్ 2-0-22-1, రషీద్ ఖాన్ 2-0-12-1, నూర్ అహ్మద్ 1.5-0-14-0

శీతల్‌కు రజతం



న్యూఢిల్లీ: జాతీయ పారా ఆర్చరీ మీట్‌లో శీతల్ దేవి రజత పతకంతో మెరిసింది. ఆసియా పారా క్రీడల్లో స్వర్ణ పతకం నెగ్గిన శీతల్ దేవి ఖేలో ఇండియా ఎన్‌టిపిసి ర్యాంకింగ్స్‌లో పతకంతో మెరిసింది. డిడిఎ యమున స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఫైనల్లో 17ఏళ్ల శీతల్ కాంపౌండ్ విభాగంలో 138-140తో ఏక్తా చేతిలో ఓటమిపాలైంది. చైనాలోని హాంగ్జౌ వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ, రజత పతకాన్ని సాధించిన శీతల్‌కు ఇటీవల భారత ప్రభుత్వం అర్జున అవార్డుతో సత్కరించింది. రెండు చేతులు లేకున్నా ఆర్చరీలో పతకాలు కొల్లగొడుతున్న శీతల్ ఆర్చర్లందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

గ్రూప్ స్టేజ్‌లోనే ఓడిన శ్రీజ, మనిక

మకావ్(చైనా): అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్(ఐటిటిఎఫ్) ప్రపంచకప్‌లో భారత టిటి క్రీడాకారిణిలు శ్రీజ ఆకుల, మనిక భత్రా గ్రూప్‌స్టేజ్‌లోనే ఓటమిపాలయ్యారు. 16జట్లు పాల్గొంటున్న ఈ పోటీల్లో భారత్ తరఫున పురుషుల, మహిళల జట్లు బరిలోకి దిగాయి. బుధవారం జరిగిన గ్రూప్ పోటీలో 1-3తేడాతో చైనా చేతిలో ఓటమిపాలైంది. 39వ ర్యాంకర్ శ్రీజ 4-11,, 4-11, 15-13, 2-11తో ఒలింపిక్ ఛాంపియన్, 4వ ర్యాంకర్ చెన్ మెంగ్ చేతిలో ఓటమిపాలైంది. ఇక 37వ ర్యాంకర్ మనిక 6-11, 4-11, 9-11, 4-11తో 2వ ర్యాంకర్ మన్యు చేతిలో వరుససెట్లలో ఓడింది. ప్రతి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన జట్టు నాకౌట్‌కు చేరతాయి.

చరిత్ర సృష్టించిన నాగల్

నేరుగా ఫ్రెంచ్ ఓపెన్‌కు అర్హత



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో నేరుగా మెయిన్ డ్రాలో చోటు దక్కించుకున్న తొలి ఆటగానిగా భారత్‌కు చెందిన సుమిత్ నాగల్ రికార్డు నెలకొల్పాడు. ఇటీవల జరిగిన మోంటోకార్లో టోర్నమెంట్ అర్హత, తొలిరౌండ్ పోటీల్లో విజయం సాధించడంతో టాప్-80లో చోటు దక్కించుకున్నాడు. 2019లో ప్రజ్ఞేష్ గుణ్ణేశ్వరన్ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రాకు చేరిన మరో ఆటగాడు నాగల్ మాత్రమే. ఏటిపి-99 ర్యాంకింగ్స్‌లో ఉన్న ఆటగాళ్లకు నేరుగా ప్రధాన టోర్నీలో ఆడే అవకాశం ఉంది. ఇక తుంటిగాయం కారణంగా ఏడాదిగా టెన్నిస్‌కు దూరంగా ఉన్న 14సార్లు ఫ్రెంచ్‌ఓపెన్ గ్రాండ్‌స్లామ్ విజేత, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ తిరిగి బరిలోకి దిగనున్నాడు. అతడు 10వ ర్యాంక్‌తో ఈసారి బరిలోకి దిగనున్నాడు. పురుషుల విభాగంలో నొవాక్ జకోవిచ్(సెర్బియా), మహిళల విభాగంలో ఇగా స్వైటెక్(పోలండ్) టాప్‌ర్యాంక్ దక్కింది. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ రోలాండ్ గారోస్‌లో మే 20నుంచి జూన్ 9వరకు జరగనుంది. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ కరోలినా ముఛోవా గాయం కారణంగా ఈ ఏడాది గ్రాండ్‌స్లామ్ టోర్నీకి దూరమైంది.

ఐపిఎల్‌లో నేడు

పంజాబ్ × ముంబయి

వేదిక: ఛండీగడ్; రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	7	6	1	12	0.67
కోల్‌కతా	6	4	2	8	1.39
చెన్నై	6	4	2	8	0.72
సన్‌రైజర్స్	6	4	2	8	0.50
లక్నో	6	3	3	6	0.03
ఢిల్లీ క్యాపిటల్స్	7	3	4	6	-0.07
గుజరాత్	7	3	4	6	-1.30
పంజాబ్‌కింగ్స్	6	2	4	4	-0.23
ముంబయి	6	2	4	4	-0.23
బెంగళూరు	7	1	6	2	-1.18

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at